LGTV

# లోకల్ గైడ్ తెలంగాణ

ద్విభాషా దినపత్రిక

www.localguidenews.com




ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 12, | సంచిక 164, | పేజీలు -12 | మంగళవారం - 29 - ఏప్రిల్ - 2025 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,

# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..?





## జానారెడ్డితో సీఎం భేటీ..

జానారెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కే కేశవరావు పార్టీలో చర్చిస్తారని తెలిపారు.

కేసీఆర్‌పై మండిపడ్డ సీఎం రేవంత్‌రెడ్డి

కేసీఆర్ ప్రసంగం అక్కసుతో ఉందని, స్పష్టత లోపించిందని విమర్శ

ఖజానా ఖాళీ చేసి నిందలు వేస్తున్నారని కేసీఆర్‌పై ఆరోపణ

రాహుల్ గాంధీతో తనకు గ్యాప్ లేదని స్పష్టం చేసిన రేవంత్

మావోయిస్టులతో చర్చలకు శాంతి కమిటీ ఏర్పాటుపై జానారెడ్డితో సీఎం భేటీ

(లోకల్ గైడ్):ఎల్కతుర్తి: తబీఆర్ఎస్ ఎల్కతుర్తిలో నిర్వహించిన పార్టీ రజతోత్సవ సభలో ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రసంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ ప్రసంగం పూర్తిగా అక్కసుతో నిండి ఉందని, ఆయన మాటల్లో స్పష్టత కొరవడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ఖజానాను కేసీఆర్ పూర్తిగా ఖాళీ చేసి, ఇప్పుడు మిగతా..2లో

## కేసీఆర్.. సోనియా ఆశీస్సులు తీసుకోలేదా?

(లోకల్ గైడ్):నల్గొండ: కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్‌లోనూ కాంగ్రెస్‌ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు. నల్గొండ కలెక్టరేట్‌లో అదనపు బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు. మిగతా..2లో

## తెలంగాణకు తీరని అన్యాయం చేసింది కేసీఆరే

కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట



- నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు
- "గత భారాస ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది

## విడతల వారీగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ప్రతి అధికారి కూడా రైతు కుటుంబం నుంచే వచ్చినవారే

- పటిష్ఠమైన భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తయారు చేసింది
- రైతులను ఇబ్బంది పెట్టకుండా సక్రమంగా అమలు చేసే బాధ్యత అధికారులదే
- ప్రభుత్వం 20 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది


2లో

(లోకల్ గైడ్):ఎల్కతుర్తి: పటిష్ఠమైన భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తయారు చేసిందని, రైతులను ఇబ్బంది పెట్టకుండా సక్రమంగా అమలు చేసే బాధ్యత అధికారులదేనని



## రేవంత్ రెడ్డిని కలిసిన తెలంగాణ తదుపరి సీఎస్ రామకృష్ణారావు

- తెలంగాణ నూతన సీఎస్ గా కె. రామకృష్ణారావు
- సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన రామకృష్ణారావు
- ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత సీఎస్ శాంతికుమారి మిగతా..2లో

## గేమ్ చేంజర్ డీల్...

భారత్-ఫ్రాన్స్ మధ్య 26 రఫేల్ యుద్ధ విమానాలకు ఒప్పందం



భారత్-ఫ్రాన్స్ మధ్య రూ.63,000 కోట్ల విలువైన రక్షణ ఒప్పందం

భారత నౌకాదళం కోసం 26 రఫేల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలు

స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి కార్యకలాపాలు

37 నుంచి 65 నెలల్లో విమానాల డెలివరీ పూర్తి

(లోకల్ గైడ్):ఢిల్లీ: భారత నౌకాదళ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే దిశగా కీలక ముందడుగు పడింది. ఫ్రాన్స్ నుంచి 26 రఫేల్ మెరైన్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు ఇరు దేశాల మధ్య సోమవారం మెగా ఒప్పందం కుదిరింది. సుమారు రూ.63,000 కోట్ల విలువైన ఈ ఒప్పందంపై భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, ఫ్రాన్స్ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో నేవీ వైస్ చీఫ్ అడ్మిరల్ మిగతా..2లో




## తెలంగాణలో స్మితా సబర్వాల్ సహా 20 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు

- తెలంగాణలో 20 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్
- రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శిగా స్మితా సభర్వాల్ బదిలీ


2లో

## హామీ నిలబెట్టుకున్నాం

చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్

చేపల వేట నిషేధ భృతిని రూ. 10 వేల నుంచి రూ. 20 వేలకు పెంచిన కూటమి ప్రభుత్వం

శ్రీకాకుళంలో పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

హామీ నెరవేర్చడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం

# అక్కడి కంపెనీల సీఈవోలు తెలుగు వాళ్లే

అమరావతి విట్ వర్సిటీలో అభివృద్ధి పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు

- స్టార్టప్‌ల కోసం 'వి-లాంచ్ ప్యాడ్ 2025'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి.
- గతంలో ఐటీని ప్రోత్సహించా, ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీకి ప్రాధాన్యం: సీఎం.
- మే 2న ప్రధాని మోదీ అమరావతికి రాక, రాజధాని పనులు పునఃప్రారంభం.
- విట్‌లో 95% ప్లేస్‌మెంట్లుబీ ఉద్యోగాలు ఇవ్వాలని విద్యార్థులకు సూచన.






(లోకల్ గైడ్):అమరావతి: ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో భారతీయులు, ప్రత్యేకించి తెలుగువారు కీలక స్థానాల్లో రాణిస్తున్నారని, సిలికాన్ వ్యాలీ వంటి టెక్నాలజీ కేంద్రాల్లో అనేక ప్రముఖ కంపెనీలకు సీఈఓలుగా వ్యవహరిస్తూ అగ్రస్థానంలో నిలుస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో నేడు జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా భారతీయులు, ముఖ్యంగా తెలుగువారు తమ ప్రతిభతో ఉన్నత స్థానాల్లో ఉంటున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా విట్-ఏపీ క్యాంపస్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం, నూతన స్టార్టప్ ఆలోచనలకు ఊతమిచ్చేందుకు ఏర్పాటు చేసిన 'వి-లాంచ్ ప్యాడ్ 2025' మిగతా..2లో



## పహల్గాం దాడి ఘటనపై గీత దాటొద్దు నేతలకు కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలు

అతిథులను కాపాడటంలో విఫలమయ్యా..: జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

పార్టీ అభిప్రాయాలకు విరుద్ధంగా వ్యాఖ్యలు చేసిన నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది

దేశ ప్రతిష్టకు వ్యతిరేకంగా ఎవరూ ఎటువంటి వ్యాఖ్యలు చేయకూడదు

ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేసేందుకు కేంద్రంతో సహకరించేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉంది




## పాక్‌కు దబిడి దిబిడే..!

- తాలిబాన్ నేతలతో భారత అధికారుల భేటీ!
- తాలిబన్ నేతలతో భారత ప్రత్యేక రాయబారి ఆనంద్ ప్రకాష్ సమావేశం
- ఆఫ్ఘనిస్తాన్ విదేశాంగ మంత్రి, రెండు దేశాల మధ్య ప్రజల రాకపోకలను సులభతరం చేయాలి
- వ్యాపారవేత్తలు, రోగులు, విద్యార్థులకు వీసా జారీ ప్రక్రియలను సులభతరం చేయాలి మిగతా..2లో

## మోదీతో రాజ్‌నాథ్ భేటీ..

భారత సైన్యం, సరిహద్దు భద్రతపై చర్చ!

పహల్గాం దాడితో సరిహద్దుల్లో అలజడి వాతావరణం నెలకొంది

భారత్ వైపు నుంచి దాడి ఉండొచ్చన్న అంచనాలతో పాక్ ముందస్తు చర్యలు తీసుకుంటోంది.

(లోకల్ గైడ్):ఢిల్లీ: పహల్గాం దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని మోదీతో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. దాదాపు 45 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. ఇక.. మోదీతో భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ కూడా పాల్గొన్నారు. మరోవైపు.. రక్షణ వ్యవహారాలపై మిగతా..2లో



## ప్రధాని మోదీ అమరావతి పర్యటన విజయవంతం చేద్దాం


2లో

రాజధాని పనుల పునఃప్రారంభానికి మే 2న రాష్ట్రానికి ప్రధాని మోదీ

ఈ నేపథ్యంలో ఎన్డీఏ నేతలతో ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్

సభకు తరలి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకూడదన్న చంద్రబాబు

అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అన్న సీఎం

## పాక్‌కు దబిడి దిబిడే..! తాలిబాన్ నేతలతో భారత అధికారుల భేటీ!

**(లోకల్ గైడ్):**ఢిల్లీ: తాలిబన్ నేతలతో భారత ప్రత్యేక రాయబారి ఆనంద్ ప్రకాష్ సమావేశం అయ్యారు. పలువురు అధికారులతో కలిసి ఆయన ఆఫ్ఘనిస్తాన్‌లోని కాబూల్‌కు వెళ్లారు. ఆఫ్ఘనిస్తాన్ విదేశాంగ మంత్రి మౌల్వీ అమీర్ ఖాన్ ముత్తాకితో ఈ సందర్భంగా భేటీ అయ్యారు. ద్వైపాక్షిక రాజకీయ సంబంధాలను బలోపేతం చేయడం, వాణిజ్యం, రవాణా సహకారాన్ని పెంపొందించడం, ఇటీవలి ప్రాంతీయ పరిణామాల చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాల ప్రాముఖ్యత, వీసా విధానాలను క్రమబద్ధీకరించడం, ప్రతినిధి బృందాల మార్పిడిని ప్రోత్సహించడం, వివిధ రంగాలలో సహకారాన్ని బలోపేతం చేయడంపై ఇరు దేశాల అధికారులు ప్రస్తావించారు. అలాగే జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడి తర్వాత భారత్, పాకిస్తాన్‌తో మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ఆఫ్ఘనిస్తాన్ విదేశాంగ మంత్రి, రెండు దేశాల మధ్య ప్రజల రాకపోకలను సులభతరం చేయాలని కోరారు. వ్యాపారవేత్తలు, రోగులు, విద్యార్థులకు వీసా జారీ ప్రక్రియలను సులభతరం చేయాలని భారత్ ను అభ్యర్థించారు. వివిధ రంగాలలో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకోవాలనే ఆశాభావాన్ని భారత రాయబారి ఆనంద్ ప్రకాష్ వ్యక్తం చేశారు. ఆఫ్ఘనిస్తాన్‌కు భారత్ తన సహాయాన్ని కొనసాగించాలనే ఉద్దేశ్యాన్ని వెల్లడించారు. గతంలో నిలిపివేసిన కొన్ని కార్యక్రమాలను తిరిగి ప్రారంభించడం, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టడానికి ఇండియా ఆసక్తి చూపిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## పహల్గాం దాడి ఘటనపై గీత దాటొద్దు నేతలకు కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలు

**(లోకల్ గైడ్):**ఇంటర్నెట్ డెస్క్: పహల్గాం దాడి విషయంలో కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో పార్టీ అధిష్ఠానం వారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నేతలు గీత దాటొద్దని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. పార్టీ అభిప్రాయాలకు విరుద్ధంగా వ్యాఖ్యలు చేసిన నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దేశ ప్రతిష్టకు వ్యతిరేకంగా ఎవరూ ఎటువంటి వ్యాఖ్యలు చేయకూడదని సూచించారు. ఈ మేరకు అధికారికంగా పార్టీ నేతలకు ఆర్డర్లు జారీ చేశారు. పహల్గాం దాడి దేశ ఐక్యత, సమగ్రతపై జరిగిన ప్రత్యక్ష దాడి అని అన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేసేందుకు కేంద్రంతో సహకరించేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. పహల్గాం దాడి అనంతరం భారత ప్రభుత్వం పాక్‌పై తీసుకుంటున్న కఠిన చర్యలను కొందరు కాంగ్రెస్ నేతలు తప్పుబట్టడంపై భాజపా ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత్‌ను కించపరిచేందుకు అనేక మంది కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను పాకిస్థాన్ తమ మీడియాలో ప్రసారం చేస్తోందని భాజపా ఎంపీ రవిశంకర్ ప్రసాద్ అన్నారు. శత్రువుల ముందు దేశాన్ని తక్కువ చేసేలా కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారని.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అగ్ర నేత రాహుల్ గాంధీ సొంత పార్టీ నేతలను నియంత్రించలేరా? అని ప్రశ్నించారు. ఉగ్రదాడి తర్వాత ప్రపంచం మొత్తం భారత్‌కు మద్దతుగా నిలిచిందని.. కానీ మనలో ఉన్నవారే మనకు వ్యతిరేకంగా మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. జాతీయ ఐక్యతపై కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్న మాటలన్నీ ఉత్తివేనా అని నిలదీశారు.

అతిథులను కాపాడటంలో విఫలమయ్యా..: జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

పహల్గాం ఉగ్రదాడి సమయంలో ఉగ్రవాదులు ప్రజలను చంపే ముందు వారి మతం గురించి అడిగి ఉండరని కాంగ్రెస్ కర్ణాటక మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర్ అనడం సిగ్గుచేటని రవిశంకర్ విమర్శించారు. ఉగ్రదాడితో తనకు సంబంధం లేదని పాకిస్థాన్ చెబుతున్నా సింధూ జలాలను ఆపివేయడం సమంజసం కాదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత సైఫుద్దీన్ సోజ్ ఇటీవల వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌లో తాగునీటి అవసరాలకు, వ్యవసాయానికి నీరు చాలా ముఖ్యమని.. సింధూ జలాలను పాక్‌కు మళ్లించకపోతే పంజాబ్, జమ్మూకశ్మీర్ పూర్తిగా మునిగిపోతాయని ఆయన అన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా మొదలైన కాంగ్రెస్ నేతలు పాక్‌కు మద్దతుగా వ్యాఖ్యలు చేయడంతో దేశవ్యాప్తంగా వారిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## హామీ నిలబెట్టుకున్నాం

### చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్

**(లోకల్ గైడ్):**అమరావతి: ఆంధ్రప్రదేశ్ లోని మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే ఆర్థిక భృతిని రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గతంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 10,000 భృతిగా అందేది. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ మొత్తాన్ని రూ. 20,000కు పెంచినట్లు పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల హామీని కార్యరూపం దాల్చేలా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. "మత్స్యకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. వేట నిషేధ భృతిని రెట్టింపు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పెంచిన భృతి మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ పెంపుదల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,29,178 మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని, ఇందుకోసం ప్రభుత్వం రూ. 259 కోట్లను కేటాయించిందని వెల్లడించారు. మత్స్యకారుల వలసలను తగ్గించి, స్థానికంగానే వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పవన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కు సుదీర్ఘమైన సముద్ర తీరం ఉందని, ఈ తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని తన ప్రకటనలో స్పష్టం చేశారు.

## రేవంత్ రెడ్డిని కలిసిన తెలంగాణ తదుపరి సీఎస్ రామకృష్ణారావు

**(లోకల్ గైడ్):**హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె. రామకృష్ణారావు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ప్రభుత్వం కె. రామకృష్ణారావును నూతన సీఎస్ గా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం కె. రామకృష్ణారావు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీనియారిటీ జాబితా ప్రకారం ఆయనతో పాటు మరో ఆరుగురు అధికారులు ప్రధాన కార్యదర్శి పదవి రేసులో ఉండగా, ప్రభుత్వం అన్ని అంశాలను పరిశీలించి కె. రామకృష్ణారావును నియమించాలని నిర్ణయించింది. ఆయన 2014 సంవత్సరం నుంచి ఆర్థిక శాఖ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

## విడతల వారీగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మొదటి పేజి తరువాయి

సక్రమంగా అమలు చేసే బాధ్యత అధికారులదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి అధికారి కూడా రైతు కుటుంబం నుంచే వచ్చినవారే ఉంటారు. వారి కష్టాలు తెలుసు కాబట్టి వాళ్లను ఇబ్బంది పెట్టకుండా సమస్య పరిష్కరించాలి. ఈ ప్రభుత్వం 20 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తొలి విడతలో అత్యంత పేదవారికి ప్రాధాన్యత ఇస్తున్నాం. విడతల వారీగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం." అని అన్నారు.

## తెలంగాణకు తీరని అన్యాయం చేసింది కేసీఆరే

మొదటి పేజి తరువాయి

"గత భారాస ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. డిండి, ఏదుల ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ పని ప్రారంభించిన కొన్ని రోజులకే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా ఎస్-ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు నల్గొండ జిల్లా నాయకులం ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాం. ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో ప్రజలు సహకరించాలి. రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం. డిండి ఎత్తిపోతల పథకాన్ని సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ వరకు పొడిగిస్తాం. పూడిక వల్ల ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం తగ్గింది. ఎస్ఆర్ఎస్పీ ఫేజ్-2 పనులను పూర్తి చేస్తే.. ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీటి సమస్య తీరుతుంది. సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల ఖర్చు చేసి, భారాస నేతలు జేబులు నింపుకొన్నారు. భారాస నేతల కమీషన్ల కక్కుర్తి వల్లే, రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నాణ్యత లోపించి మూడేళ్లలోనే కూలిపోయింది. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి.. అప్పులు చేసి కాళేశ్వరం పేరిట రూ. లక్ష కోట్లు ఖర్చు చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని ఎన్‌డీఎస్ఏ చెప్పింది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని ఒప్పుకొని రాష్ట్రానికి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కానీ, తెలంగాణకే 500 టీఎంసీలు కేటాయించాలని ఈ ప్రభుత్వం పోరాడుతోంది" అని ఉత్తమ్ అన్నారు.

కేసీఆర్.. సోనియా ఆశీస్సులు తీసుకోలేదా?: కోమటిరెడ్డి

'తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కేసీఆర్ అనలేదా?' అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడు ఆయనే.. తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "తెలంగాణ ఇచ్చినప్పుడు కుటుంబ సమేతంగా వెళ్లి సోనియాగాంధీ ఆశీస్సులు తీసుకోలేదా? హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని అసెంబ్లీలో కేసీఆర్ అనలేదా? ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం క్రమక్రమంగా నెరవేరుస్తోంది. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి రూ.10వేల కోట్లు దోచుకుతిన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి వేల ఎకరాలు ఆక్రమించుకున్నారు. మంత్రులు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి.. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. పదేళ్లు పాలించిన కేసీఆర్.. ఉద్యోగులకు సరిగా జీతాలు కూడా ఇవ్వలేదు" అని విమర్శించారు.

# ప్రధాని మోదీ అమరావతి పర్యటన విజయవంతం చేద్దాం

అమరావతి: అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభానికి మే 2న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలకడంతో పాటు సభను విజయవంతం చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నేతలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ పర్యటనపై ఎన్డీఏ నేతలకు సీఎం చంద్రబాబు సోమవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు.

### అమరావతి ఆంధ్రప్రదేశ్ ప్రజల గర్వకారణం

"ఒక కుటుంబం నివసించేందుకు మంచి ఇల్లు ఉండాలని ఎలా అనుకుంటామో ప్రజలు గర్వంగా చెప్పుకోవడానికి కూడా రాజధాని ఉండాలి. అభివృద్ధి వికేంద్రీకరణ ఎన్డీఏ విధానం కాబట్టే 2014 నుంచి కేంద్ర విద్యా సంస్థలు ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం. తెలంగాణకు హైదరాబాద్, కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధానుల ద్వారా 70 శాతం ఆదాయం వస్తోంది. మనకు కూడా మంచి నగరం ఉంటే రాష్ట్రానికి సమృద్ధిగా ఆదాయం సమకూరుతుందని అమరావతిని నిర్మిస్తున్నాం. రాష్ట్రానికి అమరావతి ఆత్మ వంటిది" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

### ప్రజల్ని తప్పుదారి పట్టించే వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. వారు ఇచ్చిన భూముల్లోనే రాజధాని నిర్మించడంతో పాటు తిరిగి వారికి రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తున్నాం. రాజధానిలో రైతులను భాగస్వాములను చేస్తున్నాం. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయి. రోడ్ల నిర్మాణం జరిగితే రవాణా సౌకర్యం పెరగడంతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. కానీ కొన్ని వ్యతిరేక శక్తులు కుట్రతో ప్రజలను కావాలనే తప్పుదోవ పట్టిస్తాయి. అభివృద్ధిపై బురద జల్లే ప్రయత్నం చేస్తుంటాయి. మనం ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు చేస్తున్న మంచి పనులను గురించి కూడా వివరించాలి. ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకుని ప్రజలకు తెలియజేయాలి. ఇబ్బందులను అధిగమిస్తూనే సంక్షేమం, అభివృద్ధి బాటను వీడటం లేదు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

### హామీలు నెరవేర్చుకుంటూ ముందుకు

"అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకెళుతున్నాం. పోలవరానికి నిధులు, విశాఖ రైల్వే జోన్ మంజూరు, స్టీల్ ప్లాంట్‌కు రూ.11,400 కేంద్రం కేటాయించింది. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పటికే మత్స్యకారుల సేవలో, ఎస్సీ వర్గీకరణ, అన్నక్యాంటీన్లు, పింఛన్లు, 3 గ్యాస్ సిలిండర్లు అందించడంతో పాటు 16,347 ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. వచ్చే నెల రైతులకు అన్నదాత కింద పెట్టుబడి సాయం అందిస్తాం" అని ముఖ్యమంత్రి చెప్పారు.

### లాజిస్టిక్ హబ్‌గా రాయలసీమ

"రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే 42 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుడతాం. 175 నియోజకవర్గాల్లోనూ రాబోయే రోజుల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి చేసి 'వన్ ఫ్యామిలీ... వన్ ఎంట్రప్రెన్యూర్' సాకారం దిశగా అడుగులు వేస్తాం. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడతాం. విశాఖను ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం. రామాయపట్నంలో ఎరైన్-కో, అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ దిగ్గజ కంపెనీలు లక్ష కోట్లతో పెట్టుబడులు పెడుతున్నాయి.

మిట్టల్ ప్లాంట్ పూర్తయితే రెండు స్టీల్ ప్లాంట్లు, దేశంలోనే ఎక్కువ స్టీల్ ఉత్పత్తి చేసే జిల్లాగా ఉమ్మడి విశాఖ రికార్డు సృష్టిస్తుంది. రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంచింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తాం. రాయలసీమకు బెంగళూరు, హైదరాబాద్ అనుసంధాన హైవేలు, ఎయిర్ పోర్టులు అందుబాటులో ఉంటాయి. తద్వారా లాజిస్టిక్ హబ్‌గా రాయలసీమ మారుతుంది" అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణలో స్మితా సబర్వాల్ సహా 20 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు

**(లోకల్ గైడ్):**హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలన యంత్రాంగంలో ఆదివారం నాడు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 21 మంది అధికారులకు కొత్త పోస్టింగులు ఇవ్వగా, కొందరికి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ బదిలీల్లో పలువురు సీనియర్ అధికారులు ఉండటం గమనార్హం. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) కమిషనర్ గా పనిచేస్తున్న ఇలంబర్తి కె. ను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిని పర్యవేక్షించే పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ గా ఉన్న ఆర్ వి కర్ణన్ ను జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ గా నియమించారు. ఇటీవల సోషల్ మీడియా పోస్ట్ వివాదంతో వార్తల్లో నిలిచిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ ను రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఆమె యువజన సర్వీసులు, పర్యాటకం, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బదిలీ అయినప్పుడు కూడా ఆమె ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శిగానే పనిచేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయేష్ రంజన్ కు కీలక బాధ్యతలు అప్పగించారు.

ఆయన్ను ముఖ్యమంత్రి కార్యాలయంలోని పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం (ఇండస్ట్రీ - ఇన్వెస్ట్ మెంట్ సెల్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీఈఓగా నియమించారు. అలాగే, యువజన సర్వీసులు, పర్యాటకం, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, పురావస్తు శాఖ డైరెక్టర్ గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ను పరిశ్రమలు, వాణిజ్య శాఖతో పాటు ఐటీ, క్రీడా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్ స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ గా ఉన్న డాక్టర్ శశాంక్ గోయల్ ను సుపరిపాలన కేంద్రం (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) వైస్ చైర్మన్ గా నియమించారు. ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ గా కూడా ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన ఎం. దాన కిషోర్ ను కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. దీంతో పాటు కార్మిక శాఖ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, ఉపాధి, శిక్షణ డైరెక్టర్ గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా కూడా ఆయన పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని సీఎంఓలోని ఇండస్ట్రీ - ఇన్వెస్ట్ మెంట్ సెల్ అదనపు సీఈఓగా బదిలీ చేశారు.

మూసీ రివర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గా ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. పురపాలక పరిపాలన కమిషనర్, డైరెక్టర్ టి.కె.శ్రీదేవిని హెచ్ఎండీఏ పరిధి బయట ఉన్న మున్సిపాలిటీల వ్యవహారాలు చూసే పురపాలక శాఖ కార్యదర్శిగా నియమించారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్, డైరెక్టర్ గా ఆమె పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు. ఇంకా, ఎస్ హరీష్ ను జెన్ కో సీఎండీగా, ఎస్ సంగీత సత్యనారాయణను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ గా, ఎస్ వెంకటరావును దేవాదాయ శాఖ డైరెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలువురు ఇతర అధికారులకు కూడా కొత్త పోస్టింగులు, అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## గేమ్ చేంజర్ డీల్...

### భారత్-ఫ్రాన్స్ మధ్య 26 రఫేల్ యుద్ధ విమానాలకు ఒప్పందం

ఈ కార్యక్రమంలో నేవీ వైస్ చీఫ్ అడ్మిరల్ కె. స్వామినాథన్ కూడా పాల్గొన్నారు. ప్రభుత్వం-ప్రభుత్వం మధ్య కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం, భారత నౌకాదళానికి 22 సింగిల్ సీట్ రఫేల్-ఎం జెట్స్, నాలుగు ట్విన్ సీట్ శిక్షణ విమానాలు అందనున్నాయి. ఈ యుద్ధ విమానాలు ప్రధానంగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ పై నుంచి తమ కార్యకలాపాలను నిర్వహిస్తాయి. కొద్ది రోజుల క్రితమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ ఒప్పందానికి ఆమోదం తెలిపింది. ఒప్పందంలో భాగంగా విమానాలతో పాటు కొన్ని రకాల ఆయుధాలు, సిమ్యులేటర్లు, సిబ్బందికి శిక్షణ, ఐదేళ్ల పాటు పనితీరు ఆధారిత లాజిస్టిక్స్ సహకారం కూడా ఫ్రాన్స్ అందించనుంది. ఒప్పందం విలువలో ప్రాథమికంగా 15 శాతం మొత్తాన్ని భారత్ చెల్లించనుంది. మొత్తం 26 విమానాల డెలివరీ ప్రక్రియ 37 నెలల నుంచి 65 నెలల మధ్య పూర్తవుతుందని, 2031 నాటికి అన్ని జెట్స్ నౌకాదళానికి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. సముద్ర లక్ష్యాలపై దాడులు, వాయు రక్షణ, నిఘా వంటి బహుళ ప్రయోజనకరమైన ఈ 4.5వ తరం రఫేల్ యుద్ధ విమానాలు అణ్వాయుధాలను ప్రయోగించగల సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాయి. ఈ జెట్స్‌లో 70 కిలోమీటర్ల పరిధి గల ఎక్సోసెట్ ఏఎం39 యాంటీ-షిప్ మిస్సైళ్లు, 300 కిలోమీటర్లకు పైగా దూరంలోని లక్ష్యాలను ఛేదించగల స్కాల్ప్ గగనతలం నుంచి భూమి పైకి ప్రయోగించే క్రూయిజ్ క్షిపణులు, 120-150 కిలోమీటర్ల పరిధిలో శత్రు విమానాలను ఎదుర్కోగల అత్యాధునిక మెటియోర్ ఎయిర్ టు ఎయిర్ క్షిపణులను కూడా అమర్చనున్నారు. 2022లో నౌకాదళం నిర్వహించిన విస్తృత స్థాయి పరీక్షల్లో అమెరికాకు చెందిన ఎఫ్/ఏ-18 సూపర్ హార్నెట్ కన్నా ఫ్రెంచ్ రఫేల్-ఎం మెరుగైన ప్రదర్శన కనబరిచింది. ఇప్పటికే భారత వైమానిక దళం 36 రఫేల్ జెట్స్‌ను వినియోగిస్తుండటంతో లాజిస్టిక్స్, విడిభాగాలు, నిర్వహణలో సౌలభ్యం కూడా రఫేల్-ఎం ఎంపికకు కలిసొచ్చింది. ప్రస్తుతం నౌకాదళం వద్ద రష్యా నుంచి 2009 తర్వాత కొనుగోలు చేసిన 45 మిగ్-29కె యుద్ధ విమానాల్లో సుమారు 40 మాత్రమే ఉన్నాయి. ఇవి ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్ విమాన వాహక నౌకల నుంచి పనిచేస్తున్నాయి. అయితే, మిగ్-29కె విమానాలు తరచూ నిర్వహణ సమస్యలు, సేవల లభ్యత లోపాలతో ఇబ్బంది పడుతున్నాయి. మరోవైపు, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్న ట్విన్ ఇంజిన్ డెక్ బేస్డ్ ఫైటర్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి మరో దశాబ్దం పట్టే అవకాశం ఉండటంతో, మధ్యంతర చర్యగా ఈ 26 రఫేల్-ఎం జెట్స్ కొనుగోలు చేయాలని నౌకాదళం నిర్ణయించింది. ఈ కొత్త యుద్ధ విమానాల చేరికతో హిందూ మహాసముద్రంలో భారత నౌకాదళ పటిష్టత మరింత పెరగనుంది.

## ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..?

మొదటి పేజి తరువాయి



ప్పుడు ఆ నిందను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి, తనకు మధ్య దూరం పెరిగిందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. రాహుల్ గాంధీతో తనకు ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని స్పష్టం చేశారు. అవసరాలకు అనుగుణంగా కేసీఆర్, ప్రధాని నరేంద్ర మోదీ తమ వైఖరిని మార్చుకుంటున్నారని విమర్శించారు. దేశానికి దివంగత ప్రధాని ఇందిరా గాంధీ లాంటి నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డితో సమావేశమయ్యారు. ఈ భేటీ సందర్భంగా పలు కీలక అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, రాష్ట్రంలో మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు వీలుగా ఒక శాంతి కమిటీని ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై పార్టీలో తదుపరి చర్చల బాధ్యతను జానారెడ్డి, మరో సీనియర్ నేత కె. కేశవరావు చూస్తారని చెప్పారు.

ఎమ్మెల్యేలకు హెచ్చరిక

ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలని, వారు వెళితేనే పథకాలు ప్రజల్లోకి వెళతాయని అన్నారు. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయని అన్నారు. ఇష్టానుసారంగా మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారని హెచ్చరించారు.

## మోదీతో రాజ్‌నాథ్ భేటీ.. భారత సైన్యం, సరిహద్దు భద్రతపై చర్చ!

మొదటి పేజి తరువాయి

మరోవైపు.. రక్షణ వ్యవహారాలపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కూడా భేటీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి ఘటనతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని వీడేవరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించిన భారత్.. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే పాక్ జాతీయులను వారి దేశానికి పంపించింది. మరోవైపు.. నియంత్రణ రేఖ వెంట ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించే పాక్.. కొన్నేళ్లుగా రూటు మార్చిందని నిఘా వర్గాలు జాతీయ మీడియాకు వెల్లడించాయి. ఆన్‌లైన్ వేదికగా కశ్మీరీ యువతను ఆకర్షించి, తమ భావజాలం వైపు మొగ్గు చూపిన వారికి సరైన పత్రాలతో వీసాలిచ్చి పాక్‌లోకి తీసుకెళ్తోందని పేర్కొన్నాయి. తీవ్రవాద భావజాలం ఉన్న వ్యక్తులను ఎంపిక చేసుకోవడంతో పాటు ఆయుధాలు వాడగల, దాడులు నిర్వహించగల సామర్థ్యం ఉన్నవారిని తమవైపు ఆకర్షిస్తోందని చెప్పాయి. కొన్నేళ్లలో ఇలా 300 మందికి పైగా కశ్మీర్ యువత అధికారిక ప్రయాణ పత్రాలతో పాక్‌కు ప్రయాణించారని పలు కథనాలు వెల్లడించాయి. వీరిలో పలువురు నిషేధిత ఉగ్రవాద శిబిరాల్లో శిక్షణ పొందుతున్నారు. తర్వాత ఉగ్రసంస్థల్లో చేరి, సరిహద్దు ద్వారా అక్రమంగా చొరబాట్లకు పాల్పడతారు. అనంతరం జమ్ముకశ్మీర్‌లోని పౌరులు, భద్రతా దళాలపై ఉగ్రదాడులు చేస్తారు. అయితే ఇలా చొరబాట్లకు పాల్పడినవారిలో 15 మంది ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. ప్రస్తుతం ఇలా శిక్షణ పొందిన తొమ్మిది మంది క్రియాశీలకంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్నారని సమాచారం. వారిలో కొందరు పాకిస్తాన్‌లో ఉండి, మరికొందరు కశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు సహకారం అందిస్తున్నారు.

పాక్‌కు సైనిక విమానాలు..

పహల్గాం దాడితో సరిహద్దుల్లో అలజడి వాతావరణం నెలకొంది. భారత్ వైపు నుంచి దాడి ఉండొచ్చన్న అంచనాలతో పాక్ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే సరిహద్దుల్లో అదనపు బలగాలను మోహరించినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా టర్కీకి చెందిన పలు సీ-130 హెర్క్యులస్ విమానాలు పాక్‌లో ల్యాండ్ అయ్యాయి. ఈ విమానాల్లో సైన్యానికి అవసరమైన కార్గోను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో, భారత్ కూడా అలర్ట్ అయ్యింది.

## అక్కడి కంపెనీల సీఈవోలు తెలుగు వాళ్లే

మొదటి పేజి తరువాయి

అనంతరం, నూతన స్టార్టప్ ఆలోచనలకు ఊతమిచ్చేందుకు ఏర్పాటు చేసిన 'వి-లాంచ్ ప్యాడ్ 2025' ఇంక్యుబేషన్ సెంటర్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. విద్యార్థులనుద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ, విట్-ఏపీలో 95 శాతం మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని, అయితే కేవలం ఉద్యోగాలతో సంతృప్తి చెందకుండా, వినూత్న ఆలోచనలతో నూతన సంస్థలను స్థాపించి, పది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐటీ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చానని, కేవలం 14 నెలల్లోనే హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించి చూపించామని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ఐటీయే భవిష్యత్తు అని చెప్పానని, ఇప్పుడు కాలం మారిందని, క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి నూతన సాంకేతికతలు కీలకంగా మారాయని అన్నారు. ఇప్పుడు ఈ నూతన టెక్నాలజీలను ప్రోత్సహించడంపై దృష్టి సారించానని స్పష్టం చేశారు. ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో అటెండర్ ఉద్యోగానికి కూడా తీవ్ర పోటీ ఉండేదని, కానీ నేడు ఐటీ రంగంలో ఉద్యోగాలకు యువత అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇది మారిన ప్రాధాన్యతలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విట్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.వి. కోటారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతిలో 5 లక్షల మంది విద్యార్థులు చదవాలి

డ్రోన్ సేవలను అందుబాటులోకి తెస్తున్నాం. ప్రభుత్వ సేవలను ఒకే తాటిమీదకి తెస్తున్నాం. రియల్ టైం డేటాతో సమస్యలకు రియల్ టైం పరిష్కారాలు చూపిస్తున్నాం. పీ4 ద్వారా పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నాం. 20శాతం సంపన్నులు 20శాతం పేదవారిని పైకి తీసుకురావాలి. ఒకప్పుడు జన్మభూమి కోసం చాలా మంది అలా పని చేశారు. ఇప్పుడు మార్గదర్శి, బంగారు కుటుంబం కోసం కలిసి రావాలి. కొత్తగా ఆలోచించడం ద్వారా యువత విజయం సాధించాలి. ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తయారు చేయాలి. అమరావతిలో 5 లక్షల మంది విద్యార్థులు చదవాలి. విట్‌లో 50 వేల మంది విద్యార్థులు ఉండాలి. కేవలం ఏపీ విద్యార్థులే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల విద్యార్థులు ఉండాలి. అమరావతిలో 30శాతం పచ్చదనం, నీరుతో నిండి ఉంటుంది. ఇప్పుడున్న వర్సిటీలతోపాటు మరికొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలు వస్తున్నాయి. మే 2న ప్రధానమంత్రి మోదీ అమరావతికి వస్తున్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పునఃప్రారంభం కాబోతోంది" అని చంద్రబాబు అన్నారు.

## కిమ్ జాంగ్ ఉన్ కు థ్యాంక్స్ చెప్పిన పుతిన్



**(లోకల్ గైడ్):**ఉత్తర కొరియా: ఉక్రెయిన్‌తో యుద్ధంలో తమకు సైనిక సహకారం అందించినందుకు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌కు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కృతజ్ఞతలు తెలిపారు. కర్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్ బలగాల నుంచి భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో ఉత్తర కొరియా సైనికులు గొప్ప స్నేహపూర్వకత, న్యాయంతో వ్యవహరించారని పుతిన్ కొనియాడారు. తమ సైనికులను రష్యాకు పంపినట్లు ఉత్తర కొరియా తొలిసారి అధికారికంగా అంగీకరించింది. గత ఆగస్టులో ఉక్రెయిన్ ఆకస్మిక దాడి చేసిన కర్స్క్ ప్రాంతంలోని కొన్ని ప్రదేశాలను విడిపించే పోరాటంలో తమ సైన్యం పాల్గొన్నట్లు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. తమ సైనికులను 'వీరులు'గా అభివర్ణించిన కిమ్ జోంగ్ ఉన్, యుద్ధంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని అంగీకరించారు. రష్యాతో ఉన్న పరస్పర రక్షణ ఒప్పందం మేరకే ఈ మోహరింపు జరిగినట్లు తెలిపారు. అయితే, ఉత్తర కొరియా చర్యను దక్షిణ కొరియా తీవ్రంగా ఖండించింది. ఇది ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాల ఉల్లంఘన అని పేర్కొంది. మరోవైపు, గత శనివారం వాటికన్‌లో పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల సందర్భంగా అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సమావేశమయ్యారు. అనంతరం, ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉద్దేశాలపై సందేహాలు వ్యక్తం చేశారు. సాధారణ పౌరులపై పుతిన్ క్షిపణి దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో, ఆయన శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నారా? అనే అనుమానం కలుగుతోందని ట్రంప్ పేర్కొన్నారు. రష్యాను చర్చలకు ఒప్పించడానికి బ్యాంకింగ్ లేదా ద్వితీయ శ్రేణి ఆంక్షలు అవసరం కావచ్చని సూచించారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన
# ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించాలి

-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.



గోపాల్ పేట, పెద్ద మందడి, మండలం ఏప్రిల్ 28 లోకల్ గైడ్ న్యూస్: సోమవారం ఉదయం కలెక్టర్ తన ఛాంబర్ లో వ్యవసాయ, కో ఆపరేటివ్, సివిల్ సప్లై, మార్కెటింగ్ అధికారులతో ధాన్యం తరలింపు పై సమీక్ష నిర్వహించిన. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వడ్లు ఎన్ని, మిల్లులకు, గోదాములకు తరలించింది ఎన్ని, ఇంకా కొనుగోలు కేంద్రాల్లో లోడింగ్ కావాల్సినవి ఎన్ని అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలు పడుతున్నందున రైతులు ఇబ్బందులు పడకుండా రవాణా కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు లారీలు పంపించాలని అలసత్వం చేసే కాంట్రాక్టర్ల అనుమతి రద్దు చేసి ఇతరులకు ఇవ్వాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ను ఆదేశించారు. గోపాల్ పేట, పెద్ద మందడి, పొల్కేపాడు కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తరలించేందుకు సిద్ధంగా ఉందని వడ్లు తరలించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మిల్లుకు, గోదాముకు సన్న వడ్లు, దొడ్డు వడ్లు 60:40 నిష్పత్తిలో పంపించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి బి. రాణి, సివిల్ సప్లై అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్సెట్టిపేటసివిల్ జెడ్జి బదిలీ న్యాయవదులు వీడికోలు పలికారు




లోకల్ గైడ్ తెలంగాణ: క్షెట్టిపేట. 27 ఏప్రిల్. జూనియర్ సివిల్ జుడ్జే గా పనిచేసిన గౌరవ జడ్జి గారు బదిలీపై వెల్లుచున్న సందర్భంగా స్థానిక న్యాయవాదులు ఆయనకు గౌరవంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కొమిరెడ్డి సత్తన్న,ప్రదీప్ కుమార్ లు మరియు న్యాయవాదులు ఆయనను శాలువాతో,జ్ఞాపికలతో సన్మానించారు ఈ కార్యక్రమం లో మాజీ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్ కుమార్, సత్యం, అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న సత్యం,జెనరల్ సెక్రెటరీ ప్రదీప్ కుమార్,సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్ రావు, నరేందుల సురేందర్, భూమరెడ్డి, రాజారాం రెడ్డి,కారుకూరి సురేందర్,అక్కల శ్రీధర్, పాల్ సుధాకర్, నళినికాంత్,సుమన్ చక్రవర్తి,సత్యగౌడ్ ,పాల్సన్ ,బనావత్ సంతోష్ ,పద్మ షెఫీక్,రెహమతుల్లా,రెడ్డిమల్ల ప్రకాశం, సదాశివ,శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి మాలా ధారణ స్వాములతో
## -ఆంజనేయ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించిన
## అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు

-పట్టణ బిజెపి మాజీ అధ్యక్షులు బచ్చురాం నివాసంలో




వనపర్తి ఏప్రిల్ 28 లోకల్ గైడ్ న్యూస్: వనపర్తి పట్టణంలో పట్టణ బిజెపి మాజీ అధ్యక్షులు బచ్చురాం నివాసంలో శ్రీ ఆంజనేయ స్వామి మాలా ధారణ స్వాములతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు భక్తులకు అన్న ప్రసారం ఏర్పాటు చేశామని పట్టణ బిజెపి మాజీ అధ్యక్షులు బచ్చురాం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బిజెపి నాయకులు న్యాయవాది మున్నూరు రవీందర్ అయ్యగారి ప్రభాకర్ రెడ్డి సబి రెడ్డి వెంకట్ రెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు డి నారాయణ వెంకటేశ్వర్ రెడ్డి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి కృష్ణ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాశి లోక్ నాథ్ రెడ్డి జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధా జిల్లా బిజెపి కిసాన్ మోర్చా నాయకుడు ఏర్పుల జ్ఞానేశ్వర్ యాదవ్ రాయన్న సాగర్ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మాజీ కౌన్సిలర్ ఏర్పుల సుమిత్రమ్మ ఆర్యవైశ్య సంఘం కన్వీనర్ పూరి బాలరాజు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు బచ్చు వెంకటేష్ కాలూరు శ్రీనివాసులు శెట్టి శ్రీకాంత్ గోనూరు వెంకటయ్య చవ్వ పండరయ్య లగిశెట్టి అశోక్ వై వెంకటేష్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ ఆంజనేయ స్వామి తీర్థ ప్రసాదాలు అన్న ప్రసాదం స్వీకరించారు.

# దరఖాస్తుల పై సత్వర చర్యలు



లోకల్ గైడ్ , కామారెడ్డి - ఏప్రిల్ 28: ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి. విక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా వాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే డిస్పోస్ చేయాలని అన్నారు. సోమవారం ప్రజావాణి లో 95 అర్జీలు రావడం జరిగాయని తెలిపారు. ఈ ప్రజావాణిలో కామారెడ్డి ఆర్డీఓ వీణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి మసూద్ అహ్మద్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేగవంతంగా వరి ధాన్యం కొనుగోలు



లోకల్ గైడ్ ,కామారెడ్డి:ఏప్రిల్ 28: రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు వేగవంతం చేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం నిజాంసాగర్ మండలం లోని గోర్గల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను కలెక్టర్ పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున రైతులకు టార్పాలిన్స్ అందజేయాలని సూచించారు . కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటది వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు . ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు, కొనుగోళ్లు జరిగిన వాటి వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండల తీవ్రత ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, నీడ, వంటి ఏర్పాట్లు చేయాలనీ తెలిపారు. కొందరు రైతులు మాట్లాడుతూ, లారీల కొరత ఉందని కలెక్టర్ దృష్టికి తేగా , అట్టి సమస్యను పరిష్కరించి వరి ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా తగు చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బిక్షపతి, వ్యవసాయ అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

## నిజామాబాదు లో ప్రజావాణికి 114 ఫిర్యాదులు



లోకల్ గైడ్ ,నిజామాబాద్, ఏప్రిల్ 28 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 114 ఫిర్యాదులు అందాయని సంబంధిత అధికారులు తెలిపారు . జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ తో పాటు, నిజామాబాద్ ఇంచార్జి ఆర్డీఓ స్రవంతి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం భూ భారతి చట్టం

## - జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్



జోగులాంబ గద్వాల జిల్లా, (లోకల్ గైడ్): భూ సంబంధిత వివాదాలకు శాశ్వత పరిష్కారంగా భూ భారతి చట్టం అమలులోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. సోమవారం వడ్డేపల్లి మండలంలోని ఓ ఫంక్షన్ హాల్ లో భూ భారతి చట్టం-2025 అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ధరణి చట్టంలో ఎదురైన సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రతి రైతుకు ఆధార్ కార్డు వంటి భూదార్ కార్డు ఇవ్వనుందని, దీనివల్ల భూములకు సంబంధించిన అన్ని రికార్డులు సులభంగా పొందగలుగుతారని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా అసైన్డ్ భూముల రెగ్యులరైజేషన్, సాదా బైనామాల సమస్యలు, సరిహద్దు వివాదాలు, మ్యూటేషన్, రిజిస్ట్రేషన్ వంటి అంశాలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని అన్నారు. రైతుల సర్వే సమస్యలను పరిష్కరించేందుకు లైసెన్సడ్ సర్వేయర్లను నియమించ నుందని, దీనిద్వారా భూములకు సంబంధించిన వివాదాలను సర్వే చేసి, మ్యాపులతో పట్టా పాస్ పుస్తకంలో చేర్చుకోవడానికి అవకాశ ముందని తెలిపారు. రిజిస్ట్రేషన్, గిఫ్ట్ డీడ్, పార్టిషన్, మ్యుటేషన్, ల్యాండ్ ఎక్ఛేంజ్, వారసత్వం వంటి చిన్న సమస్యలు తహసీల్దార్ స్థాయిలో పూర్తవుతాయని తెలిపారు. ఓ.ఆర్.సి, ఇనామ్, అసైన్మెంట్, సీలింగ్ ల్యాండ్, లోక్ అదాలత్ తదితర భూ సమస్యలు ఆర్డీఓ స్థాయిలో పరిష్కరించ బడతాయని తెలిపారు. గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు. భూ భారతి చట్టం ద్వారా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలలో అప్పీల్ చేసే అవకాశం అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భూముల రికార్డులను సక్రమంగా నిర్వహించడానికి, వివాదాలను తగ్గించేందుకు ప్రతి గ్రామానికి గ్రామ పరిపాలన అధికారులను నియమించనుందని తెలిపారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చని, నిర్దేశిత సమయంలో ప్రజలకు సేవలు అందించేందుకు చట్టంలో అధికారులపై బాధ్యత పెట్టడం జరిగిందని తెలిపారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల దరఖాస్తులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు భూ భారతి చట్టం ద్వారా లభించే అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం పలువురు రైతులు అడిగిన సందేహాలను, అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, తహసీల్దార్ వీరభద్రప్ప, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనువాసులు, అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ దొడప్ప, వడ్డేపల్లి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజప్ప, వివిధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మామిడి తోటలను, వరి ధాన్యం కల్లాలను పరిశీలించిన ఎమ్మెల్యే.



జోగులాంబ గద్వాల జిల్లా, (లోకల్ గైడ్): అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సాయంకాలం అకాల వర్షం కారణంగా మామిడి తోటలు, వరి పంటలు, వడ్లు దెబ్బతిన్నాయి. వివిధ గ్రామాలలో మూగ జీవాలు పిడుగుల కు మరణించాయి. సోమవారం గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో అకాల వర్షం కారణంగా రైతులకు పెద్ద ఎత్తున నష్టం జరగడంతో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి నియోజకవర్గంలో పర్యటించి వరి కల్లాలను, రైతుల మామిడి తోటకు వెళ్లి తోటలో పరిశీలించారు. అనంతరం ధరూర్ మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు సెంటర్ ను ఎమ్మెల్యే సందర్శించి ధాన్యం ను పరిశీలించారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రం దగ్గర రైతులతో మాట్లాడి వారి సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగుల సమస్యలతో రైతుల ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడి రైతులకు అలాంటి ఇబ్బంది లేకుండా గన్ని బ్యాగులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా గద్వాల నియోజకవర్గంలోని పలు గ్రామాలలో రైతులు వరి ధాన్యమును వర్షానికి తడి పోవడం జరిగింది. సంవత్సరం నుండి వేసిన మామిడి తోటల్లో మామిడి కాయలు రాలిపోవడంతో రైతులకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందన్నారు. దాదాపుగా 25 లక్షల వరకు రైతులకు నష్టం రావడంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం తరపున ఆదుకోవాలన్నారు. ఏ గ్రామాలలో రైతులు నష్టపోయిన సంబంధిత అధికారులతో పూర్తి నివేదికను తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా రైతులు మామిడి తోటలు పండించడం జరుగు తుందన్నారు. సరిగ్గా మామిడి తోట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షం కారణంగా చేతికొచ్చిన పంట మొత్తం నాశనం కావడం జరిగిందన్నారు. ప్రభుత్వం మామిడి తోట రైతులను ఆదుకోవాలని, వారికి అండగా నిలవాలని కోరారు. అదే విధంగా గద్వాల నియోజకవర్గం ఉరుములు మెరుపులు అకాల వర్షం కారణంగా పలు గ్రామాలలో మూగ జీవాలు, ఆవులు బర్రెలు, ఎద్దులు మేకలు గొర్రెలు మరణించడం జరిగిందన్నారు. ప్రభుత్వం వాటికి ప్రభుత్వం తరపున ఆదుకోవాలని కోరారు. ఎవరు అధైర్య పడొద్దని, ప్రభుత్వం తరపున నష్టపోయిన వారికి నష్టపరిహారం వచ్చే విధంగా ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రతి ప్రతి ఒక్క రైతును ఆదుకుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, జిల్లా సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ భర్త రామకృష్ణ నాయుడు, నాయకులు ఉరుకుంద, శేఖర్ రెడ్డి, రాజేష్, చంద్రశేఖర్, డి.వై రామన్న, శేఖర్ రెడ్డి, తిమ్మారెడ్డి, గోపి , పవన్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యల పై మీ-సేవ లో దరఖాస్తులు

లోకల్ గైడ్ ,కామారెడ్డి:ఏప్రిల్ 28: భూ సమస్యలపై మీ-సేవల్లో దరఖాస్తు సమర్పిస్తే భూ భారతి చట్ట ప్రకారంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. భూ భారతి చట్టం పై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు . భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులను జిల్లాలో ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా సోమవారం నిజాంసాగర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో, మహమ్మద్ నగర్ రైతువేదికలో, బాన్సువాడ రెడ్డి సంఘంలో నిర్వహించిన అవగాహన సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం 14 ఏప్రిల్ 2025 న ప్రారంభించడం జరిగిందని , చట్టం పై ప్రజలకు, రైతులకు అవగాహన సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణీ స్థానంలో భూ భారతి భూమి హక్కుల చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని వివరించారు . 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామ ద్వారా కొనుగోలు చేసి క్రమబద్దీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్ , స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. అట్టి వాటిని రికార్డు లలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్త ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ తరహాలో రైతులకు భూదార్ కార్డుల జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే నివృత్త చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ధరణీలో అప్పీలు కు ఆస్కారం లేనందున సివిల్ కోర్టుకు వెళ్ళవలసి ఉండేదని, ప్రస్తుతం తహసీల్దార్ ఇచ్చిన తీర్పులో అభ్యంతరం ఉంటే ఆర్డీఓ కు, ఆర్డీఓ తీర్పులో అభ్యంతరం ఉంటే కలెక్టర్ కు అప్పీలు. చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. హక్కుల రికార్డుల్లో ఉన్న వ్యక్తి లైసెన్సు గల సర్వేయర్ తో భూమి సర్వే చేయించుకొని మ్యాప్ తయారు చేయించుకున్నట్లయితే మండల సర్వేయర్ సరి చూసిన తర్వాత తహసీల్దార్ పాసుపుస్తమలో సర్వే మ్యాప్ ను ఉంచడం జరుగుతుందన్నారు. ఏ మైన భూ సమస్య ఉంటే సదరు పార్టీలకు నోటీసులు జారీ చేయాలని ఎవిడెన్స్ రికార్డు చేయాలనీ స్పీకింగ్ ఆర్డర్స్ స్పష్టమైన రీమార్కులతో నమోదు చేయాలని తెలిపారు. ప్రస్తుతం మీ సేవలో దరఖాస్తు పెడితే భూ భారతి చట్ట ప్రకారం విచారణ చేపట్టి నిర్ణీత సమయంలోగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలపై విచారణ చేసి స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టం లింగంపేట్ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుచున్నదని తెలిపారు. ప్రజలందరూ భూ భారతి పై అవగాహన కల్పించుకోవాలని అన్నారు.

నిజాం సాగర్ లో జరిగిన రైతు సదస్సులో జుక్కల్ నియోజకవర్గ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంత రావు మాట్లాడుతూ, గడిచిన కాలంలో భూమి కోసం పోరాటాలు జరిగాయని వివరించారు. భూముల వివరాలు కాగితాలపై ఒక లెక్క, ఫిజికల్ గా మరో లెక్క ఉండేవన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. జియో ట్యాగింగ్ చేసి భూదార్ కార్డ్ జారీచేయడం జరుగుతుందని తెలిపారు. సాధాబైనామా దరఖాస్తులను పరిశీలించి విచారణా చేసి న్యాయం చేయడం జరుగుతుందని తెలిపారు. ధరణీ వలన రైతుల ప్రాణాలు పోయాయని తెలిపారు. ఎవరి భూమి వారికే చెందడానికి భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని వివరించారు. కొత్త చట్టాన్ని ప్రతీ ఒక్కరు అవగాహన కల్పించుకోవాలని, సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జుక్కల్ నియోజక వర్గంలో దళారుల ప్రమేయం ఉండకూడదని, అలా చేసిన పక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ను కోరారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరగకూడదని పేర్కొన్నారు. ఆయా అవగాహన సదస్సులలో పలువురు రైతులు ప్రసంగించారు. అంతకుముందు చట్టం పై రూపొందించిన వివరాలను ఆయా తహసీల్దార్లు వివరించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు భూ భారతి పై రూపొందించిన వీడియో ప్రదర్శించారు. ఈ సదస్సులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్, బాన్సువాడ మున్సిపల్ కమీషనర్ శ్రీహరి, ఆయా మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు, పలువురు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టంతో భూ వివాదాలకు చెల్లుచీటీ

సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు అవకాశం

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు




లోకల్ గైడ్ ,నిజామాబాద్, ఏప్రిల్ 28 : రైతు ప్రయోజనాలే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో భూ వివాదాలు శాశ్వత పరిష్కారం అవుతాయని నిజామాబాదు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ధరణితో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేయాలన్న కృత నిశ్చయంతో నిపుణులచే 17 రాష్ట్రాలలో అధ్యయనం జరిపించిన మీదట సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని రూపొందించారని తెలిపారు. ఈ చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. సోమవారం జిల్లాలోని రెంజల్, ఎడపల్లి మండల కేంద్రాలలోని రైతు వేదికలలో నిర్వహించిన అవగాహన సదస్సులలో కలెక్టర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధరణి స్థానంలో కొత్తగా భూభారతి (భూమి హక్కుల చట్టం) తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పులను సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని సూచించారు. 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసి, గడచిన 12 ఏండ్లుగా అనుభవంలో ఉంటూ, 12.10.2020 నుండి 10.11.2020 మధ్య కాలంలో క్రమబద్దీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. వాటిని రికార్డు లలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు. ధరణిలో సాదా బైనామాల క్రమబద్దీకరణకు అవకాశం ఉండేది కాదన్నారు. దీంతో హైకోర్టు స్టే విధించిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 9 లక్షల వరకు పెండింగ్ లో ఉన్న సాదా బైనామాల క్రమబద్దీకరణకు ప్రస్తుత భూభారతి చట్టం ద్వారా పరిష్కరించుకునే వెసులుబాటు లభిస్తోందని, హైకోర్టు స్టే తొలగిన మీదట ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయనున్నదని కలెక్టర్ వివరించారు. కాగా, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ, పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీ చేసిన పాసు పుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు కూడా అప్పీలు చేసుకోవచ్చని అన్నారు. అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. ఈ తరహా తోడ్పాటు దేశంలోనే మరెక్కడా లేదని అన్నారు. భూ వివాదాలు, ఆక్రమణలకు తావు లేకుండా భూ కమతాలకు ఆధార్ తరహాలోనే

భూదార్ నెంబర్ ను కేటాయిస్తారని తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార వికేంద్రీకరణకు ప్రాధాన్యతనిస్తూ తహసీల్దార్, ఆర్డీఓలకు మ్యుటేషన్ చేసే అధికారాలను ప్రభుత్వం కల్పించిందని అన్నారు. భూముల కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగ పంపకాలకు సంబంధించి స్లాట్ బుక్ చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే, అసైన్డ్, పీ.ఓ.టీ, ప్రభుత్వ భూములు కావని నిర్ధారించుకున్న మీదట గడువు లోపు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. వారసత్వ వీలునామా కింద కూడా మ్యుటేషన్ చేసే అధికారాలను తహసీల్దార్లకు కల్పించారని అన్నారు. అయితే క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపిన మీదట వారసత్వ వీలునామా రిజిస్ట్రేషన్ చేస్తారని సూచించారు. భూ వివాదాల సత్వర పరిష్కారం కోసం భూభారతి ద్వారా ఇదివరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులను పునరుద్ధరించారని తెలిపారు. భూములకు సంబంధించిన సమగ్ర వివరాలు, హద్దులతో పట్టా పాస్ బుక్కులకు మ్యాప్ లను జత చేస్తారని అన్నారు. లైసెన్స్ సర్వేయర్ తో సర్వే చేయించి సమర్పించే మ్యాప్ లను సర్వేయర్ పరిశీలించి, పట్టా పాస్ పుస్తకంలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి రెవెన్యూ గ్రామానికి సంబంధించిన వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర, ఆబాదీ భూముల వివరాలతో కూడిన రికార్డులను కూడా నిర్వహిస్తారని తెలిపారు. భూముల రికార్డులకు సంబంధించి ఏవైనా పొరపాట్లు ఉంటే, రైతులు ఈ చట్టం ప్రవేశపెట్టిన ఏడాది కాలంలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మే, జూన్ మాసాలలో గ్రామాల వారీగా సదస్సులు నిర్వహించేందుకు వచ్చే అధికారులకు అర్జీలు సమర్పించవచ్చని సూచించారు. ధరణి పోర్టల్ ద్వారా ఆన్లైన్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ రైతులకు భూభారతి చట్టంలోని కీలక అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సదస్సులలో స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన
# మేఘున్న అభయస్తం భరోసా ద్వారా





వనపర్తి ఏప్రిల్ 28 లోకల్ గైడ్ న్యూస్: వనపర్తి జిల్లా కేంద్రంలో హరిజనవాడ 21వ వార్డు కు చెందిన బండారి శేఖర్ కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులు బాపనపల్లి వెంకటేష్ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి సమాచారం ఇవ్వగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. మార్కెట్ డైరెక్టర్ సూర్యుడు ఇంద్ర నాగన్న పి శేషన్న పి మురళి అందరు కలిసి మరణించిన బండారి శేఖర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## కాయితి శంకర్ కుడాక్టరేట్ అవార్డు ప్రదానం




లోకల్ గైడ్: రాయికల్, ఏప్రిల్ 29: జగిత్యాల జిల్లా రాయికల్ పట్టటానికి చెందిన కాయితి శంకర్ కు లండన్ లోని మెక్సికో టొలాసా యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డును యూనివర్సిటీ అధికారులు ఆదివారం మహారాష్ట్ర నాసిక్ రాయల్ హెూటల్ లో అందించి ఘనంగా సత్కరించారు కాయితి శంకర్ పాత్రికేయునిగా ,అంబేద్కర్ వాదిగా సమాజం లోని బడుగు బలహీన వర్గాల ప్రజలను చైతన్యం చేస్తూ రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ ఉపాధి హామీ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం,కుల వివక్షలకు వ్యతిరేకంగా గత పది సంవత్సరాలుగా నిరంతరం పోరాటాలు చేస్తూ జగిత్యాల జిల్లా తో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు చేసినందుకు నిరుపేద సమాజానికి సేవలు చేసినందుకు గాను ఈ అవార్డు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు .కాయితి శంకర్ కు డాక్టరేట్ అవార్డు ప్రదానం చేయడం పట్ల సమతా సైనిక్ థళ్ నాయకులు మెట్టు దాస్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు డి.లింగన్న మాల,సంజయ్ స్నూరే, ఉయ్యాల శోభన్,కోట శంకర్,నరేందర్, పల్లెరవి,దళిత ఉద్యోగ సంఘాల నాయకులు రాయికల్ అంబేద్కర్ సంఘం నాయకులు చెంగలి గంగాధర్,బాపురపు నర్సయ్య,గుర్రం రత్నాకర్ ,చింతకుంట సాయికుమార్,మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మ్యాదరి శ్రీహరి, ,నాయకులు కొంద్ర గంగాధర్,చెలిమెల మల్లేశం దామెర రాజయ్య ,బలిజ రాజారెడ్డి, చింతకుంట గంగాధర్,బొల్లం విజయ్ , ,అంబేద్కర్ సంఘాల రాష్ట్ర నాయకులు మొగురం రమేష్ ,నర్సాపురం రవీందర్, మార్వాడీ సుదర్శన్,బోయిని అశోక్,ప్రమోద్ మరియు రాయికల్ ప్రెస్ క్లబ్ సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శి, ప్రెస్ క్లబ్ జేఏసి నాయకులు తదితరులు అభినందించారు ఈ అవార్డు అందించిన ,ఇండియా కో ఆర్డినేటర్ రమేష్ బిగాన్ కోర్ డా.కట్ట బొమ్మన్ గారికి కాయితి శంకర్ కృతజ్ఞతలు తెలిపారు

## రవీంద్ర అభ్యాస పాఠశాలలకు గుర్తింపు ఇవ్వకూడదు

### డి ఈ ఓ కి వినతిపత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా సమితి



( లోకల్ గైడ్ ) జగిత్యాల ప్రతినిధి : అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వద్దని స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి రాముకి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణ(మండల) కేంద్రంలోని ఇటీవల కాలంలో నూతన పాఠశాల ప్రారంభానికి దరఖాస్తు చేసుకున్నటువంటి అభ్యాస మరియు రవీంద్ర పాఠశాలలు తప్పుడు ధృవపత్రాలు అందించారని ఏఐఎస్ఎఫ్ దృష్టికి వచ్చిందని సరైన బిల్డింగు, గదులు ఫైర్ సేఫ్టీ, పార్కింగ్, ప్లే గ్రౌండ్ కనీస మౌలిక సదుపాయాలకు అనుగుణంగా బిల్డింగులు లేవని కనీసం పిల్లలకు అసెంబ్లీ సమయంలో ప్రార్థన చేయడానికి కూడా స్థలం లేదని అట్లాగే కనీసం మోటర్ సైకిల్ కూడా వెళ్లడానికి అనుకూలంగా లేదని పైగా అక్కడ రద్దీగా ఉంటుంది ట్రాఫిక్ సమస్య హాస్పిటల్ బిల్డింగు పక్కనే ఏవైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే కనీసం అగ్నిమాపక యంత్ర వాహనం వచ్చే పరిస్థితి కూడా లేదు కావున వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని అనుమతుల విషయంలో వ్యవహరించాలి తక్షణమే అనుమతులను ఆపాలి ఇవ్వకూడదని ప్రధానంగా ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలకు ఏఐఎస్ఎఫ్ వ్యతిరేకం కాదు విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నా పాఠశాలలకు ఏఐఎస్ఎఫ్ వ్యతిరేకమని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్రమాలిక్ జిల్లా సమితి సభ్యులు అరవింద్, నవీన్ సులేమాన్ దిల్సన్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష భయం పోగొట్టేందుకే నమూనా పరీక్షలు

### మాగంటి ప్రసాద్ బాబు రమేష్ బాబు.

### - విజయవంతమైన లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల ఎంసెట్ మోడల్ పరీక్ష



భద్రాచలం (లోకల్ గైడ్) విద్యార్థులలో పోటీ పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ముందస్తు మోడల్ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్ బాబు రమేష్ బాబులు అన్నారు. సోమవారం లిటిల్ ఫ్లవర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసెట్ మోడల్ పరీక్ష పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఎంసెట్ మోడల్ పరీక్షలను నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా మూడు దఫాలుగా ఈ మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షకు విద్యార్థుల నుండి అపూర్వ స్పందన లభిస్తుందని 110 మంది విద్యార్థులు ఈ మోడల్ పరీక్షకు హాజరయ్యారని అన్నారు. విద్యార్థులు మానసిక ధైర్యంతో ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలకు హాజరు కావాలని తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రసాద్ బాబు రమేష్ బాబులు విద్యార్థులకు సూచించారు . ఎంసెట్ కోచింగ్ లో అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే తయారుచేసిన ప్రశ్నాపత్రం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల గణితం అధ్యాపకులు ఎండి బషీర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంతో రైతులకు మేలు




( లోకల్ గైడ్ ) జగిత్యాల ప్రతినిధి: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం రోజున జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం లో రైతు వేదిక నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకమైందని, రైతులు దీనిపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. పారదర్శకత జవాబు దారీతనంతో పని చేసేలా ఈ చట్టాన్ని రూపొందించిందని అన్నారు. భూ భారతి చట్టం ద్వారా పక్కగా భూ సరిహద్దులు నిర్ణయిస్తారని, రైతులకు, భూ హక్కుదారులకు ఉచిత న్యాయ స్థానం అందుబాటులో ఉంటుందని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం అధికారులు అందించిన ఆర్డర్ల పై సంతృప్తి చెందకుంటే బాధితులు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసిల్దార్ విచారణ జరిపి రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణీత గడువు 30 రోజుల లోగా మ్యూటేషన్ పూర్తి చేయకుంటే ఆటోమేటిక్ గా మ్యూటేషన్ జరుగుతుందన్నారు. భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. భూముల విస్తీర్ణం మార్పులు చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్తులో మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ కార్డు అందించడం జరుగుతుందని అన్నారు. భూ భారతి లో సులభమైన మోడల్స్ మాత్రమే ఉండి సులభంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని, తహసిల్దార్ నుండి సీసీఎల్ఏ వరకు ఆపిల్ వ్యవస్థను వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. పెండింగ్ సాదా బైనామాల పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జివాకర్ రెడ్డి మేడిపల్లి మండల తహసీల్దార్ వసంత, ఎంపీడీవో,రైతులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతిలో ప్రతీ భూ సమస్యకు శాశ్వత పరిష్కారం

- నాలుగు గోడల మధ్య స్వార్థ పూరితంగా తెచ్చిన చట్టం కాదు

- భూ భారతి రైతులకు శ్రీరామరక్ష

తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- అశ్వారావు పేటలోని శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో భూ భారతి చట్టం పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు

అశ్వరావుపేట (లోకల్ గైడ్): భూ భారతి చట్టంలో ప్రతీ భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని... ధరణిలా ఇది నాలుగు






గోడల మధ్య తెచ్చిన స్వార్థ పూరిత చట్టం కాదని.... రైతులకు భూ భారతి చట్టం శ్రీరామ రక్ష అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భూ భారతి - 2025 చట్టంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ చట్టం చేసేముందు రైతుల కష్టం గురించి ఆలోచించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకొని రైతులకు శ్రీరామరక్షలా నిలిచే విధంగా భూభారతి -2025 చట్టాన్ని రూపొందించామని తెలిపారు. గతంలో నాలుగు గోడల మధ్య స్వార్థపూరితంగా తయారుచేసిన ధరణి చట్టానికి మూడేళ్లు గడిచినా నియమనిబంధనలు రూపొందించలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మండలాల్లో తొలివిడత ప్రయోగాత్మకంగా అమలు చేసి అన్ని వివరాలు, దరఖాస్తులు సేకరిస్తున్నామని, జూన్ 2 నాటికి వీలైనన్ని సమస్యలు పరిష్కరించి , అర్హులైన వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను పట్టాలుగా అందజేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో నేలకొండపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు వివరించారు. భూ యజమానులకు న్యాయం జరిగేలా తహశీల్దార్ మొదలు కొని సీసీఎల్ఏ వరకు ఐదంచెల వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. సీసీఎల్ఏ వద్ద కూడా న్యాయం జరగలేదని భావిస్తే ట్రిబ్యునల్ ను ఆశ్రయించవచ్చన్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అవసరమైనన్ని ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వచ్చేనెల 10వ తేదీకల్లా రెవెన్యూ ,గ్రామ పరిపాలనాధికారులు ప్రజలకు పూర్తిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తప్పుచేసే అధికారులపై చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. గతంలో రైతు బంధు కోసం గులాబీ రంగు కార్యకర్తలకు భూమి లేకపోయినా పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని, సక్రమంకాని అటువంటి అక్రమాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు మరిన్ని సేవలు అందేలా రెవెన్యూ వ్యవస్థ పనిచేస్తుందని ఏ పార్టీ కార్యకర్త అనే పక్షపాతం లేకుండా ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు చట్టం ఒక చుట్టంలా ఉపయోగపడేలా చూస్తామని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## రైతులకు సునాయసంగా అర్థమై భూ సమస్యలు లేకుండా
# నిర్భయంగా ఉంచగలిగేదే భూ భారతి చట్టం

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో

మక్తల్ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.



వనపర్తి అమరచింత మండలం ఏప్రిల్ 28 లోకల్ గైడ్ న్యూస్: సోమవారం, అమరచింత మండలంలోని నాగర్ కద్మూర్ , ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామ రైతు వేదికలలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం - 2025 (ఆర్. ఒ.ఆర్ యాక్ట్) అవగాహన కార్యక్రమానికి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ రైతుకు భూమికి ఉన్న బంధాన్ని ప్రపంచంలో ఎవరు విడదీయలేరని అన్నారు. ఒక చిన్న వ్యాపారి తన వ్యాపారంలో నష్టం వస్తె ఒకటికి రెండు సార్లు చూసి వ్యాపారం మూసేస్తాడు. కానీ రైతుకు తన భూమిలో పంట వేసినప్పుడు ఎన్నిసార్లు నష్టం వచ్చిన తన భూ తల్లి ఎప్పటికైనా మేలు



చేస్తుందని మళ్ళీ మళ్ళీ వ్యవసాయం చేస్తాడని కొనియాడారు. ఇంతటి అనుబంధం ఉన్న భూమి తనకు ఎన్ని ఎకరాలు ఉన్నవి వాటి ఆధారం చూపే పట్టా పాస్ పుస్తకం చూసుకొని ధైర్యంగా ఉంటాడన్నారు. ఒకప్పుడు పటేల్ పట్వారీ జమానాలో రైతులకు అన్యాయం జరుగుతుందని భావించిన అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు రైతులకు తోక బుక్కుస్థానంలో పట్టా పాసు పుస్తకాలు ఇచ్చి రైతులకు భరోసా ఇచ్చాడన్నారు. ఆ తర్వాత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో పట్టాదారు పాసు పుస్తకంతో పాటు టైటిల్ బుక్ ఇచ్చి భూమి పైన బ్యాంకు రుణాలు పొందే విధంగా చేశారని గుర్తు చేశారు. 2020 లో తెచ్చిన ధరణి చట్టం రైతులను గందరగోళానికి గురి చేసి అనేక సమస్యలకు కారణమయ్యిందని తెలిపారు. ధరణి పాసు పుస్తకంలో ఖాస్తు కాలాన్ని తొలగించారన్నారు. వాళ్ళు అనుకున్న భూమిని బి. కేటగిరీలో పెట్టీ రైతులకు అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. ధరణి పాసు పుస్తకంలో పేరులో చిన్న తప్పు పడిన, లేదా భూమి విస్తీర్ణంలో తేడా అయిన తహశీల్దారుకు దరఖాస్తు చేస్తే వారి చేతిలో ఏమి ఉండేది కాదు. రైతులు కలెక్టర్ కార్యాలయం చుట్టూ సంవత్సరాల తరబడి తిరిగేదన్నారు. అధికారులు తప్పు చేసిన కోర్టు చుట్టూ తిరిగే దుస్థితి ఉండేదన్నారు. రైతుల సమస్యలను తెలుసుకున్న అప్పటి పి.సి.సి అధ్యక్షుడు ప్రస్తుత ముఖ్యమంత్రి ధరణి లోపాలను సరిదిద్దేందుకు 14 నెలలు మేధావులు, కలెక్టర్లతో చర్చించి రైతులకు సులువుగా తన భూమి వివరాలు తెలుసుకునే విధంగా తీసుకువచ్చిందే భూ భారతి చట్టమని వివరించారు. రైతుల పేర్లు తప్పు పడినా, విస్తీర్ణంలో తేడా ఉన్నా తహసిల్దార్ దగ్గరే సరి చేయించుకునే అవకాశం భూ భారతిలో కల్పించిందన్నారు. రైతులకు భూ భారతి చట్టం పై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ,ప్రజా ప్రతినిధులు స్వయంగా ప్రతి మండలానికి తిరిగి అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. రైతులు ఎవరి పై ఆధార పడకుండా, ఎవరి నుండి మోసపోకుండా ఉండాలంటే భూ భారతి చట్టం పై క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువకులు సైతం భూ భారతి చట్టం పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ఏ చట్టం తీసుకువచ్చిన చట్టం పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంటుందని అందుకే కొత్తగా వచ్చిన భూ భారతి ఆర్. ఒ.ఆర్. చట్టం పై మండల స్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి వ్యక్తికి భూమితో సంబంధం ఉంటుందని ఏదో ఒక సమయంలో అవసరం వస్తుందన్నారు. అంత ముఖ్యమైన భూమి, భూ చట్టాల పై ప్రతి ఒక్కరు అవగాహన చేసుకోవాలని సూచించారు. సమస్యలు వచ్చి న్యాయ వ్యవస్థకు వెళ్ళాక చట్టంలో ఉన్న అంశం నాకు తెలియదు అని చెప్పడానికి వీలు లేదన్నారు. ఇంతకు ముందు ఉన్న ధరణి చట్టంలో ఉన్న సమస్యల పరిష్కారానికి మేధావులతో చర్చించి పటిష్టమైన భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. భూ భారతి చట్టం ప్రకారం ఏదైనా భూమి రిజిస్ట్రేషన్ చేసే ముందు క్షేత్రస్థాయిలో సర్వే చేసి నాలుగు దిక్కుల హద్దులు నిర్ణయించుకొని పట్టా పాస్ పుస్తకంలో భూమి వివరాలతో పాటు పటం ముద్రించడం జరుగుతుందన్నారు. తద్వారా భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదన్నారు. రిజిస్ట్రేషన్ లో లేదా మ్యుటేషన్, సక్సెషన్ సమయంలో తప్పు జరిగిందని భావిస్తే ఆర్డీఓ కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆర్డీఓ స్థాయిలో కూడా తప్పు చేస్తే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. పాస్ పుస్తకం తో పాటు ప్రతి భూకమతానికి ఒక భూధార్ కార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఉద్దేశ్యపూర్వకంగా ఎవరైనా తప్పుడు సమాచారం ఇచ్చి రిజిస్ట్రేషన్ లేదా మ్యుటేషన్ చేయించుకున్న లేదా అధికారులు తప్పు చేసిన అప్పీల్ చేసుకుంటే తప్పు చేసిన వారికి నోటీస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అధికారులు తప్పు చేస్తే చర్యలు తీసుకొని తప్పును సరి చేసే అవకాశం భూ భారతి చట్టంలో అవకాశం ఉందన్నారు. ఇతరుల భూ రికార్డులు కావాలి అనుకుంటే తహసిల్దార్ సర్టిఫై తో వివరాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉండి తండ్రి చనిపోతే ఇద్దరు స్లాట్ బుక్ చేసుకొని ఇద్దరమే హక్కుదారులమి అన్యాయంగా మ్యుటేషన్ చేయించుకుంటే ఇంతకు ముందు చట్టంలో తప్పు సరిదిద్దుకోవడానికి వీలు లేకుండా పోయిందన్నారు. భూ భారతి చట్టంలో నోటీస్ ఇచ్చి సరిదిద్దుకునే అవకాశం ఉందన్నారు. పెండింగ్ లో ఉన్న సాదా బైనామా కేసులను సైతం ఆర్డీఓ క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించుకునే అవకాశం భూ భారతి చట్టంలో కల్పించిందన్నారు. అందుకే భూ భారతి చట్టం పై ప్రజలు క్షుణ్ణంగా తెలుసుకోవాలని అందుకే చట్టం గురించి కరపత్రాలు పంచడం జరుగుతుందన్నారు. భూ భారతి చట్టం గురించి ఆర్డీఓ సుబ్రమణ్యం ప్రజలకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఆత్మకూరు తహసిల్దార్ చాంద్ పాషా, జిల్లా అధికారులు, మండల అధికారులు, కల్లు గీత కార్మికుల అధ్యక్షుడు నాగరాజు గౌడ్, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## మేప్మా ఆధ్వర్యంలో వరి ధాన్యం
## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎం ఎల్ ఏ



( లోకల్ గైడ్ ) జగిత్యాల ప్రతినిధి : జగిత్యాల పట్టణ 15వ వార్డు శంకులపల్లి లో మేప్మా ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల ఎం ఎల్ ఎ డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల అభివృద్ధికి ప్రభుత్వం తో కలిసి పనిచేస్తున్న అని ఏకకాలం లో 20 వేల కోట్ల రుణ మాఫీ అమలు చేసిన రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమే అని, సన్న వడ్లకు 500 బోనస్ తో రైతులకు లబ్ది చేకూరుతుందని ఈ ప్రభుత్వం రైతు పక్ష పాతి ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన,మెప్మా ఎ ఓ శ్రీనివాస్,నాయకులు గిరి నాగభూషణం,అడువాల లక్ష్మణ్, గోలి శ్రీనివాస్,బాల ముకుందం, తోట మల్లికార్జున్, చెట్పల్లి సుధాకర్,బోడ్ల జగదీష్,కుసరి అనిల్,కూతురు రాజేష్ పిట్ట ధర్మరాజు కత్రోజ్ గిరి,శరత్ రావు, ములసపు మహేష్,ఏనుగుల రాజు,లింగారెడ్డి,కుసరి రాజు,రంగు మహేష్,రవి,రవి శంకర్, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి.....
### అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



ఖమ్మం (లోకల్ గైడ్): ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని అన్నారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామానికి చెందిన ఎం. వేంకటేశ్వర్లు, ఆచార్లగూడెం గ్రామ రెవెన్యూ నందు ఉన్న సాయిలక్ష్మి పారా బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్ నుంచి వస్తున్న కాలుష్యం వల్ల పంట నష్టం, ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, ఆ రైస్ మిల్లుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, అదనపు కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరం ముస్తాఫానగర్ కు చెందిన షేక్ సైదమ్మ తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. దాచాపురం గ్రామానికి చెందిన ఎం. రాజా ఇందిరమ్మ గృహ సమగ్ర సర్వేలో అక్రమాలు జరిగాయని, అనర్హులకు ఇండ్ల కేటాయింపు చేసి అర్హులకు అన్యాయం జరిగిందని తెలుపుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరానికి చెందిన ఎస్.కే. షాకీరబి తనకు కుటుంబ పోషణ కోసం రాజీవ్ వికాసం పథకం క్రింద క్యాంటీన్ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## జన విజ్ఞాన వేదిక వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం



ఖమ్మం- (లోకల్ గైడ్) నగరం లోని నిర్మల్ హృదయ పాఠశాల లో జన విజ్ఞాన వేదిక ,తెలంగాణ సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ కే మహేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ శిక్షణాశిబిరంలో" దేశమును ప్రేమించ ుమన్నా ....”గేయాన్ని ప్రముఖ రచయిత ,కవి,గాయకులు రౌతు రవి విద్యార్థులకు నేర్పించారు. అనంతరం ప్రధాన కార్నర్ యాక్టివిటీ అయిన “మిరాకిల్ ఎక్స్పోజర్ “ను ఎస్వీఆర్ పురుషోత్తమరావు, అలవాల నాగేంద్రం ,పీ వీ అప్పారావు, వి మోహన్ నిర్వహించారు. దీనిలో గాజు పెంకుల పై నడవడం ,అరచేతిలో హారతి కర్పూరం ,నాలుక పై హారతి కర్పూరం వెలిగించి మింగడం, నాలుకలో త్రిశూలం గుచ్చుకోవడం, అరచేతిలో రంధ్రం మొదలైన అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అలాగే “రోజుకో పద్యం” లో భాగంగా ప్రముఖ రచయిత్రి వురిమళ్ల సునంద తెలుగు పద్యాన్ని నేర్పించారు. అనంతరం “గణితంలో గమ్మత్తులు” గురిం చి నరసింహారావు, శివన్నారాయణ వివరించారు. పాఠశాల యాజమాన్యం వారు హాజరైన వారందరికీ మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి 11:30 గంటల వరకు జరిగింది . వారం రోజులపాటు ఇదే సమయంలో ప్రతిరోజు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు అలవాల నాగేశ్వరరావు ,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్వీ రెడ్డి ,టి. శివన్నారాయణ ,రాష్ట్ర కమిటీ సభ్యులు డి అరుణశ్రీ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి. మోహన్, కె రామారావు జిల్లా బాధ్యులు ఆర్ శ్రీరాములు, ఎన్ ఏసోబు ,పి.రామకృష్ణ ,టి రామకృష్ణ,అకడమిక్ కమిటీ కన్వీనర్ ఈ. వెంకటేశ్వర్లు ,డాన్ బాస్కో, తాత రాఘవయ్య, విజయలక్ష్మి, వీరనారాయణ, నాగేశ్వరరావు,టి పి ఎస్ కే బాధ్యులు విప్లవ కుమార్,వసుంధర, మల్లికా పాల్గొన్నారు.

## కొత్తగా బాధ్యతలు తీసుకున్న ప్రొఫెసర్ డాక్టర్ రాజా రామ్




హైదరాబాద్, ప్రతినిధి (లోకల్ గైడ్ తెలంగాణ) ఏప్రిల్ 28: ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ కి మర్యాదపూర్వకంగా నీలోఫర్ హాస్పిటల్ నుంచి సూపర్నెంట్ నీలోఫర్ హాస్పిటల్ డాక్టర్ రవికుమార్ పీడియాట్రిక్ హెచ్ ఓ డి డాక్టర్ విజయ్ కుమార్ అండ్ డాక్టర్ మాధురి అసిస్టెంట్ ప్రొఫెసర్ తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు అప్పటివరకు బాధ్యతలు నిర్వహిస్తున్న పెథాలజీ ప్రొఫెసర్ అండి జోడి డాక్టర్ చారి గారు మరల పెతాల్జీ డిపార్ట్మెంట్ కి వెళ్లిపోవటమైనది డాక్టర్ రాజారావు అడిషనల్ డైరెక్టర్ అవటంవల్ల ప్రిన్సిపాల్ పోస్ట్ కి నియమించారు ఇంతకుముందు భువనగిరి లో సూపర్డెంట్ గా పనిచేస్తూ కోవి టైంలో గాంధీ హాస్పటల్ సూపర్డెంట్ గా చాలా సేవలు అందించడం వల్ల ఇతను సేవలు ప్రభుత్వం కూడా గుర్తించి ఈయనకి బెస్ట్ డాక్టర్ కూడా ఇవ్వటం జరిగింది అంతే పేరు తెచ్చుకోవాలని నీలోఫర్ ఆసుపత్రి డాక్టర్లు కూడా కోరుకుంటున్నారు

# ప్రాణాలు తీస్తున్న రోడ్డుపై మురుగునీటిని తొలగించాలి

- గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వీడాలి.

- - మురుగు కాలవ ముందు కూర్చుని నిరసన తెలియజేసిన సిపిఎం.



భద్రాచలం (లోకల్ గైడ్) :భద్రాచలం పట్టణం రాజుపేట కాలనీ నందు డ్రైనేజీ పూడిక తీయించాలని,కొత్త డ్రైనేజీ లు నిర్మించాలని, ప్రధానంగా యజ్ఞజా స్కూలు ముందు రోడ్డుపై ప్రాణాలు తీస్తున్న మురుగు నీటిని తొలగించాలని కోరుతూ సిపిఎం 20వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో మురుగు నీటి వద్ద కూర్చుని నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గద్దల స్వామి మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా కాలనీలోని డ్రైనేజీలు పూడిక తీయడం లేదని, డ్రైన్లు అవసరం ఉన్న చోట నిర్మించాలని దరఖాస్తులు చేసుకున్నప్పటికీ గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ఇది సరైనది కాదు అని అన్నారు. ధనికులు నివాసముంటున్న ప్రాంతాలలోనే నిధులు కేటాయింపులున్నాని, డ్రైనేజీ క్లీనింగులు గాని చేస్తున్నారని పేదలు నివాసం ఉన్న ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు జరగటం లేదని విమర్శించారు. అవసరం లేని ప్రాంతాలలో, రియల్ ఎస్టేట్ దందా నడుపుతున్న వారి కోసం రోడ్లు నిర్మిస్తున్న గ్రామపంచాయతీ అధికారులు కాలనీలలో ప్రజలకు అవసరం ఉంది అని అడుగుతున్న చోట ఎందుకు డ్రైనేజీలు, రోడ్లు నిర్మించడం లేదు అని ప్రశ్నించారు.. వర్షాకాలం రాకముందే డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసేందుకు గ్రామపంచాయతీ అధికారులు నిధులు కేటాయించాలని మారుమూల కాలనీలలో ఉన్న ప్రధాన సమస్యలపై కేంద్రీకరణ చేయాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, డి కనక శ్రీ, శాఖ కార్యదర్శి కాకా రమణ సభ్యులు మంగమ్మ, చుక్కమ్మ, రాధా, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్చరీ రాష్ట్రస్థాయి క్రీడల్లో విజయాన్ని కైవసం చేసుకున్న భద్రాచలం ఐటిడిఏ

- జాతీయస్థాయి క్రీడల్లో కూడా విజయం సాధించాలని ఐటిడిఏ పీవో బి రాహుల్.



భద్రాచలం (లోకల్ గైడ్ ) :వైజాగ్ లోని గీతం యూనివర్సిటీలో వివిధ రాష్ట్రాలు పాల్గొన్న రాష్ట్రస్థాయి గిరిజన ఆర్చరీ క్రీడలలో ఐటీడీఏ భద్రాచలం ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించడం చాలా సంతోషకరమని క్రీడల యొక్క విజయోత్సవ ఇంతటితో ఆగకుండా జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొని భద్రాచలం ఐ టి డి ఏ కు మంచి గుర్తింపు తీసుకొని రావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు తన ఛాంబర్ లో ఏప్రిల్ 25, 26, 27 తేదీలలో వైజాగ్ లో జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన ఆర్చరీ క్రీడలలో ఆంధ్ర ప్రదేశ్,కేరళ, రాజస్థాన్, ఒరిస్సా, అండమాన్ నికోబార్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి గిరిజన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్న ఆర్చరీ క్రీడలలో భద్రాచలం ఐటీడీఏ తరఫున అశ్వరావుపేట క్రీడలలో పాల్గొని బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి ఓవరాల్ ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్న క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు అనేవి సహజమని ఆడే ప్రతి ఆట గెలవడానికి ప్రయత్నించాలని అన్నారు. టీం మొత్తం కలిసికట్టుగా ఉండి పీడీలు పీఈటీలు కోచులు విద్యార్థిని విద్యార్థులకు అందించిన సహాయ సహకారాలు, సలహాలు, సూచనల వలన ఇంతటి పెద్ద విజయం సాధించారని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు తప్పనిసరిగా ప్రతిరోజు ఆర్చరీలోపాటు ఇష్టమైన క్రీడలలో పాల్గొని మీయొక్క ఆటను మెరుగుపరచుకొని అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని అత్యధిక పతకాలు సాధించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించుకోవాలని ఆయన అన్నారు. ఐటీడీఏ భద్రాచలం, గిరిజన సంక్షేమ శాఖ కనపల్లి క్రీడా పాఠశాల నుండి 08 మంది క్రీడాకారులు పాల్గొన్నారని,04 మంది పీడీ,పీఈటీస్ కోచులతో కలిపి12 మంది రాష్ట్రస్థాయి గిరిజన ఆర్చరీ క్రీడల్లో పాల్గొని అండర్ 19, అండర్ 20, సీనియర్, జూనియర్ బాలబాలికలు పాల్గొని క్రీడలలో విజయం సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్ గెలుచుకొని మన ఐటీడీఏ కు మంచి పేరు తీసుకురావడం చాలా సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు మరియు పిడి, పిఈటి ,కోచులకు అభినందిస్తున్నట్లు ఆయన అన్నారు. పిల్లలు చదువుతోపాటు ఇష్టమైన క్రీడలలో తప్పనిసరిగా పాల్గొనాలని, క్రీడలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజన పిల్లలు దృఢంగా మంచి మేధాశక్తి కలిగి ఉంటారని, వారికి ఇష్టమైన క్రీడలలో తప్పనిసరిగా ప్రోత్సాహం అందిస్తే విజయం సాధించి మెడల్స్ సాధించి పెడతారని అన్నారు. మీకు కావాల్సిన క్రీడా మెటీరియల్స్ తప్పనిసరిగా అందిస్తానని ఆయన అన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడలలో పాల్గొని మెడల్స్ సాధించిన విద్యార్థిని విద్యార్థులకు పతకాలు అందించి అందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి మణెమ్మ, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటే నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు నాగ శ్యామ్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, కోచ్ మారెప్ప విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను

# ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

## యాంటీ డ్రగ్స్ అవగాహన గోడ పత్రికను

అదనపు కలెక్టర్, వైద్య అధికారులతో -జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.





వనపర్తి ఏప్రిల్ 28 లోకల్ గైడ్ న్యూస్: సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు,జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.



ప్రజావాణికి మొత్తం 80 ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం రెడ్ క్రాస్ ద్వారా రూపొందించిన యాంటీ డ్రగ్స్ అవగాహన గోడ పత్రికను అదనపు కలెక్టర్, వైద్య అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతితో విధులపట్ల మరింత బాధ్యతా పెరుగుతుంది



- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు.

జోగులాంబ గద్వాల జిల్లా,(లోకల్ గైడ్ ): పదోన్నతితో విధులు పట్ల ఉత్సాహాన్ని పెంచడంతో పాటు మరింత బాధ్యతను పెంచుతుందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు. ధరూర్ పోలీస్ స్టేషన్ లో ఏ. ఎస్సై గా విధులు నిర్వహిస్తున్న వెంకట్రాములు ఎస్సై గా, రాజోలి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ హెడ్ కానిస్టేబుల్ ప్రమోషన్ పొందినందున వారికి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎస్సై స్టార్స్, హెడ్ కానిస్టేబుల్ పట్టీలను తొడిగి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి విధుల పట్ల మరింత బాధ్యతను పెంచుతోందని, భవిష్యత్ లోనూ ప్రజలకు మెరుగైన ఉత్తమ పోలీసింగ్ సేవలను అందించాలని ఆకాంక్షించారు.

# మైనర్లకు బైక్ ఇస్తే పేరెంట్స్ పై కేసులు..



ఖమ్మం -(లోకల్ గైడ్): రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రత్యేక దృష్టి పెట్టిన జిల్లా పోలీసు యంత్రాంగం స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏడు రోజుల్లో దాదాపు 31 మంది మైనర్ డ్రైవింగ్, 266 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డ మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులు, వెహికల్ ఓనర్లపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని పోలీస్ కమిషనర్ సూచించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోను వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. మైనర్లు యాక్సిడెంట్ చేసి ఎదుటి వ్యక్తి చనిపోతే, ఆతడికి బైక్ ఇచ్చిన యజమానికి 3 ఏండ్ల జైలు శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వెహికల్ నడిపితే ఉపేక్షించే ప్రసక్తే లేదని, లైసెన్సు లేనివారికి వాహనాలు ఇవ్వవద్దని యజమానులకు సూచించారు. మైనర్లు బైకులు నడిపి దొరికితే న్యాయస్థానంలో శిక్ష /జరిమానా తప్పదని అన్నారు. మైనర్లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై సైతం కేసులు నమోదు చేస్తామని, మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి వుంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్న వాహనం యొక్క ఉపయోగం దాని నడపడానికి అవసరమైన డ్రైవింగ్ లైసెన్స్ మాత్రం తీసుకోవడం లేదని, హై స్పీడుతో బైకులు నడుపుతున్నవారిలో మైనర్లే అధికం వున్నారని, ఉత్సాహంగా పరుగులు పెట్టే క్రమంలో యాక్సిడెంట్లకు కారణమవుతున్నారని, ఇలాంటి విషయాల్లో పిల్లలకు మంచిచెడు చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై వుందని అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని అన్నారు. ఈ ఏడాది మూడు నెలలలో 243 రోడ్డు ప్రమాదాలు జరిగితే ..84 మంది మృతి చెందారని,మరో 686 మందికి తీవ్రమైన గాయాలు అయ్యాయని పేర్కొన్నారు.



## నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథిలో

# ఉద్యోగ అవకాశాలు కల్పించండి



హైదరాబాద్, ప్రతిని ధి (లోకల్ గైడ్ తెలంగాణ) ఏప్రిల్ 28: బీసీ జాతీయ నాయకుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల ఐక్యత సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ డిమాండ్ చేశారు రాష్ట్ర సాంస్కృతిక సారధిలో ఉద్యోగ అవకాశాల కోసం నిరుద్యోగ కళాకారులు ఉద్యమాలు చేసి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు హామీ ఇచ్చారేది పలువురు కళాకారులు పేర్కొన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని సాంస్కృతిక సారథిలో నిరుద్యోగులకు 1500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలు డిమాండ్ చేశారు రాష్ట్ర సాంస్కృతిక శాఖ సారథి తో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలువురు నిరుద్యోగులు రాష్ట్ర ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేస్తున్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగ కళాకారులకు కలవడానికి అవకాశాలు కల్పించాలని పలువురు నిరుద్యోగ కళాకారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు అభ్యుదయ కళారంజని వ్యవస్థాపక కార్యదర్శి మొకి రాల ఉదయ్ కిరణ్ రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## హైదరాబాద్ శ్రీ చైతన్య విద్యాసంస్థలు జేఈఈ మెయిన్స్ , ఓపెన్ క్యాటగిరీలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు హ్యాట్రిక్ సాధించినందుకు విజయోత్సవ ర్యాలీ

## రోగులకు ఫ్రూట్స్ పంపిణీ , మానసిక వికలాంగులకు పండ్ల పంపిణీ , నగదు సహాయం



ఖమ్మం (లోకల్ గైడ్) దేశవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జేఈఈ మెయిన్స్ ఓపెన్ క్యాటగిరీలో ఆల్ ఇండియా ఫస్ట్ (1) ర్యాంకు హ్యాట్రిక్ గా 2023, 2024 %c% 2025 సంవత్సరాలకు మన హైదరాబాద్ శ్రీ చైతన్య విద్యాసంస్థలు సాధించడం జరిగింది మరియు ఓపెన్ క్యాటగిరీలో ఆల్ ఇండియా 100 లోపు 10 మంది విద్యార్థులు , 500 లోపు 31 మంది విద్యార్థులు ,1000 లోపు 40 మంది విద్యార్థులు తో పాటు వివిధ క్యాటగిరి లో ఒక్క హైదరాబాదు నుంచి వందలోపు 46 మంది విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించడం జరిగింది . ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మన ఖమ్మం పట్టణం నందు సోమవారం రోజు ఉదయం 9 గంటలకు శ్రీ చైతన్య విద్యా సంస్థల ఛైర్మన్ గౌరవనీయులు శ్రీ నాగేంద్ర మరియు శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఎజిఎం శ్రీ రవి కుమార్ ల ఆధ్వర్యంలో నయాబజార్ సెంటర్ నుండి భారీ మోటార్ సైకిల్ మరియు కార్ల ర్యాలీ దాదాపు 1000 మంది హైదరాబాద్ శ్రీ చైతన్య విద్యాసంస్థల ఖమ్మం పట్టణానికి సంబంధించిన విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు మరియు హైదరాబాద్ శ్రీ చైతన్య విద్యాసంస్థలకు సంబంధించిన ఏజీఎంలు , డీన్లు , అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది తో నిర్వహించడం జరిగింది . ఉదయం 10 గంటల 45 నిమిషాలకు గవర్నమెంట్ హాస్పిటల్ నందు పేషెంట్స్ కు పండ్ల పంపిణీ తో పాటు అన్నం ఫౌండేషన్ లో ఉన్న అనాథలు మరియు మానసిక వికలాంగులకు పండ్ల పంపిణీ తో పాటు నగదు సహాయం చేయడం జరిగింది . ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ఖమ్మం పట్టణ పుర ప్రజలకు , తల్లిదండ్రులకు , శ్రీ చైతన్య హైదరాబాద్ కుటుంబ సభ్యులకు మరియు పాత్రికేయ మిత్రులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు



## పహల్గం ఉగ్రదాడి ని ఖండిస్తూ కవి హృదయం కవి సమ్మేళనం



జనగామ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 28(లోకల్ గైడ్ తెలంగాణ):- కాశ్మీర్ లోని పహల్గం ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి మానవత్వం మంట కలిసిన సందర్భమని,ఈ ఉన్మాద చర్యను కలాలు, గళాల ద్వారా తీవ్రంగా ఖండిస్తున్నామని జనగామ కవి హృదయం సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు, కవి, గాయకుడు పెట్లోజు సోమేశ్వరాచారి అన్నారు. సోమవారం జనగామ స్పార్క్ గ్రామర్ స్కూల్ లో కవి హృదయం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో, కవులు కళాకారుల ఐక్య వేదిక, సాదిక్ ఫౌండేషన్ సమన్వయము లో ఏర్పాటు చేసిన కవిసమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ప్రసంగించారు. అన్ని వాదాలలో శ్రేష్ట మానవతావాదం గొప్పదని, మనిషి మనిషికి సహోదరులని, మానవీయ విలువల పరిరక్షణలో కవులు ముందుండాలని అన్నారు. సాదిక్ ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ అలీ మాట్లాడుతూ సమ సమాజ స్థాపనలో అందరూ కలిసికట్టుగా ఏకతాటిపై నడిచి మన ఐక్యతను చాటాలన్నారు. మొదట పహల్గం ఉగ్రదాడిలో మరణించిన వారికి మౌనం పాటించి నివాళులు అర్పించారు.అధ్యక్షులుగా జరిగిన కవి సమ్మేళనానికి మాన్యపు భుజేందర్, అంకాల సోమయ్య,బిలుమోజు సాయికిరణ్, రంగరాజు ప్రసాద్, అధ్యక్షత వహించి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవులు కళాకారుల ఐక్య వేదిక అధ్యక్షులు జి. కృష్ణ, ఎగిలేటి ప్రభాకర్, సాంబరాజు యాదగిరి,నక్క సురేష్, పొట్లబత్తిని భాస్కర్,గద్దం మనోజ్ కుమార్,గూటం రమేష్,జోగు సుదర్శన్, జి.కనకయ్య, సుధాకర్, జ్యోత్స్న పద్య త్రిపురారి, నిమ్మ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన కళలపై వేసవి శిబిరం ప్రారంభం



హైదరాబాద్, (ప్రతినిధి (లోకల్ గైడ్ తెలంగాణ) ఏప్రిల్ 28: గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. ఎ.శరత్ ఆదేశాల మేరకు హైదరాబాద్ లోని మాసాబ్ ట్యాంక్ లో ఉన్న గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థలో గిరిజన కళలపై పాఠశాల విద్యార్థుల కోసం వేసవి శిబిరం ప్రారంభమైంది. మే 7వ తేదీ వరకు కొనసాగనున్న ఈ శిబిరాన్ని గిరిజన గురుకుల సంస్థల కార్యదర్శి శ్రీమతి సీతాలక్ష్మి ప్రారంభించారు. శ్రీమతి సీతాలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ... ఈ వేసవి కాలంలో ఇంట్లో ఉంటూ సెల్ ఫోన్లు వాడుతూ ఉండడం వల్ల ఆరోగ్యం, మనసు రెండూ చెడిపోతాయని, కాబట్టి హైదరాబాద్ ప్రాంతవాసులకు కూడా అందుబాటులోకి వచ్చిన ఈ గిరిజన కళా వేసవి శిబిరాన్ని అందరూ అవకాశంగా తీసుకొని గిరిజన కళలు, సంస్కృతిపై అవగాహన, సాధికారత పెంచుకోవాలని హితవు పలికారు. ఇలా తొలిసారి గిరిజన కళలపై హైదరాబాద్ లో వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్న గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థను అభినందించారు.





కార్యక్రమంలో మరో అతిథిగా పాల్గొన్న గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు శ్రీ సర్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ... తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతే గిరిజన కళలను అభివృద్ధిపరుచుకున్నామన్నారు. గిరిజన సహకార సంస్థ జనరల్ మేనేజర్ శ్రీ సీతారామ్ సంస్థ మార్కెట్లోకి తెచ్చిన గిరిజన ఆహారం ప్రత్యేక విలువల గురించి చెప్పి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందజేశారు. గిరిజన పరిశోధన సంస్థ సంచాలకులు డా. వి. సముజ్వల రానున్న ఎనిమిది రోజులలో విద్యార్థులు ఏఏ కళలను నేర్చుకోనున్నారో వివరించారు. తెలంగాణ గిరిజన సంస్కృతి, కళల ప్రాధాన్యం, వాటిని ఎలా నేర్చుకోవాలో వివరిస్తూ గిరిజన మ్యూజియం క్యూరేటర్ డా. ద్యావనపల్లి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఇంజనీర్ శ్రీమతి హేమలత, ఆర్గనైజర్స్, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉపలోక యుక్త జస్టిస్ జీవన్ కుమార్





హైదరాబాద్, ప్రతినిధి (లోకల్ గైడ్ తెలంగాణ) ఏప్రిల్ 28: తతెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హైకోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీ జస్టిస్ ఎ. ఏప్రిల్ 28, 2025 న హైదరాబాద్ లోని రాజ్ భవన్లో జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ఉప-లోకాయుక్త మాజీ జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జగ్ జీవన్ కుమార్. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితదితరులు పాల్గొన్నారు

## గోనమ్మ దేవాలయ ప్రాంగణంలో బండలు... ఓ దాత సహకారం



బషీరాబాద్ (లోకల్ గైడ్): శ్రీ గోనమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో బండలు వేయడానికి ఓ దాత ముందుకు వచ్చి సహకారం అందించారు.బషీరాబాద్ మండల పరిధిలోని దామర్చేడ్ గ్రామ సమీపంలో వెలసిన శ్రీ గోనమ్మ తల్లి జాతర మే నెల 6వ తేదీన జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు దేవాలయం ముస్తాబు చేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో దేవాలయ ప్రాంగణములో బండలు పరిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో దామర్చేడ్ గ్రామానికి చెందిన పరకంటి బలరాం ముందుకు వచ్చి ప్రాంగణంలో బండలు వేయడానికి కావలసిన సహకారం నేను అందిస్తానంటూ అమ్మవారి పట్ల తనకున్న భక్తిని చాటుకున్నారు. సోమవారము బండలు వేసే పని వారిని పిలిపించి గోనమ్మ దేవాలయ ప్రాంగణంలో బండలు వేయించారు. ఈ కార్యక్రమంలో విరాళదాత పరకంటి బలరాం, మాజీ ఎంపీటీసీ రాజేందర్ రెడ్డి, నరహరి, బండలు వేసే పనివారు తదితరులు పాల్గొన్నారు.

# ప్పటికైనా ప్రమాదమేనా...?

# ప్రమాదకరంగా ఒరిగిన విద్యుత్ స్తంభం

## పట్టించుకోని మున్సిపల్ అధికారులు.



లోకల్ గైడ్ తెలంగాణ, తాండూరు టౌన్ : తాండూరు పట్టణంలో ప్రధాన రహదారిపై ఒరిగిన విద్యుత్ స్తంభం. తాండూరు నుండి చించోలి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలలో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు నేలకొరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అసలే వాతావరణ మార్పులతో ఈదురు గాలులు వీస్తూ వర్షాలు కురుస్తున్న సమయంలో..... జరగరాని ప్రమాదం జరిగితే ఎవ్వరు బాధ్యులని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోజుకు వేల సంఖ్యలో వాహనాలు తిరిగే ప్రధాన రహదారి పై విద్యుత్ స్తంభం ఒరిగి ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించకుండా... ఎలాంటి ప్రమాదం జరగకముందే తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రికార్డులు అన్నీ సక్రమంగా నిర్వహించాలి



లోకల్ గైడ్/తాండూర్: తహసిల్దార్ కార్యాలయంలో రికార్డులన్నీ సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం పెద్దేముల్ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి.. వివిధ రికార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో 2001 నుండి 2017 వరకు గల సంబంధిత రికార్డులు స్కానింగ్ చేశారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కార్యాలయంలో ఫైల్స్ అన్ని భద్రపరచుకోవాలని సూచించారు. దీంట్లో భాగంగా పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, వివిధ రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల్ని క్రమం తప్పకుండా సరిగా ఉండే విధంగా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.అదేవిధంగా ప్రతిరోజు ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. ఈ క్రమంలో మెడికల్ గదిని సందర్శించి, గడువు ముగిసిన టాబ్లెట్లు, మందులు వాడరాదు అని ఫార్మసిస్టు కు ఆదేశించారు. ఈ నేపథ్యంలో పెద్దేముల్ బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. అదేవిధంగా హాస్టల్లో నీళ్లు సక్రమంగా వస్తున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటేశ్ ప్రసాద్, రికార్డు అసిస్టెంట్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా నిరసన

# కర్రెగుట్ట లో కొనసాగుతున్న నరమేధాన్ని ఆపాలి

## మావోయిస్టు పార్టీ తో చర్చలు జరిపి అవకాశం కల్పించాలి

## వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్



లోకల్ గైడ్ తెలంగాణ, తాండూరు టౌన్ : ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని తాండూరు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కర్రెగుట్ట ప్రాంతంలో కొనసాగుతున్న నరమేధాన్ని ఆపాలని తాండూరు పట్టణం లోని అంబేద్కర్ కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.... ఛత్తీస్గడ్ - తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో గల కర్రెగుట్టలలో యుద్ధాన్ని తలపిస్తున్నాయన్నారు. ఆదివాసి గూడాల వెంట మోహరించిన భద్రత బలగాలను వెనక్కి పంపించాలని డిమాండ్ చేశారు. ఛత్తీస్గడ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసి గిరిజనులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నివసిస్తున్నారు అన్నారు. ప్రతిరోజు ఆ ప్రాంతాల్లో ఎన్కౌంటర్లు జరుగుతూనే ఉన్నాయని, మూడు రోజులుగా పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల పేరుతో 80 మందికి పైగా మావోయిస్టులు, ఆదివాసీలో హతమైనట్లు ఆరోపించారు. కర్రెగుట్ట ప్రాంతం నుండి అన్ని రకాల సాయుధ పోలీస్ బలగాలను వెంటనే ఉపసంహరించాలని, అరెస్టు చేసిన ఆదివాసి గిరిజనులను వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపే అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క స్పందించి భద్రత బలగాలను వెనక్కి పంపే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రయ్య, సిపిఐ జిల్లా సెక్రెటరీ విజయలక్ష్మి పండిత్, తెలంగాణ జన సమితి తాండూర్ ఇంచార్జ్ సోమశేఖర్, పిడిఎస్యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# దుర్గా మల్లేశ్వర స్వామి గా శివుడు..!

**భద్రేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణ దర్శించుకున్న భక్తులు**

లోకల్ గైడ్ తెలంగాణ, తాండూరు టౌన్ : దుర్గా మల్లేశ్వర స్వామిగా శివుడు దర్శనమిచ్చాడు. తాండూరు పట్టణం లోని భద్రేశ్వరాలయంలో వైశాఖ మాసం మొదటి సోమవారం సందర్భంగా ఆలయ పూజారి విజయ కుమార్ స్వామి శివున్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో వెలసిన దుర్గా మల్లేశ్వర స్వామిగా అలంకరణ చేశారు. దుర్గా మల్లేశ్వర స్వామి గా దర్శనమిచ్చిన శివుని భక్తులు దర్శించుకున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పరశురాం రెడ్డి**



లోకల్ గైడ్ / పరిగి: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పరశురాం రెడ్డి అన్నారు. పరిగి మండలం సయ్యద్ పల్లి గ్రామానికి చెందిన కొత్తూరు చిన్న మల్లేశంకు మంజురైన రూ. 44 వేల %జవీ=ఖీ% చెక్కు నుఅందజేశారు. అనారోగ్యం సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్, నాయకులు తదితులు పాల్గొన్నారు.

# భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే బుయ్యన్ని మనోహర్ రెడ్డి.
- మండల కేంద్రంలోని రైతు వేదికలో "భూ భారతి చట్టం"పై అవగాహన సదస్సు.
- కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.



లోకల్ గైడ్/తాండూర్: భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం ఉంటుందని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలో రైతు వేదికలో భూభారతి చట్టం పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా రైతులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తహసిల్దార్ వెంకటేశ్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. భూభారతి చట్టం ద్వారా రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. గతంలో ధరణి పోర్టల్ ద్వారా వేల ఎకరాల భూములు మాయమైనట్లు ఆయన తెలిపారు. భూభారతి చట్టం కేవలం రైతుల సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని వెల్లడించారు. రైతులకు ఎలాంటి భూ సమస్యలు ఉన్న భూభారతి పోర్టల్ ద్వారా శాశ్వత పరిష్కారం దొరుకుతుందని స్పష్టం చేశారు. అనంతరం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో ధరణి పోర్టల్ ను తీసుకువచ్చి, రైతులను ఆగమాగం చేశారని విమర్శించారు. అదేవిధంగా ధరణి పోర్టల్ ద్వారా కబ్జాల ఒకరు ఉంటే పట్టా పాస్ బుక్ లో పేరు మరొకరిది ఉండేదని, తద్వారా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ భూభారతి చట్టం ద్వారా రైతులకు సత్వర పరిష్కారం తహసిల్దార్ కార్యాలయంలో లభిస్తుందని స్పష్టం చేశారు.అనంతరం 24 మంది లబ్ధిదారులకు రూ. 24,02,784/- విలువగల కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను స్పీకర్ ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, రెవిన్యూ అధికారులు వెంకటేష్ ప్రసాద్,ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గోతులతో సతమతం...!

**మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంమే కారణమా...?**
**రోడ్డుపై ఇరుక్కుపోయిన లోడ్ లారీ.**



లోకల్ గైడ్ తెలంగాణ, తాండూరు టౌన్ : తాండూరు పట్టణంలో ఓ లోడ్ లారీ గుంతలో ఇరుక్కుపోయింది. పట్టణం లోని బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం ముందున్న ఓ గుంతలో నాపరాతి లోడ్ తో వెళ్తున్న లారీ ఇరుక్కుపోయింది. అంబేద్కర్ చౌరస్తా సమీపంలో పట్టణ వాసులకు తాగునీరు అందించే మన్సిపల్ పైపులైన్ లీకేజీకి గురైంది. ఇటీవలే మన్సిపల్ సిబ్బంది. పెపులైన్ లీకేజీ కోసం గుంత తవ్వి మరమ్మత్తులు పూర్తి చేశారు. తాజాగా సోమవారం సాయంత్రం కోడంగల్ రోడ్డు వైపు వెళుతున్న నాపరాతి లోడ్ లారీ మార్గంలో వెళుతూ లీకేజీకి మరమ్మత్తులు చేసి వదిలిన గుంతలో ఇరుక్కుపోయింది. లారీని బయటకు తీసేందుకు లారీ డ్రైవర్ శత విధాలుగా ప్రయత్నం చేశారు. లారీ మోరాయించడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విష యం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని బయటకు తీసే చర్యలు చేపట్టారు. పైప్ లైన్ కోసం తవ్విన గుంతను మున్సిపల్ సిబ్బంది నామమాత్రంగా మట్టితో ముసివేశారు. ప్రధాన రహదారులపై ఏర్పడ్డ గుంతలకు కారణం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



వికారాబాద్ :లోకల్ గైడ్ తెలంగాణ : సోమవారం పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ల తో కలసి జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఇన్ పేషెంట్, లాబరేటరీ, మందుల నిల్వ గదితో పాటు ఔట్ పేషెంట్, ఏఎంసీ తదితర రిజిస్టర్ ల ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా భవన పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ మరమ్మతులు పనులను త్వరితగతిన చేపట్టాలని అదేవిధంగా ఆసుపత్రి, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో అవసరాలకు అనుగుణంగా లైట్లు, ఫ్యాన్లు సమకూర్చాలని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ పరీక్షలు, గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలు, ప్రసవాల వివరాలపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ఏవైనా మందుల లోటు ఉంటే తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే అవసరమైన మందులను సరఫరా చేయిస్తానని కలెక్టర్ తెలిపారు. అనంతరం పెద్దేముల్ బి సి బాలుర వసతి గృహాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.కలెక్టర్ గారి ఆకస్మిక పర్యటనలో తహసిల్దార్ వెంకటేష్, డిప్యుటీ తహసీల్దార్ శ్రీనివాస్, డాక్టర్ శ్వేత,, ఎంపిడిఓ ల తో పాటు ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అనుమతులను రద్దు చేయాలి

**ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఎటువైపు?**
**రైతుల పక్షాన , ఇసుక మాఫియా పక్షానా??**
**బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి**



మిడ్జిల్ ఏప్రిల్ 28:(లోకల్ గైడ్): మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా పట్టా భూముల పేరుతో పర్మిషన్ తెచ్చుకున్నామని ప్రభుత్వ భూములలో దుందుభి వాగులో ప్రతిరోజు రాత్రులు పగుళ్లు అనే తేడా లేకుండా నిత్యం హిటాచిలతో టిప్పర్లతో అక్రమ ఇసుక నడిపించి ఈ ప్రాంతని ఎడారిగా మారుస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు ముచర్ల జనార్దన్ రెడ్డి అన్నారు సోమవారం మిడ్జిల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ రైతులు చేపట్టిన దీక్షలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అనిల్ రెడ్డి రైతుల పక్షాన నిలబడతారో ఇసుక మాఫియా వైపు నిలబడతారో తేల్చుకోవాలని ఆయన అన్నారు ప్రభుత్వ భూములలో ఇసుకను తవ్వొద్దు అని ప్రశ్నిస్తే ఇసుక మాఫియా గుండాలు తుపాకిలతో కాలుస్తామని స్థానిక రైతులను బెదిరించడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ఈ విషయాలన్నీ ఇక్కడ ఉన్నటువంటి పోలీస్ అధికారులకు రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు స్థానిక పోలీసులు ఇసుక మాఫియాకు అండగా నిలబడి అక్రమ ఇసుక నడవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు ఇసుక మాఫియా జోలికి వెళితే రైతులపై కేసులు కడతామని పోలీసులు బెదిరించడం ఎంత వరకు సమంజసం అని ఆయన అన్నారు రైతులపై అక్రమంగా కేసులు పెడితే సహించేది లేదని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు రైతులు ఎవరు కూడా అధైర్య పడొద్దని మీ వెంట మేమున్నామని భారతీయ జనతా పార్టీ మీకు అండగా ఉంటుందని ఆయన రైతులకు భరోసా కల్పించారు స్థానిక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి గతంలో ఈ ప్రాంతం నుండి ఇసుకను తరలించను అని రైతులకు హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పుతున్నారని ఆయన అన్నారు రైతులకు మాట చెప్పిన విధంగా రైతుల పక్షాన నిలబడతారా లేదా ఇసుక మాఫియా పక్షాన నిలబడతారా రైతులకు స్పష్టం చేయాలని ఆయన అన్నారు పోలీస్ రెవెన్యూ అధికారులు రైతుల కోసం పనిచేయలని దళారుల పక్షాన ఇసుక మాఫియా పక్షాన రౌడీల పక్షాన కాదని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ రాజేశ్వర్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి ,కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వెంకటయ్య,రైతులు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణయ్య, రాగుల పాండు, నరేష్ ,వేణు ,రాములు ,విష్ణు, గణేష్ , రఘు, రాజు, రాఘవేందర్, శ్రీను,బిజెపి నాయకులు వెంకటయ్య విష్ణు నాయక్ బుచ్చయ్య పట్నం జంగయ్య బీరయ్య తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాలు: హక్కులా రాజకీయ ప్రయోజనమా?

## ఎవరికి సంక్షేమం ?ఎవరికి ప్రయోజనం?

లోకల్ గైడ్ జడ్చర్ల: ప్రభుత్వాలు ప్రజల సామాజిక,ఆర్థిక,ఆరోగ్య మరియు విద్యా స్థాయిని మెరుగుపరిచేందుకు అమలు చేసే ప్రత్యేక కార్యక్రమాలు. వీటి ముఖ్య ఉద్దేశం సామాజిక సమానత్వాన్ని పెంపొందించడం, పేదరికాన్ని తగ్గించడం మరియు మనసా నిరుద్యోగ సమస్యలను పరిష్కరించచమే లక్ష్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడతాయి. సమాజ అభివృద్ధికి సంక్షేమం అనేది కీలకమైన అంశం. ప్రభుత్వాలు, సంస్థలు,వ్యక్తులు అందరూ కలిసి పనిచేసే లక్ష్యం ప్రజల సంక్షేమం పెంపొందించడమే అయితే,ఈ సంక్షేమం అందరికీ అందుతోందా? నిజంగా ఆ ప్రయోజనం ఆయా అవసరమైన వర్గాలకు చేరుతోందా? అనే ప్రశ్నలు మన ముందున్నవే. సంక్షేమం అంటే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం.దీనిలో ఆరోగ్యం,విద్య,ఉపాధి, ఆర్థిక భద్రత,సురక్షిత నివాసం,పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు ఉంటాయి.ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అసమానతలు తొలగించి సామాజిక సమానతను తీసుకురావడానికి సహాయపడతాయి.

### ప్రభుత్వ సంక్షేమ పథకాలు వాస్తవమైన ప్రయోజనం?

ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నాయి. పేదల కోసం ఉచిత రేషన్, ఆరోగ్య భద్రత ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య (శ్రీ) ఫీజు రీయింబర్స్‌మెంట్, మెరిట్ స్కాలర్షిప్స్ రైతులకు మద్దతు ధరలు, రుణ మాఫీలు మహిళల సాధికారత కోసం పథకాలు ఈ పథకాలు సత్వర ప్రయోజనం కలిగించినా,దీర్ఘకాలంలో నిజమైన అభివృద్ధికి తోడ్పడుతున్నాయా? అనే ప్రశ్న లేవనెత్తాల్సిందే. కొన్నిసార్లు,సంక్షేమ పథకాలు ఎన్నికల రాజకీయాల్లో ఓట్ల కోసం ఉపయోగించబడతాయి.

### సంక్షేమం అందరికీ అందుతున్నదా?

సమాజంలోని అత్యవసరంగా అవసరమున్న వర్గాలకు సంక్షేమం చేరిందా? అనేది చాలా ముఖ్యమైన విషయం.కొన్ని వర్గాలు ప్రభుత్వ సహాయాన్ని పొందుతుండగా,మరికొన్ని వర్గాలు అవి అందుకోలేకపోతున్నాయి. ఆర్థికంగా వెనుకబడినవారికి నిజంగా అందుతున్నదా? మధ్య తరగతి ప్రజలకు చాలామంది సంక్షేమ పథకాలు అందడం కష్టమవుతోంది. దుర్వినియోగం ఉందా? కొంతమంది అర్హులు కాకపోయినా రాజకీయ ప్రభావంతో ప్రయోజనం పొందుతున్నారు. ప్రభుత్వ పరిపాలనా లోపాలు సంక్షేమ పథకాలు ఉన్నా అవి లబ్ధిదారుల వరకు చేరే విధానం పారదర్శకంగా లేదా వేగంగా లేకపోవడం. సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య ఉన్న బలం సంక్షేమం అనేది ప్రజలను స్వయం సమృద్ధులను చేయడానికి ఉపయోగపడాలి. నిరంతరం ఉచిత సాయం అందించడంలో కాకుండా, వారికి విద్య,ఉపాధి, వ్యాపారం,వ్యవసాయాభివృద్ధి లాంటి అవకాశాలను అందించడం ముఖ్యం.ఒక దశలో ప్రభుత్వం సాయాన్ని అందించవచ్చు,కానీ దీర్ఘకాలంలో ప్రతి పౌరుడు స్వయం సమృద్ధిగా ఉండేలా చేయడం ప్రభుత్వ లక్ష్యం కావాలి.సంక్షేమ పథకాలు సమాజ అభివృద్ధికి అవసరమైనవి. కానీ అవి అవసరమైన వారికి చేరేలా చూడటం, దుర్వినియోగాన్ని అరికట్టడం,సంక్షేమాన్ని సామర్థ్యవంతమైన అభివృద్ధికి ఉపయోగించడం ప్రభుత్వాల కర్తవ్యంగా మారాలి.సంక్షేమం కేవలం తక్షణ ప్రయోజనం మాత్రమే కాకుండా, దీర్ఘకాలంలో స్వయం సమృద్ధికి దోహదపడేలా ఉండాలి.అప్పుడే అది సమాజానికి నిజమైన మేలు చేస్తుంది. ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై ఓట్లు వేస్తే చివరికి ప్రజలు ఎలాంటి పనులు చేయకుండా ప్రభుత్వమిచ్చే సంక్షేమ పథకాల కోసమే ఎదురు చూస్తారు. ఇకనైనా ప్రభుత్వాలు ప్రజలకు ఉపాధి కల్పించి స్వయంగా ప్రజలు కష్టపడి పని చేసినప్పుడే ప్రభుత్వము అందించే సంక్షేమ పథకాలకు ఫలితం దక్కుతుంది. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఎలాంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టకుండా విద్యా వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.అప్పుడే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో పయనిస్తుంది. వి.జానకి రాములు గౌడ్ లింగంధన.

# అంబేద్కర్ గొప్ప దార్శనికుడు...

## - చరిత్ర ఉన్నంతకాలం ఆయన మనకు గుర్తుండిపోతాడు

- ఒక్క భారతదేశమే కాకుండా యావత్ ప్రపంచమే మెచ్చ దగిన వ్యక్తి అంబేద్కర్.
- భారతదేశంలో అత్యున్నతమైన చదువులు చదివిన వ్యక్తి
- అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి.
- తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెల్లడి.
- కందనెల్లి గ్రామంలో నూతన "అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ.



లోకల్ గైడ్/తాండూర్: యావత్ భారతదేశంలోనే కాకుండా, ప్రపంచంలోనే గొప్ప దార్శనికుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కొనియాడారు. సోమవారం పెద్దేమోల్ మండల పరిధిలోని కందనెల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర శాసన సభ పతి గడ్డం ప్రసాద్ కుమార్,శాసనమండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి, ప్రజా కవి జయరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అని పేర్కొన్నారు. అంటరానితనం, కుల వివక్షను ఎదిరించి.. భారతదేశంలో గొప్ప చదువులు చదివి, అంటరానితనాన్ని అసమానతలను రూపుమాపిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. అంతేకాకుండా ఈ భారత దేశమే కాకుండా ప్రపంచమే మెచ్చుకోదగిన వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. అదేవిధంగా ఈ దేశంలో అట్టడుగు వర్గాల ప్రజలకు సమాన ఫలాలు అందాలనే ఉద్దేశంతో రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారని వెల్లడించారు. బాబాసాహెబ్ అంటే కేవలం ఒక పేరు మాత్రమే కాదు, ఈ దేశ ప్రజల యొక్క జీవన రేఖ అని సూచించారు. దళిత బడుగు బలహీన వర్గాల ప్రజలకు జీవితం ఇచ్చిన సూర్యుడు అంబేద్కర్. కాగా అంబేద్కర్ అనే వాడు ఒక ఎవరెస్టు శిఖరం లాంటివారు. అంబేద్కర్ అనేది ఒక వ్యక్తి కాదు యావత్ భారతదేశం యొక్క శక్తి అని స్పష్టం చేశారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి.

ఈ భూ ప్రపంచం ఉన్నంతవరకు అంబేద్కర్ పేరు చిరస్థాయిగా ఉంటుంది. నేటి యువత అంబేద్కర్ ఆశయ సాధనకు నడుం బిగించాలని సూచించారు. అంబేద్కర్ ఒక దళిత వాడకే కాదు యావత్ భారతదేశానికి ఒక దిక్సూచిక అని సూచించారు. కాబట్టి అంబేద్కర్ కలలు కన్నా.. ప్రతి ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లి, వాటిని నెరవేర్చే బాధ్యత మన అందరి పైన ఉంటుందని సూచించారు.

ప్రపంచంలో ఎక్కడ లేని కులం పిచ్చి ఈ భారత దేశంలో ఉంది.

మహాత్మా గాంధీ ఉన్నత చదువుల కోసం దక్షిణాఫ్రికా వెళ్లిన సంఘటన గురించి ప్రజాకవి జయరాజ్ తన మాటల్లో ఈ విధంగా వివరించాడు. మహాత్మా గాంధీ లా చదవడం కోసం దక్షిణాఫ్రికాకు వెళ్లారు. అయితే వెళ్లే క్రమంలో టికెట్ కొనుక్కొని ఫస్ట్ క్లాస్ ఏసీ డబ్బాలో కూర్చున్నాడు. ఇంతలోనే ఓ బ్రిటిష్ వ్యక్తి ట్రైన్ ఎక్కి, మహాత్మా గాంధీ కూర్చున్న స్థలంలోకి వెళ్లి... గాంధీ యొక్క బ్యాగు లాక్కొని విసిరి బయటపడేశారు. అప్పుడు గాంధీ ఏమన్నాడు అంటే.. నేను ఫస్ట్ క్లాస్ టికెట్ తీసుకున్నాను, నా బ్యాగు ఎందుకు విసిరి పాడవేశావు అని బ్రిటిష్ వ్యక్తిని గాంధీ అడిగిన సంఘటన గుర్తు చేశారు. ఈ భారత దేశంలో కుల పిచ్చి ఎంత ఉందో, తన మాటల్లో వివరించాడు. ఈ భారత దేశంలో 70 శాతం యువత ఉంది. అయినా ఈ దేశం అభివృద్ధి చెందలేదు అంటే దానికి ప్రధాన కారణం కులం అని సూచించారు.

కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, విగ్రహ దాత ముజీబ్ ఖాన్, పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, కవులు, రచయితలు, కళాకారులు, అంబేద్కర్ సంఘం నాయకులు, కందనెల్లి గ్రామ ప్రజలు.. శ్రీనివాస్ చారి, మాజీ సర్పంచ్ బలరాం, మాజీ వైస్ ఎంపీపీ మధు లత, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కిరణ్, మధుసూదన్ రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జనార్ధన్, శ్రీకాంత్, స్వరాజ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా చర్యలు తీసుకోవాలి

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎన్ శంకర్**



వికారాబాద్ :లోకల్ గైడ్ తెలంగాణ: ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రభత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్వాన్స్ సప్లి మెంటరీ పరీక్షలలో ప్రతి సబ్జెక్టులో 100% ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈనెల 30వ తేదీ లోపు అడ్వాన్స్ మెంటరీ పరీక్ష ఫీజు చెల్లించడానికి ప్రిన్సిపాళ్లు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కు ఉపన్యాసకులు తగు మార్గదర్శనం చేయా లన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాస్థాయి ఫలితాలు మెరుగుపడ్డాయన్నారు . మార్చి నెలలో పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన సిబ్బందిని అభినందించారు.అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఉపన్యాసకులు విద్యార్థులకు తగు మార్గదర్శనం చేసి ఉత్తమమైన ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం కళాశాలల వారీగా ఫలితాలను సమీక్షించారు. కళాశాలల్లో అడ్మిషన్లు పెంచడానికి ప్రిన్సిపాళ్లు, ఉపన్యాసకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు నరసింహారెడ్డి, బుచ్చిరెడ్డి, కుమార స్వామి,సురేశ్వర స్వామి, ఎస్. వెంకటేశ్వరరావు, నర్సిములు, తాండూర్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ మల్లి నాథప్ప ఉపన్యాసకులు రాములు రఘు వీర్ దాస్, ఆఫీస్ సిబ్బంది వినోద్, సలీమా బేగం, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### పరీక్ష ఫీజు తేది పెంపు ఉండదు

ఇంటర్ అడ్వాన్స్ సప్లీమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు ను సంబంధిత కళాశాలలో ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించ వచ్చునని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి ఎన్. శంకర్ తెలిపారు. విద్యార్థులు వారి తల్లి దండ్రులు, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్ళు విద్యార్థులు పరీక్ష ఫీజు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 30 తర్వాత ఫీజు చెల్లించడానికి ఫీజు తేది పెంపు ఉండదని ఆయన స్పష్టం చేశారు. దీనిని పరీక్షలు వ్రాసే విద్యార్థులు దృష్టిలో ఉంచు కొని ఫీజు చెల్లించాలన్నారు.

## నిరుపేదలకు వరం సీఎం సహాయ నిధి..

**కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్**



లోకల్ గైడ్ న్యూస్ తెలంగాణ కొత్తూరు: నిరుపేదలకు వరం సీఎం సహాయ నిధి అని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్ అన్నారు. సోమవారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్ కి చెందిన పాశం మల్లేష్ కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన 34,000/- చెక్కును కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న వారికి సీఎం సహాయ నిధి ఆర్థిక సహాయం ఎంతో సహాయపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాశం కృష్ణ,కుమ్మరి సురేష్,గణిభై, కూన ప్రవీణ్ గౌడ్,ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## పోచంపల్లి గురుకుల బాలికలను అభినందించిన ఎమ్మెల్యే



శంకరపట్నం,, ఏప్రిల్ 28,,(లోకల్ గైడ్ తెలంగాణ): ఇటీవల వెల్లడించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన మానకొండూర్ మండలం పోచంపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్ విద్యార్థినులు పిల్లి అంజలి, బాకారపు రక్షితలను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి సోమవారం ఎల్.ఎం.డీ కాలనీలో క్యాంపు కార్యాలయానికి వచ్చిన అంజలి, రక్షితలు ర్యాంకులు సాధించడంపై ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్ హర్షం వ్యక్తం చేస్తూ సదరు బాలికలను అభినందించారు. వేర్వేరు గ్రూపుల్లో అంజలి 500 మార్కులకుగాను 492, రక్షిత 440 మార్కులకు గాను 434 మార్కులు సాధించడం సంతోషకరమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. కష్టపడి చదివి మరింత ఉత్తమ ఫలితాలు సాధించాలని, తద్వారా భవిష్యత్ లో ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, గన్నేరువరం, ఇల్లంతకుంట మండల పార్టీ అధ్యక్షులు ముస్కు ఉపేందర్ రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు కోండ్ర సురేష్, శ్రీనివాస్ గౌడ్, కొమ్మెర రవీందర్ రెడ్డి, మాచర్ల అంజయ్య, కొత్త తిరుపతిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు,ఇంచార్జీలు బి.శ్రీనివాస్, తిరుపతిగౌడ్, శ్రీరాం శ్రీనివాస్, డాక్టర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## బార్ లైసెన్స్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల డ్రా

**వికారాబాద్ జిల్లా మద్యనిషేధ ఆబ్కారీ శాఖ, అధికారి కే. విజయ భాస్కర్**

వికారాబాద్ జిల్లా :లోకల్ గైడ్ తెలంగాణ : అనగా తేదీ:- 29-04-2025 నా వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ లో కోడంగల్ మున్సిపాలిటి పరిదిలో "01" బార్ లైసెన్స్ జారీ చేసేందుకు ఉదయం 11.00 గం లకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ అధ్వర్యములో కలెక్టరేట్ లోనీ సమావేశ హాలు లో డ్రా తీయబడును. కావున ఈ కార్యక్రములో ధరఖాస్తు చేసుకున్న ధరఖాస్తు దారులు లేదా వారి నుండి పవర్ ఆఫ్ అటార్నీ పొందిన వ్యక్తులు తప్పనిసరిగ్గా సమయము 10.00 గం లకు ఎంట్రీ పాస్ తో హాజరు కావాల్సిందిగా సూచించారు.

## బాల్య మిత్రుడికి బాసటగా...



శంకరపట్నం, ఏప్రిల్ 28 (లోకల్ గైడ్ తెలంగాణ): స్థానిక కేశవపట్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987- 88 బ్యాచ్ కి చెందిన పదవ తరగతి విద్యార్థులు తమ బాల్య మిత్రుడికి బాసటగా నిలిచారు. సైదాపూర్ మండలం, గర్రెపల్లి గ్రామానికి చెందిన వేముల రాజమొగిళి (52)కేశవపట్నంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ పదవ తరగతి వరకు చదువుకున్నాడు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజమొగిలి మృతితో పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబానికి ఆనాటి స్నేహితుల్లో కొందరు కలిసి పోగుచేసిన రూ. 22500 గర్రె పల్లి గ్రామంలో కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూతగా అందజేశామని కొత్తపెల్లి తిరుపతి, భోజనపల్లి శ్రీ వాణి లు తెలిపారు.

## హనుమాన్ దేవాలయానికి భారీ విరాళం



లోకల్ గైడ్ న్యూస్ నందిగామ: శంషాబాద్ మాజీ జడ్పీటీసీ నిరటి తన్వి రాజు ముదిరాజ్ చేగూర్ హనుమాన్ దేవాలయానికి 9 లక్షల భారీ విరాళం కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ చేగూర్ గ్రామంలో నూతనంగా నిర్మింస్తున్న హనుమాన్ దేవాలయానికి శంషాబాద్ తాజా మాజీ జడ్పీటీసీ నిరటి తన్వి రాజు ముదిరాజ్ గారు 9 లక్షల భారీ విరాళాన్ని చేగూర్ గ్రామ ప్రజలకు అందజేశారు అనంతరం మాట్లాడుతూ హనుమాన్ దేవాలయానికి విరాళం అందజేయడం ఆనందంగా ఉంటుందని అన్నారు చిరంజీవి ఆంజనేయుడు అతిబలవంతుడు ఆయన దేవాలయ నిర్మాణనికి సహాయం చేయడం ఎన్నో జన్మల సుకృతమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లికట్టె కృష్ణయ్య , డీలర్ శ్రీనివాస్ గౌడ్ , ఎంపీ రాజు గౌడ్ , మంకల శ్రీశైలం , ఎంపీ భాస్కర్ గౌడ్ , ఆవుల శివశంకర్, పబ్బే నరేందర్ , పబ్బే రవితేజ , అన్నారం నర్సింహా , రాఘవేందర్ గౌడ్, వెంకట్ చారి , నరేష్ ముదిరాజ్ , మంగలి మహేష్ , మంగలి శ్రీనివాస్ , గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కల్లపర్రి గ్రామంలో సంచార వైద్య శిబిరాన్ని తనిఖీ చేసిన నోడల్ అధికారి రఘు



ఆస్పరి:- సోమవారం ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కల్లపరి గ్రామములోని వైద్య శిబిరన్ని సంచార చికిత్స కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్. రఘు తనిఖీ చేశారు, ఇంటిలోనూ ,పరిసరాల్లో ఉండే చిన్న నీటి నిలువల్లో పెరుగుతాయని, పాత వస్తువులు ,పూల కుండీలు, కూలర్లు, టైర్లు,తాగి పడేసిన కొబ్బరి బోండాలు,రుబ్బు రోళ్ళలో ఉన్న నీటి నిల్వల్లో పెరిగి డేంగి, చికున్ గన్యా వ్యాధులు వ్యాప్తి చేస్తాయని తెలిపారు. వారానికి ఒకసారి టిని తొలగించి వాడుకోవాలని, తప్పనిసరిగా నీటి పాత్రలపై మూతలు ఉంచాలని తెలిపారు అనంతరం చికున్ గన్యా వ్యాధిపై అవగాహన కల్పించినారు.వైరస్ ద్వారా వచ్చే ఈ వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని, తలనొప్పి,వాంతులు వికారముతో హఠాత్తుగా వచ్చే జ్వరము,చేతి వేళ్లు,కాళ్ళు నుండి మొదలుకొని శరీరంలోని అన్నీ కీళ్లని బాధిస్తుంది ,కీళ్ల నొప్పుల వలన సరిగ్గా నిలబడలేని పరిస్తితి,జ్వరము తగ్గినా ఈ నొప్పులు ఎక్కువ కాలము ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమములో వైద్యులు డాక్టర్. దుర్గ బాయి గారు, సామజిక ఆరోగ్య అధికారులు పద్మావతి, శంకర్, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు శకుంతల, పద్మావతి, ఆశా కార్యకర్తలు మరియు ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు,

# గ్రామ రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించండి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**



నిర్మల్ (లోకల్ గైడ్ తెలంగాణ) : గ్రామ రెవెన్యూ సదస్సులను సమగ్రంగా, సమయానుసారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని మండలాల తహసీల్దార్లతో భూభారతి, రెవెన్యూ సదస్సులు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ, వరి కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ, త్రాగునీటి సరఫరా తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేసారు. గతంలో నిర్వహించిన సదస్సులు, గుర్తించిన సమస్యల వివరాలను మండలాల వారీగా తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి పంచాయితీలో గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహించి, భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే అన్ని మండలాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. తహసిల్దార్లంతా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ, టార్పాలిన్స్, గన్ని బ్యాగ్స్ తదితర సౌకర్యాలు ఉండేలా పర్యవేక్షించాలన్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో జిల్లాకు వర్ష సూచన ఉన్నందున, రైతులందరూ తమ ధాన్యాన్ని కాపాడుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సందర్శించి, చెరువుల ఎఫ్ టిఎల్ హద్దులను గుర్తించాలన్నారు. చెరువులు ఆక్రమణలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి తగినంత ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. రెవెన్యూ భూ రికార్డులను స్కాన్ చేసి, డిజిటల్ రూపంలో భద్రపరచాలన్నారు. వేసవి నేపత్యంలో గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలనీ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, భైంసా ఆర్డిఓ కోమల్ రెడ్డి, రెవెన్యూ అధికారులు సవిత, స్వాతి, ఈడిఎం నదీమ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



నిర్మల్ (లోకల్ గైడ్ తెలంగాణ) : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు వంటి అంశాలపై ప్రజలు తమ సమస్యలను నివేదించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని, శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తులకు సంబంధించి వివరాలను రిమార్కుల విభాగంలో స్పష్టంగా నమోదు చేయాలని, దరఖాస్తుదారులకు పరిష్కారం గురించి సమాచారం అందించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో జిల్లాలో మారుమూల ప్రాంతాల ప్రజలకు సహాయార్థం ఏర్పాటు చేసిన టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి ఫోన్ కాల్స్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు పంపించి తక్షణమే పరిష్కారం చేపట్టాలని సూచించారు. దరఖాస్తు వివరాలను వాట్సప్ ద్వారా స్వీకరించి, సమస్య నమోదుకు సంబంధించిన రసీదులను దరఖాస్తుదారులకు పంపించారు. ప్రజలు ఇంటినుంచే 91005 77132 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేసి, వాట్సప్ ద్వారా దరఖాస్తులు పంపవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి సహకరించండి..

**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్**

**ఢిల్లీలో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్**

**ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబంధించి కీలక అంశాలపై చర్చించిన మంత్రి టి.జి భరత్**



కర్నూలు:- ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అగ్రగామి గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను స్థాపించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి పూర్తిగా సహకరించాలని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను.. మంత్రి టి.జి భరత్ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబంధించి కీలక అంశాలపై చర్చించారు. టమోటా పంటను అధికంగా పండిస్తున్న రాయలసీమ జిల్లాల్లో ఆపరేషన్ గ్రీన్స్ పథకం కింద మొదటి విడత రెండవ విడత మొత్తం రూ. 9.76 కోట్లు విడుదల చేయాలని మంత్రి టి.జి భరత్ కోరారు. ఆరు నెలల్లోపు మొత్తం ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేయడానికి మిగిలిన గ్రాంట్ మొత్తం రూ. 34.17 కోట్లు విడుదల చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. రాయలసీమ జిల్లాల్లో రైతులు టమోటా పంటను అత్యధికంగా సాగు చేస్తారని కేంద్ర మంత్రికి వివరించారు. టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్స్ ఏర్పాటుచేయడం ద్వారా పంట కోత తర్వాత నష్టం జరగకుండా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతానికి ఈ కేంద్రాలు ఎంతో ముఖ్యమైనవని చెప్పారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో 175 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్.. కేంద్ర మంత్రికి వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను అభివృద్ధి చేయడం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీఎంకేఎస్‌వై స్కీమ్స్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలనుకునే వారు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా నేరుగా అప్లై చేసుకునేలా ఏపీకి వెసులుబాటు కల్పించాలని మంత్రి టి.జి భరత్ కోరారు. ఇప్పుడున్న ప్రక్రియ పెట్టుబడుల ప్రతిపాదనలను సకాలంలో సమర్పించడానికి ఒక అడ్డంకిగా ఉందన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి ఎంతో దోహదపడే ఈ అంశాన్ని పరిశీలించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ సందర్భంగా తిరుపతి ఐఐటీలో ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద రూ. 2.67 కోట్ల గ్రాంట్‌తో స్థాపించిన ఇంక్యూబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబందించిన అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు.

# పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ఆడిట్ చేయాలి

**ప్రజల సమస్యలను ఓపిగ్గా వినాలి**

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

కర్నూలు:- పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యంగా పరిష్కారం అయ్యాయా లేదా అని ఆయా శాఖల జిల్లా అధికారులు ఆడిట్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార





వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) లో భాగంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.. పిజిఆర్ఎస్ లాగిన్ లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయాల్సి ఉందని, ఇందుకు సంబంధించి పోలీస్ శాఖ లో 1400, డిఆర్ఓ వద్ద 1100, ఏడి సర్వేయర్ వద్ద 540, డ్వామా పిడి వద్ద 50, హౌసింగ్ పిడి వద్ద 67, వ్యవసాయ శాఖ వద్ద 79, డిఎంహెచ్ఓ వద్ద 97 పెండింగ్ ఉన్నాయని, అలాగే కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ ల వద్ద కూడా ఎక్కువ సంఖ్యలో అర్జీల ఆడిట్ పెండింగ్ ఉందని, త్వరితగతిన వీటిని ఆడిట్ చేసి పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.. ప్రభుత్వ సేవలకు సంబంధించి సివిల్ సప్లైస్, అన్న క్యాంటీన్, రెవెన్యూ, సర్వే, వైద్యం, మైనింగ్ తదితర శాఖల మీద ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ (సిటిజన్ ఫీడ్ బ్యాక్) తీసుకుంటున్నారని, ఇందుకు సంబంధించి మొదటి సారి ఫిర్యాదు వచ్చినపుడు సంబంధిత వ్యక్తిని పిలిపించి మాట్లాడాలన్నారు.. రెండు సార్లు రిపీట్ ఐతే జాయింట్ కలెక్టర్, మూడు సార్లు అయితే జిల్లా కలెక్టర్ మాట్లాడతారన్నారు...సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఫీడ్ పై మండలాల వారీగా సమీక్షలు నిర్వహించి,.లోపాలు ఏవైనా ఉంటే సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు.. సిటిజన్ ఫీడ్ బ్యాక్ లో అధికారులు ప్రజలతో ఏ విధంగా మాట్లాడుతున్నారు, ప్రజల సమస్యలను ఓపికతో వింటున్నారా లేదా అని వివరాలు తీసుకుంటున్నారని, మద్దికెర, హాలహర్వి, వెల్దుర్తి మండలాల తహసీల్దార్ లు ప్రజల సమస్యలు ఓపిగ్గా వినలేదని ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు..అలాగే ఫిర్యాదుల పరిష్కారంలో గోనెగండ్ల , మద్దికెర, హాలహర్వి, కర్నూలు అర్బన్ మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు.. ఈ అంశాల పై సమీక్షలు ఎప్పటికపుడు నిర్వహించుకోవాలని కలెక్టర్ డిఆర్ఓ, సెట్కూరు సీఈఓ ను ఆదేశించారు... అధికారులు ప్రజలతో బాగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసి, వారి నుండి సానుకూల స్పందన పొందేలా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. సిఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 25, కర్నూలు ఆర్డీఓ వద్ద 24, పత్తికొండ ఆర్డీఓ వద్ద 11, డిఆర్డిఏ పిడి వద్ద 6, సర్వే ఏడి వద్ద 4, అటవీశాఖ, సివిల్ సప్లైస్, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ఒక్కొక్క అర్జీ చొప్పున పెండింగ్ లో ఉన్నాయన్నారు.. సిఎంఓ గ్రీవెన్స్ లు పెండింగ్ ఉండకూడదని, ఎప్పటికపుడు పరిష్కారం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు... సునయన ఆడిటోరియంలో కలెక్టర్ వేదిక పై నుండి కిందకు దిగి వచ్చి విభిన్న ప్రతిభావంతుల నుండి, సునయన ఆడిటోరియం బయట అర్జీ దారుల నుండి వినతులను స్వీకరించారు.. వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు,జిల్లా అధికారులు పాల్గొన్నారు..

లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

సంపాదకీయం

# కార్పొరేట్ సంస్థలకు కళ్లెం

## (విశ్లేషణ)

ప్రభుత్వాల హవా తగ్గి కార్పొరేట్లు, గుప్పెడుమంది వ్యక్తులు రాజ్యాన్ని శాసించే స్థితి ప్రపంచమంతటా వచ్చి చాన్నాళ్లవుతోంది. ఇలాంటి స్థితిలో డిజిటల్ మార్కెటింగ్ చట్టం (డీఎంఏ) ఉల్లంఘనలకు పాల్పడినందుకు అమెరికన్ బడా టెక్ సంస్థలు యాపిల్, మెటా (ఫేస్‌బుక్)లకు భారీయెత్తున జరిమానా విధించి యూరోపియన్ యూనియన్ (ఈయూ) కొంత సాహసాన్ని ప్రదర్శించిందనే చెప్పాలి. యాపిల్ సంస్థకు **57** కోట్ల డాలర్లు (రూ. **4,868** కోట్లుపైగా), మెటా సంస్థకు దాదాపు **23** కోట్ల డాలర్లు (రూ. **1,965** కోట్లు) ఈయూ పెనాల్టీ విధించింది. వచ్చే జూన్ చివరికల్లా యాపిల్ ఈయూ నిబంధనలకు భిన్నంగావున్న తన యాప్ స్టోర్ నిబంధనల్లో సవరణలు చేయకపోతే రోజువారీ జరిమానాలు మొదలవుతాయి. మెటా సంస్థ నిరుడు ఈయూ నోటీసు అందుకున్నాక దారికొచ్చి యాప్ స్టోర్‌లో మార్పులు తెచ్చింది. అందువల్ల పాత తప్పులకు మాత్రమే జరిమానా పడింది. ఈయూ తమపై కక్షసాధింపు ధోరణిలో వ్యవహరిస్తున్నదని ఆ రెండు సంస్థలూ ఆరోపిస్తున్నాయి. నిజానికి ఈ రెండు సంస్థలకు విధించిన జరిమానాలూ చాలా తక్కువన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లోవుంది. మ్యూజిక్ స్ట్రీమింగ్‌లో నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ నిరుడు యాపిల్ సంస్థకు **205** కోట్ల డాలర్ల (రూ. **17,500** కోట్లపైమాటే), మెటా సంస్థకు **90** కోట్ల డాలర్ల (రూ. **7,685** కోట్లకుపైగా) జరిమానాలు విధిస్తున్నట్టు ఈయూ ప్రకటించింది. ఏడాదిగా ఆ సంస్థల వివరణను పరిశీలించే పేరిట తాత్సారం చేసి చివరకు తుది తీర్పు ప్రకటించింది. ఆ సంస్థలు మాత్రం ఇది కూడా అన్యాయమేనన్నట్టు భూమ్యాకాశాలు ఏకం చేస్తున్నాయి. వర్తమాన పరిస్థితుల్లో ఈయూ ఈ స్థాయి జరిమానాలు విధించటం ఒకరకంగా సాహసమనే చెప్పాలి. ఎందుకంటే అమెరికా అధ్యక్ష పీఠాన్ని ట్రంప్ అధిష్ఠించాక లెక్కలు మారిపోయాయి. సర్వరోగ నివారిణిగా ఆయన అధిక సుంకాల మోతమోగిస్తానంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రత్యేకించి అమెరికన్ టెక్ కంపెనీల జోలికి ఎవరొచ్చినా తాట తీస్తామంటున్నారు. మొన్న ఫిబ్రవరిలో ప్యారిస్‌లో జరిగిన కృత్రిమ మేధ సదస్సు సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈయూపై బాహాటంగానే అక్కసు వెళ్లగక్కారు. ఏఐ ప్రగతిని అడ్డుకునేలా యూరప్ వ్యవహ రిస్తున్నదని, అమెరికా బడా సంస్థలను అతిగా నియంత్రించే పోకడలు మానుకోవాలని హెచ్చరించారు. ఆయన ప్రత్యేకించి డీఎంఏ, డిజిటల్ సర్వీసెస్ చట్టం (డీఎస్ఏ)లను ప్రస్తావించారు కూడా. జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) సైతం తమకు సమ్మతం కాదని తెలిపారు. యూరప్ దేశాల్లో నిబంధనలు తమ వ్యాపార విస్తరణకూ, లాభార్జనకూ ఆటంకం కలిగిస్తున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందుతున్నట్టు వాన్స్ వివరించారు. ఈ పోకడల్ని సహించబోమన్నారు. ఇదంతా గుర్తుంచుకుంటే ఈయూ తాజా నిర్ణయంలోని ఆంతర్యమేమిటో బోధపడుతుంది. కాకి పిల్ల కాకికి ముద్దన్నట్టు ఏటా కోట్లాది డాలర్లు పన్నుల రూపంలో చెల్లిస్తున్న తమ బడా సంస్థలంటే అమెరికాకు అభిమానంవుండొచ్చు. కానీ ఆ సంస్థలు రకరకాల నిబంధనల పేరిట సాధారణ వినియోగదారుల్ని పీల్చి పిప్పి చేస్తున్నా, దివాలా తీయిస్తున్నా వేరే దేశాల వారెవరూ మాట్లాడకూడదని ట్రంప్, వాన్స్ భావించటం తెంపరితనం తప్ప మరోటి కాదు. యాపిల్ యాప్ స్టోర్‌లో లభించే మ్యూజిక్ యాప్ తదితరాలపై అధికంగా వసూలు చేస్తున్నారని భావించే వినియోగదారులు నేరుగా తమ వద్ద కొనుగోలు చేయొచ్చని చెప్పే దెవలపర్ల సందేశం కనబడకుండా, ఆ యాప్‌కు నేరుగా తీసుకెళ్లే లింక్‌లు పనిచేయకుండా యాపిల్ నిరోధిస్తున్నది. ఇక మెటా అయితే తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో లభ్యమయ్యే యాప్‌లు కావాలంటే వినియోగదారుల వ్యక్తిగత డేటా ఉపయోగించుకోవటానికి అనుమతించాలని షరతు విధిస్తోంది. అంగీకరించనివారికి ఆ యాప్‌లలో వాణిజ్య ప్రకటనలు కనబడేలా చేస్తోంది. అవి వద్దనుకుంటే నెలవారీ ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. సాంకేతికతలు ఎంతగానో విస్తరించిన ఈ తరుణంలో బడా కార్పొరేట్ సంస్థలు వాటిపై ఆధారపడకతప్పని స్థితి జనాలకు కల్పించి చెల్లిస్తారా... చస్తారా అన్నట్టు పీక్కుతింటున్నాయి. ఈ స్థితిలో కీలెరిగి వాతపెట్టిన చందాన డీఎంఏ రంగప్రవేశం చేసింది. టెక్ కంపెనీలు ఉల్లంఘనలకు పాల్పడితే ఆ సంస్థల ప్రపంచ టర్నోవర్‌లో **10** శాతం, పదే పదే ఆ తప్పులు చేస్తూ పోతే ప్రపంచ టర్నోవర్‌లో **20** శాతం మేర జరిమానాలు విధించాలని చట్టం నిర్దేశిస్తోంది. కార్పొరేట్ సంస్థలకు వాతలుపెట్టి అనవసరంగా ట్రంప్ ఆగ్రహాన్ని చవిచూడటమెందుకని ఈయూ జంకుతున్న వైనం తాజా నిర్ణయంలో స్పష్టంగా కనబడుతోంది. వాటిపై చర్య తీసుకుంటున్నామన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లో కలగాలి... అదే సమయంలో ట్రంప్ చేత చీవాట్లు తినకుండా, ఆయనగారిని మరీ నొప్పించకుండా గండాన్ని గట్టెక్కాలి అని ఈయూ భావిస్తోంది. అయితే మనకన్నా ఈయూ ఎంతో నయం. గుత్తాధిపత్య వ్యాపార ధోరణులను అరికట్టడానికున్న కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కఠినంగా ఉండలేకపోతున్నది. గూగుల్ సంస్థ పోకడలను అరికట్టడంలో ఎంతో కొంత విజయం సాధించినా అది చాలినంతగా లేదు. వినియోగదారులూ, స్థానిక పరిశ్రమలూ నిలువుదోపిడీకి గురికాకుండా... టెక్ సంస్థలైనా, మరే ఇతర సంస్థలైనా ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా ప్రభుత్వాలు పనిచేయాలి. అందుకు కావలసిన చట్టాలు తీసుకురావాలి. అనారోగ్యకర వ్యాపార పోకడలపై కఠినచర్యలుండాలి. బడా కార్పొరేట్ సంస్థలు తమ లాభాలను అపారంగా పెంచుకోవటం, అవి ప్రభుత్వాల్ని శాసించే స్థితికి ఎదగటం ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తుంది. అందుకే ఈయూ చర్యల్ని స్వాగతించాలి.

# రోగం వస్తే మెడిసిన్ లేదు కానీ ..
# యుద్ధం కావాలా నాయనా!



(లోకల్ గైడ్):పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య మరింత ఉద్రిక్తతలు పెరిగాయి. యుద్ధం తప్పదా అన్న విధంగా ఇరుదేశాలు సన్నాహాలు సిద్ధం చేస్తున్నాయి. ఉగ్రవాదులను , వారికి మద్దతు ఇస్తున్న వారికి గుణపాఠం తప్పదని భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా హెచ్చరించారు. సింధు నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తూ పాక్‌కు గట్టి షాక్ ఇచ్చారు. ఇండియాలో ఉన్న ఆ దేశ పౌరులు వెళ్లిపోయాలని ఆదేశాలు జారీ చేశారు. పాకిస్తాన్‌తో వాణిజ్య సంబంధాలను నిలిపివేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. దీనికి ప్రతిస్పందనగా, పాకిస్తాన్ కూడా భారత్‌తో అన్ని రకాల వాణిజ్యాన్ని నిలిపివేసింది. అయితే ఇప్పటికే రాజకీయ, ఆర్థిక సంక్షోభంతో పాటు ఆకలి కేకలతో అలమటిస్తున్న పాక్ పరిస్థితి మరింత దిగజారనుంది. వాణిజ్య సంబంధాల నిలిపివేత పరిణామం పాకిస్తాన్‌లోని ఔషధ రంగంలో తీవ్ర కలకలం సృష్టించింది. తమ దేశంలో ఔషధాల కొరత రాకుండా చూసేందుకు పాకిస్తాన్ ఆరోగ్య అధికారులు 'అత్యవసర సన్నద్ధత' చర్యలను యుద్ధప్రాతిపదికన ప్రారంభించింది. ఇప్పటికే సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్న పాక్ కు ఔషద సరఫరా నిలిపివేస్తే చావు కేకలు తప్పవని నిపుణులు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం, పాకిస్తాన్ తన మొత్తం ఔషధ అవసరాలలో ముఖ్యంగా ముడి పదార్థాలు ( యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్స్ ) అనేక కీలకమైన పూర్తిస్థాయి ఔషధ ఉత్పత్తుల కోసం భారతదేశంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. దాదాపు 30 శాతం నుండి 40 శాతం వరకు ముడి పదార్థాలు భారతదేశం నుంచే దిగుమతి అవుతున్నాయి. వీటితో పాటు, ప్రాణాధారమైన వ్యాక్సిన్లు, ముఖ్యంగా యాంటీ-రేబీస్ వ్యాక్సిన్, యాంటీ-స్నేక్ వెనమ్, క్యాన్సర్ చికిత్సకు అవసరమైన మందులు, మోనోక్లోనల్ యాంటీబాడీస్ వంటి కీలకమైన జీవసంబంధ ఉత్పత్తులు కూడా భారతదేశం నుంచే పాకిస్తాన్‌కు చేరుతున్నాయి. డ్రగ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ పాకిస్తాన్ (%ణ=ూా%) అధికారులు ఈ విషయాన్ని ధృవీకరించారు. నిషేధంపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదని, అయితే పరిస్థితిని ఎదుర్కోవడానికి ఆకస్మిక ప్రణాళికలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని వారు తెలిపారు. 2019లో తలెత్తిన సంక్షోభం తర్వాతే తాము ఇలాంటి పరిస్థితులకు సన్నద్ధమవడం ప్రారంభించామని, ఇప్పుడు తమ ఔషధ అవసరాలను తీర్చడానికి చైనా, రష్యా, పలు యూరోపియన్ దేశాల వంటి ప్రత్యామ్నాయ మార్గాలను చురుకుగా అన్వేషిస్తున్నామని ఒక సీనియర్ %ణ=ూా% అధికారి పేర్కొన్నారు. యాంటీ-రేబీస్ వ్యాక్సిన్లు, యాంటీ-స్నేక్ వెనమ్, క్యాన్సర్ చికిత్సలు, మోనోక్లోనల్ యాంటీబాడీస్ వంటి ప్రాణాధారమైన వైద్య సామాగ్రి నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చూడడమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. డ్రగ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ పాకిస్తాన్ సన్నద్ధత కొంత వరకు ధైర్యాన్ని ఇస్తున్నప్పటికీ, పరిశ్రమ నిపుణులు , ఆరోగ్య రంగ ప్రముఖులు పరిస్థితి తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య నిషేధం వల్ల ఏర్పడే ప్రతికూల ప్రభావాన్ని తక్షణమే పరిష్కరించకపోతే, దేశంలో ఔషధాల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. 'పాకిస్తాన్ తన ఔషధ ముడి పదార్థాలలో సుమారు 40 శాతం మేర భారతదేశం నుండి దిగుమతి చేసుకుంటుంది. ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సలు, జీవసంబంధ ఉత్పత్తులు, వ్యాక్సిన్లు , సెరా, ప్రత్యేకించి యాంటీ-రేబీస్ వ్యాక్సిన్ , యాంటీ-స్నేక్ వెనమ్ వంటివి భారతదేశం నుండి దిగుమతి చేసుకుంటాము' అని పాకిస్తాన్ జాతీయ ఆరోగ్య సేవల మంత్రిత్వ శాఖకు చెందిన అధికారి తెలిపారు. ప్రభుత్వం అన్ని రకాల వాణిజ్యాన్ని నిషేధిస్తున్నట్లు సాధారణ ప్రకటన చేసినప్పటికీ, ఔషధ రంగానికి మినహాయింపు ఉందా లేదా అనేదానిపై స్పష్టత లేదు. సరఫరాలో అంతరాయం ఏర్పడితే కీలకమైన కొరత ఏర్పడుతుందని ఔషధ రంగం తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తోంది. ఈ పరిస్థితికి బ్లాక్ మార్కెట్ ఉనికి మరింత పెంచే అవకాశం ఉందని పాక్ ఆరోగ్య ఆందోళన వ్యక్తం అవుతుంది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, దుబాయ్ , తూర్పు సరిహద్దుల గుండా నమోదుకాని, ఆమోదం లేని మందులు, అక్రమంగా పాకిస్తాన్‌లోకి రవాణా అవుతున్నాయి. చట్టబద్ధమైన దిగుమతుల వల్ల ఏర్పడిన ఖాళీలను ఈ మార్గాలు కొంత వరకు పూరిస్తున్నప్పటికీ, వీటి నాణ్యతకు లేదా స్థిరమైన సరఫరాకు ఎటువంటి హామీ లేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఔషధ రంగ ప్రతినిధులు రంగంలోకి దిగారు. పాకిస్తాన్ ఫార్మాస్యూటికల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ చైర్మన్ తౌఖీర్-ఉల్-హక్ నేతృత్వంలోని ఒక ప్రతినిధి బృందం ఇస్లామాబాద్‌కు వెళ్లి వాణిజ్య నిషేధం నుండి తమ రంగాన్ని మినహాయించాలని కోరుతూ ప్రభుత్వ అధికారులను కలిసింది. భారతదేశం నుండి ప్రత్యేకంగా ముడి పదార్థాలు వచ్చే అనేక ప్రాణాధారమైన ఉత్పత్తులు ఉన్నందున, ఈ నిషేధం నుండి ఔషధ రంగాన్ని మినహాయించాలని కోరింది. రోగుల జీవితాలను రక్షించడానికి ఔషధ , ఆరోగ్య సంబంధిత వాణిజ్యాన్ని నిషేధం నుండి మినహాయించాలని PPMA ప్రతినిధి బృందం స్పెషల్ ఇన్వెస్ట్మెంట్ ఫెసిలిటేషన్ కౌన్సిల్ ని కూడా అభ్యర్థించింది. మొత్తమ్మీద, భారత్-పాక్ మధ్య నెలకొన్న వాణిజ్య ప్రతిష్టంభన పాకిస్తాన్ ఔషధ రంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రత్యామ్నాయాల కోసం ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, తక్షణ చర్యలు తీసుకోకపోతే దేశంలో ప్రాణాధార మందుల కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సంక్షోభం పాకిస్తాన్ ఆరోగ్య వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి...

# భారత కార్బన్ మార్కెట్ ప్రారంభం..

## కీలకంగా కార్బన్ క్రెడిట్ సర్టిఫికేట్లు



(లోకల్ గైడ్):భారత్‌తోపాటు ప్రపంచం అంతటా వాతావరణ కాలుష్యం ప్రధాన సమస్యగా మారుతోంది. ఇందుకు కార్బన్ ఉద్గారాలు కీలకంగా ఉన్నాయి. వివిధ ఉత్పత్తుల తయారీలో భాగంగా వీటిని విడుదల చేస్తున్న కంపెనీలపై కాలుష్య నియంత్రణ ప్రభావం పడుతుంది. ముఖ్యంగా అల్యూమినియం, సిమెంట్, క్లోర్-ఆల్కలీ, పేపర్ ఇండస్ట్రీల్లో 282 యూనిట్లకు నిర్దిష్ట ఉద్గార తీవ్రత లక్ష్యాలను నోటిఫై చేయడం ద్వారా గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాల సమస్యను కొంతవరకు కట్టడి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కర్బన ఉద్గారాలను నియంత్రించడం, పరిశ్రమల్లో స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా కార్యాచరణను తయారుచేసింది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ మార్గదర్శకాల ప్రకారం పవర్ ఎక్స్ఛేంజీల్లో కార్బన్ క్రెడిట్ సర్టిఫికేట్లు ట్రేడ్ కావడంతో భారతదేశం ఇటీవల తన కార్బన్ మార్కెట్‌ను ప్రారంభించింది.

కాంప్లయన్స్ కార్బన్ మార్కెట్

పరిశ్రమలు ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాల మేరకే ఉత్పత్తులను తయారు చేయాల్సి ఉంటుంది. బాధ్యతాయుతమైన సంస్థలు (ఆబ్లిగేటెడ్ ఎంటిటీస్-ఓఈ) ఉద్గార పరిమితులను చేరుకోవాలి. ఈ పరిమితుల కంటే అధికంగా ఉద్గారాలు ఉంటే చర్యలు తప్పవు. టన్ను కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించినా లేదా నివారించినా కార్బన్ క్రెడిట్ సర్టిఫికేట్లను జారీ చేస్తారు. ఈ ధ్రువీకరణ పత్రాలను రెగ్యులేటర్లకు సమర్పించాల్సి ఉంటుంది. వీటిని పాటించనందుకు జరిమానాలు సైతం విధించేలా నిబంధనలు సిద్ధం చేశారు.

కార్బన్ క్రెడిట్ సర్టిఫికేట్లు అంటే..

ఒక టన్ను కార్బన్ డయాక్సైడ్ లేదా గ్రీన్ హౌస్ వాయువులు నివారిస్తే కంపెనీల?కు ప్రత్యేకంగా ఇచ్చే సర్టిఫికేట్లు. కంపెనీలు కర్బన ఉద్గారాలను తగ్గించడానికి, ఆ దిశగా సంస్థలను ప్రోత్సహించడానికి వీటిని రూపొందించారు. ఒక ప్రాజెక్ట్ విజయవంతంగా %+ఎ+% ఉద్గారాలను తగ్గించినప్పుడు నియంత్రణ సంస్థలు లేదా స్వతంత్ర సంస్థల ద్వారా కార్బన్ క్రెడిట్ సర్టిఫికేట్‌లు జారీ చేస్తారు. ఉదాహరణకు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు లేదా అడవుల పెంపకం కార్యక్రమాలతో ఈ క్రెడిట్లను సంపాదించవచ్చు. ఉద్గారాల పరిమితిని దాటిన కంపెనీలు మిగులు క్రెడిట్లు ఉన్న సంస్థల నుంచి ఈ సర్టిఫికేట్లను కొనుగోలు చేయవచ్చు. ఇది ఉద్గారాల తగ్గింపునకు మార్కెట్ ఆధారిత విధానాన్ని సృష్టిస్తుంది. సంస్థలు ఉద్గారాలను తగ్గించడం లేదా కార్బన్ క్రెడిట్లను కొనుగోలు చేయడం ద్వారా లక్ష్యాలను చేరుకోవాలి. దీన్ని పాటించడంలో విఫలమైతే జరిమానాలు తప్పవు. కార్పొరేట్ సామాజిక బాధ్యత లేదా నైతిక పద్ధతుల్లో భాగంగా కంపెనీలు తమ ఉద్గారాలను భర్తీ చేయడానికి స్వచ్ఛందంగా కార్బన్ క్రెడిట్లను కొనుగోలు చేయవచ్చు.

ప్రయోజనాలుజి

ఇది క్రెడిట్ సర్టిఫికేట్లు కలిగి ఉన్న కంపెనీలకు సుస్థిర ప్రాజెక్టుల్లో పెట్టుబడులు వచ్చేలా ప్రోత్సహిస్తుంది. ఉద్గారాల తగ్గింపునకు సంస్థలకు ఆర్థిక వెసులుబాటు అందిస్తుంది. వాతావరణ కాలుష్య కట్టడికి ఇతర కంపెనీలకు తోడ్పడుతుంది.

# లెబనాన్‌పై ఇజ్రాయిల్ బాంబుల వర్షం .. ఒకరు మృతి



(లోకల్ గైడ్): ఇజ్రాయిల్ దళాలు మరోసారి లెబనాన్‌పై విరుచుకు పడ్డాయి. ఆదివారం బీరుట్ దక్షిణశివారు ప్రాంతాలపై ఇజ్రాయిల్ జెట్‌లు బాంబుల వర్షం కురిపించాయి. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతంపై ఇజ్రాయిల్ చేసిన మూడవ దాడి ఇది. ఆదివారం తెల్లవారుజామున దక్షిణ లెబనీస్ గ్రామమైన హల్టాలో జరిగిన డ్రోన్ దాడిలో ఒక వ్యక్తి మరణించినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. అయితే హిజ్బుల్లా సభ్యుడు లక్ష్యంగా దాడులు జరిపామని, అతను మరణించాడని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. దాడి అనంతరం ఆ ప్రాంతమంతటా భారీ ఎత్తున పొగ కమ్ముకుంది. రెండు భవనాల మధ్య ఉన్న లోహపు గుడారం వంటి నిర్మాణంపై మూడు బాంబులు పడినట్లు స్థానిక మీడియా జర్నలిస్ట్ వెల్లడించారు. పూర్తిగా దగ్ధమైన రెండు ట్రక్కుల ఫోటోలు సోషల్‌మీడియాలో కనిపిస్తున్నాయి. ప్రాణనష్టంపై నివేదికలు విడుదల కావాల్సి వుంది. ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లాకి చెందిన జిపిఎస్‌తో కూడిన క్షిపణుల నిల్వలపై దాడులు చేసినసట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. అటువంటి పరికరాలను నిల్వ చేయడం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. దాడికి గంట ముందు ఇజ్రాయిల్ హెచ్చరికను జారీ చేసింది. హదత్ ప్రాంతంలోని హిజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. నివాసితులు ఆప్రాంతం నుండి దాదాపు 300 మీటర్ల దూరం తరలి వెళ్లాలని హెచ్చరించింది. బీరుట్‌పై దాడికి ముందు అల్-జామస్ పరిసరాల సమీపంలోని కొన్ని ప్రాంతాల్లో యుద్ధవిమానాల సైరన్‌లు వినిపించాయని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. స్థానికులను హెచ్చరించేందుకు గాల్లోకి కాల్పులు కూడా జరిగాయని అన్నారు. పలు కుటుంబాలు ప్రాణ భయంతో పరుగులు తీశారని అన్నారు. ఇజ్రాయిల్ దాడిని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ ఖండించారు. కాల్పుల విరమణకు హామీ ఇచ్చిన అమెరికా, ఫ్రాన్స్‌లు ఈ దాడికి సమాధానమివ్వాలని అన్నారు. దాడులను నిలిపివేయాల్సిందిగా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్ నిరంతర దాడులు స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయని, ఈ ప్రాంతం మరిన్ని దాడులకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. సాధారణ పరిస్థితులు నెలకొనాలని కోరుకునేవారిలో ఈ దాడి భయాందోళనలు సృష్టించిందని యుఎన్ సమన్వయకర్త జీనిన్ హెన్నిస్ ఎక్స్‌లో పేర్కొన్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని, యుద్ధాన్ని ముగించిన యుఎన్ తీర్మానం అమలును మరింత దెబ్బతీసే చర్యలను వెంటనే నిలిపివేయాలని ఆమె కోరారు. అమెరికా మధ్యవర్తిత్వంతో గతేడాది నవంబర్‌లో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలపై ఆదివారం జరిగిన దాడి మూడవదని లెబనాన్ ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దాడి మార్చి 28న జరగగా, రెండవ దాడి ఏప్రిల్ 1న జరిగింది. ఏప్రిల్ 1న జరిగిన అప్రకటిత దాడిలో హిజ్బుల్లా అధికారి సహా నలుగురు మరణించినట్లు తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత నుండి ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 190 మంది మరణించారని, 485 మంది గాయపడ్డారని లెబనాన్ ప్రభుత్వం తెలిపింది. ఇజ్రాయిల్ హిజ్బుల్లా అధికారులను, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు పేర్కొంది.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని వెంటాడుతాం: కెటిఆర్



(లోకల్ గైడ్):హైదరాబాద్: తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ పార్టీ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. వరంగల్ సభకు లక్షలాదిగా వచ్చిన ప్రజలకు చెప్పిన సందేశం ఇదేనని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. దేశ రాజకీయ చరిత్రలో అతి పెద్ద సభల్లో ఒకటిగా నిలిచిపోతుందని ప్రశంసించారు. వరంగల్ బిఆర్ఎస్ సభ అనేది రజతోత్సవ కార్యక్రమాలకు ప్రారంభం మాత్రమేనని, ఇకపై తానే ముందుండి పోరాడుతానని కెసిఆర్ ప్రకటించారని, భవిష్యత్తులో మరిన్ని ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని బిఆర్ఎస్ శ్రేణులకు కెటిఆర్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇప్పటికే తగిన సమయం ఇచ్చామని, ఇకపై ప్రతి అంశంలో ప్రభుత్వాన్ని వెంటాడుతామని కెటిఆర్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆరాచకాలను మరింతగా ఎండగడతామన్నారు.

## ఆ విషయంలో కెసిఆర్ విలన్ గా మిగిలిపోతారు



(లోకల్ గైడ్):హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రజాధనం దోచుకుంది కెసిఆర్ కుటుంబం విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టులు, భూముల పేరిట దోచుకుని రాష్ట్రాలని అప్పుల పాలుజేశారని దుయ్యబట్టారు. సోమవారం టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ మీడియాతో మాట్లాడారు. దూరదృష్టి, ఆలోచన లేకుండా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసి కొంపముంచారని, పలాయనం చిత్తగించిన వ్యక్తి కాంగ్రెస్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణకు విలన్‌గా కెసిఆర్ మిగిలిపోతారని, కాంగ్రెస్‌ను విలన్ అంటున్నారని, యువతరం కెసిఆర్‌ను క్షమించదని మండిపడ్డారు. సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబం గురించి ఆరోపణలు చేయడం సరికాదని మహేష్ కుమార్ హితవు పలికారు. దొంగ పాస్‌పోర్టులు సృష్టించి విదేశాలకు పంపిన చరిత్ర కెసిఆర్‌ది కాదా? అని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ వల్లే తెలంగాణ వచ్చాక కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, తెలంగాణ సాకారం చేసినందుకు కాంగ్రెస్ విలన్‌గా నిలుస్తుందా? అని ప్రశ్నించారు. తెలంగాణను అన్ని రకాలు కెసిఆర్ నాశనం చేశారని, టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చి పార్టీ పేరులో తెలంగాణ పదమే తొలగించారని మహేష్ కుమార్ దుయ్యబట్టారు. రెండు పడక గదుల ఇళ్లు ఘరానా మోసం అని ప్రజలకు తెలుసునని, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.4.5 లక్షల మందికి ఇస్తున్నామన్నారు.

## అలర్ట్.. తెలంగాణలో మూడ్రోజుల పాటు వర్షాలు



(లోకల్ గైడ్):హైదరాబాద్: తెలంగాణలో మూడ్రోజుల పాటు వర్షాలు కురవనున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అలర్ట్ జారీ చేసింది. ఇవాళ్టి నుంచి మూడ్రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని వెల్లడించింది. ఇవాళ పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, పలు చోట్ల ఈదరుగాలులు వర్షం పడే ఛాన్స్ ఉందని అంచనా వేసింది. ఇక, రేపు, ఎల్లుండి కూడా పలు జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వాన కురిసే అవకాశం ఉందని చెప్పింది. హైదరాబాద్ నగరంలోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలతో కూడిన వర్షం పడనున్నట్లు తెలిపింది. కాగా, ఇప్పటికే కురుస్తున్న అకాల వర్షాలతో పంటలు దెబ్బ తినడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోతుండటంతో నష్టపోతున్నామని.. తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఏడాదిన్నర.. పథకాల ప్లానింగ్‌కే సరిపోయింది: సిఎం రేవంత్



(లోకల్ గైడ్):హైదరాబాద్: కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డితో సిఎం రేవంత్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రేవంత్ చెప్పింది చేస్తాడు.. అనే నమ్మకం ప్రజల్లో కలిగేలా పనిచేస్తా. ఏడాదిన్నర పథకాల ప్లానింగ్‌కే సరిపోయింది. ఇకపై పథకాల గ్రౌండింగ్‌పై ఫోకస్ పెడతా. కేసీఆర్ మాదిరి.. లాంచింగ్.. క్లోజింగ్ పథకాలు నేను చేయను. ఓ పథకం ప్రారంభిస్తే.. అర్హులకు అందే వరకు పనిచేస్తా" అని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరుపై సిఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల్లో తిరగమని చెబితే.. హైదరాబాద్‌లో తిరుగుతున్నారని గరమయ్యారు. ఎమ్మెల్యే అయ్యాక మనోడు.. మందోడు అని ఉండదని అన్నారు. సీఎల్పీ సమావేశంలో అందర్నీ అప్రమత్తం చేస్తున్నామని.. ప్రభుత్వ పథకాలను ఎమ్మెల్యేలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు.

## మళ్లీ పర్యాటకులతో సందడిగా పహల్‌గామ్

(లోకల్ గైడ్):న్యూఢిల్లీ,: జమ్ముకశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఈ నెల 22వ తేదీన ఉగ్రవాదులు పర్యాటకుల



ప్రాణాలు బలిగొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది మృత్యువాతపడ్డారు. ఈ ఘటనతో భారత్, పాకిస్థాన్‌ల నడుమ ఉద్రిక్తమైన వాతావరణం నెలకొంది. అయితే ఈ దుర్ఘటన జరిగి వారం రోజులు గడవక ముందే మళ్లీ పర్యాటకులతో పహల్‌గామ్ సందడిగా మారింది. దేశ విదేశాల నుంచి పర్యాటకులు పహల్‌గామ్‌లోని ప్రకృతి అందాలను తిలకించేందుకు వస్తున్నారు. ఫోటోలు, వీడియోలు దిగుతూ.. అక్కడ ఎంజాయ్ చేస్తున్నారు. స్థానికులు కూడా దేశవిదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు మంది ఆతిథ్యం ఇస్తున్నారు. దీంతో పహల్‌గామ్‌కు పునర్వైభవం వచ్చిందని స్థానికులు చెబుతున్నారు.

# కశ్మీర్‌కు పర్యాటక కళ

## శని, ఆదివారాల్లో పెరిగిన రద్దీ సురక్షితమేనంటున్న పర్యాటకులు

(లోకల్ గైడ్):కశ్మీర్ నెత్తుటి మరకలను తుడుచుకుంది. పాశవిక దాడి తాలూకు చేదు అనుభవం నుంచి చూస్తుండగానే తేరుకుంది. పర్యాటకులను ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటోంది. దాడి నేపథ్యంలో భయాందోళనలతో లోయను వీడిన టూరిస్టులు ఇప్పుడు అక్కడికి తిరిగి వెళ్తున్నారు. ఉగ్ర దాడుల ఆందోళనలు పూర్తిగా తొలగకపోయినా దేశమంతా ఏకమై ఉందని చెప్పడానికి కశ్మీర్‌ను సందర్శిస్తున్నారు. శని, ఆదివారాల్లో కోల్‌కతా, బెంగళూరు సహా దేశంలోని పలు ప్రాంతాల నుంచి ప్రయాణికులు కశ్మీర్ చేరుకున్నారు. "కశ్మీర్ ఇప్పుడు సురక్షితంగా ఉంది, షాపులు, సందర్శన స్థలాలు అన్నీ తెరిచే ఉన్నాయి" అని వారు స్వయంగా చెబుతున్నారు. "లోయ మళ్లీ పర్యటాకులతో కళకళలాడుతోంది. కశ్మీర్ పర్యటనకు రండి' అని స్థానిక టూర్ ఆపరేటర్లతో పాటు ప్రభుత్వం కూడా పిలుపునిస్తోంది. ప్రఖ్యాత దాల్ సరస్సు ఆదివారం ఉదయం మళ్లీ సందడిగా మారింది. పర్యాటకులు షికారాల్లో విహారాన్ని, స్థానిక ఆతిథ్యాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్నారు. కశ్మీరీల ఆతిథ్యం గొప్పగా ఉందంటూ కొనియాడుతున్నారు. ఉగ్ర దాడితో పర్యాటకం దెబ్బతినకుండా చూసుకుందామంటూ పిలుపునిస్తున్నారు.

### 'ఛలో కశ్మీర్' నటుడు అతుల్ కులకర్ణి

కశ్మీర్‌లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు బాలీవుడ్ నటుడు అతుల్ కులకర్ణి ముందుకొచ్చారు. 'చలో కశ్మీర్' అంటూ ఆయన ఆదివారం ఉదయం పహల్గాం చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో పర్యాటకులు కశ్మీర్‌ను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. "కశ్మీర్ పర్యటన ప్రణాళికలను రద్దు చేసుకుంటే ఉగ్రవాదులు అనుకున్నది నెరవేరుతుంది. అది జరగకూడదు. పర్యాటకులు కశ్మీర్‌కు రావాలి" అని ఎక్స్‌లో పిలుపునిచ్చారు. 'చలో కశ్మీర్', 'టెర్రరిజాన్ని ఓడించండి', 'ఫీట్స్ ఇన్ కశ్మీర్' అంటూ హ్యాష్‌టాగ్‌లు జోడించారు. ఉగ్రవాదాన్ని ఓడించాలనే సందేశంతో కశ్మీర్లో రెండు రోజుల పాటు పర్యటిస్తానని కులకర్ణి చెప్పారు. ఇలాంటి కార్యకలాపాలు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడమే కాకుండా దేశవ్యాప్తంగా ప్రజలు పరస్పరం అర్థం చేసుకోవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. కశ్మీరీ జీవన విధానాన్ని అర్థం చేసుకోవడానికి ఆసక్తిగా ఉన్న తమిళనాడుకు



చెందిన పర్యాటకుల బృందాన్ని పహల్గాంలో చూశానని, ఇలాంటి సంభాషణలు ప్రజల సన్నిహిత బంధాలను పెంపొందించడానికి, ఐక్యత, కరుణ సందేశాన్ని పంపడానికి కూడా సహాయపడతాయని ఆయన అన్నారు. పహల్గాంలోని బైసారన్ లోయలో మంగళవారం ఉగ్ర దాడి జరిగిన వెంటనే కశ్మీర్‌లోని హోటళ్లు, హౌస్ బోట్ల టూరిస్ట్ బుకింగ్స్‌లో 80 శాతం వరకు రద్దవడం తెలిసిందే. వేలాది మంది పర్యాటకులు కశ్మీర్‌లో పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని ప్రత్యేక విమానాలు, రైళ్లలో స్వస్థలాలకు చేరుకున్నారు.

### ఉగ్ర లక్ష్యం నెరవేర నీయొద్దు

"దుర్గా పూజ తర్వాత కశ్మీర్ పర్యటనకు బుకింగ్స్ చేసుకున్నాం. దాడితో షాకయ్యాం. కానీ స్థానికులతో మాట్లాడాక వెళ్లొచ్చని నిర్ధారించుకున్నాం. ఈ ఉద్రిక్త పరిస్థితుల్లో కశ్మీర్‌ను కచ్చితంగా పర్యటించాలనే వచ్చాం. భయపడి ఆగిపోతే ఉగ్రవాదుల లక్ష్యాన్ని నెరవేర్చిన వాళ్లమవుతాం అనిపించింది. అందుకే వచ్చాం' అని కోల్‌కతా నుంచి వచ్చిన ఓ యువతి తెలిపారు. "ఇప్పుడు కశ్మీర్ సురక్షితంగా ఉంది. గుల్మార్గ్, సోన్‌మార్గ్, తరువాత పహల్గాం కూడా వెళ్లాలనుకుంటున్నాం. కశ్మీర్ భారత్‌లో భాగం. మనం కశ్మీర్ సందర్శించడం స్థానికులకు సాయం చేసినట్టవుతుంది. అవసరముంది" అఈ విషాద సమయాల్లో మనమంతా ఒక్కటని చాటాల్సినని మరో యువకుడు నొక్కి చెప్పారు. "మేం దాడి తర్వాతే వచ్చాం. ఇప్పుడిక్కడ అంతా సాధారణంగానే ఉంది. చల్లటి వాతావరణాన్ని ఎంజాయ్ చేశాం' అని బెంగళూరుకు చెందిన దంపతులు చెప్పారు.

# మలబారు యాత్ర

(లోకల్ గైడ్):వైకోం మహమ్మద్ బషీర్ తమ ఇంటిముందున్న వంగమామిడి చెట్టుకింద కూర్చుని రాసేవారట. ఆ చెట్టు గాలిని పీల్చే 'మా తాతకో ఏనుగుండేది', 'చిన్ననాటి నేస్తం', 'గోడలు' లాంటి ఆయన రచనలు ఊపిరి పోసుకున్నాయి. బషీర్ అభిమానులకు ఆ చెట్టును చూడటం గొప్ప సంతోషం. అంతేనా? ఆయన విన్న గ్రామ్‌ఫోన్ రికార్డు, ఆయన సేదతీరిన ఆరాం కుర్చీ కూడా ప్రత్యేకమే. బషీర్‌ను ఆయన జన్మించిన బేపూర్‌ను బట్టి బేపూర్ సుల్తాన్ అంటారు. ఆయన వస్తువులు, ఆయన జీవితాన్ని తెలియజెప్పే విశేషాలతో ఆ ఊళ్లో కేరళ ప్రభుత్వం ఒక మెమోరియల్ నిర్మిస్తోంది. బషీర్ క్లాసిక్ అయిన 'ప్రేమలేఖనం' నవలలో దంపతులు తమ చిన్నారికి పెట్టుకున్న ఆకాశమిఠాయి పేరునే ఈ స్మారక కేంద్రానికి ఉంచారు. ఒక రచయితకు మెమోరియల్ నిర్మించడం దానికదే విశేషమే అయినా, నిత్య సాహిత్య రాష్ట్రమైన కేరళ తన సాహిత్య స్పృహను మరో స్థాయికి తీసుకెళ్లింది. రచయితల మెమోరియల్స్‌ను కలుపుతూ దేశంలోనే తొట్టతొలి సాహిత్య యాత్రకు శ్రీకారం చుడుతోంది. 'మలబార్ లిటెరరీ టూరిజం సర్క్యూట్' పేరుతో ఈ యాత్ర కోళికోడ్, మలప్పురం, పాలక్కాడ్ జిల్లాలను కవర్ చేస్తుంది. మలయాళ సాహిత్యంలో ప్రాచీన కవిత్రయంలో ఒకరిగా పిలిచే, ఆధునిక మలయాళ సాహిత్య పితామహుడిగానూ కొలిచే 16వ శతాబ్దపు కవి, భాషావేత్త తుంచాత్తు రామానుజన్ ఎలుత్తాచ్చన్ గ్రామమైన తుంజన్ పరంబు మలబారు ప్రాంతంలోనే ఉంది. విజయదశమి రోజున చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల అక్షరాభ్యాసం కోసం ఈ గ్రామాన్ని దర్శించుకుంటారు. ఈ మలబారు ప్రాంతంలోనే జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఎం.టి.వాసుదేవన్ నాయర్‌బీ రచయిత, కార్టూనిస్ట్ ఒ.వి.విజయన్‌బీ ప్రఖ్యాత యాత్రాసాహిత్య కర్త ఎస్.కె.పొట్టెక్కాట్‌బీ మరో కవి, జ్ఞానపీఠ గ్రహీత అఖితం అచ్యుతన్ నంబూద్రి లాంటివారి స్మారక కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఇవి భిన్న దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. వాటన్నింటినీ అభిమానులు కలయదిరిగేలా, రచయితల పుస్తకంలో ప్రాణం పోసుకున్న ప్రాంతాలను ప్రత్యక్షంగా అనుభవించేలా, మానవ ఉద్వేగాలన్నీ కాగితాల్లోకి ఎలా బదిలీ అయ్యాయో తెలుసుకునేలా కేరళ పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. 2021లోనే ఈ ప్రాజెక్టుకు బడ్జెట్ కేటాయింపులు జరపగా, ఈ సంవత్సరం మధ్యకల్లా దీన్ని ప్రారంభించే అవకాశం ఉంది. కోళికోడ్‌ను యునెస్కో భారతదేశ తొట్టతొలి సాహిత్య నగరంగా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ వల్ల ఆ నగర ఘనత మరింతగా ఇనుమడిస్తుంది. లండన్‌లోని షేక్స్పియర్ స్మారక కేంద్రాన్ని ఏటా పాతిక లక్షల మంది సందర్శిస్తారు. యూకేలో భిన్న లిటెరరీ సర్క్యూట్స్, వాటికి తగిన ఏర్పాట్లు ఉన్నాయి. దక్షిణ అమెరికాలోని కొలంబియాలో మ్యూజియంగా మార్చిన గాబ్రియేల్ గార్సియా మార్క్వెజ్ ఇల్లు, ఆయన చదివిన పాఠశాల, ఆయన వెళ్లిన గ్రంథాలయం... ఇలా ఆయన 'వన్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్'కు ప్రేరణగా నిలిచిన అన్ని ప్రదేశాలను కలుపుతూ ప్రయాణించవచ్చు. ప్రముఖ మలయాళ సాహిత్యకారులకు కూడా జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు ఉంది. వీళ్ల రచనలు భిన్న భారతీయ



భాషలతో పాటు, ఆంగ్లం, ఇతర ప్రపంచ భాషల్లోకి అనువాదమయ్యాయి. దానికి తగ్గ ఉత్సాహం, ప్రోత్సాహం అక్కడ ఉన్నాయి. అందుకే సందర్శకులు భిన్న ప్రాంతాల నుంచి వచ్చే అవకాశం ఉంది. మరి తెలుగు రచయితల పరిస్థితి ఏమిటి? ముందు తెలుగు రచయితలను తెలుగువాళ్లకు పరిచయం చేయడమే పెద్ద సవాలు కావొచ్చు. వైజాగ్ వైపు వెళ్లే కొందరు సాహిత్యాభిమానులు ప్రత్యేకించి భీమిలి వెళ్లొస్తారు చలం ఇంటి కోసం. విజయనగరం వైపు పోయేవాళ్లు గురజాడ గృహాన్ని దర్శించవచ్చు. అదే విశాఖపట్నానితో ముడిపడిన శ్రీశ్రీ, రావిశాస్త్రిలను ముడేస్తూ, అటుగా శ్రీకాకుళంలోని కథానిలయంతో కరచాలనం చేసేలా ఉత్తరాంధ్ర సాహితీయానం చేయగలిగితే ఎలా ఉంటుంది? పోతన, దాశరథి, కాళోజీ లాంటి వాళ్లను తలుచుకోగలిగే వరంగల్ సాహిత్య టూర్ ఎందుకు ఉండకూడదు? రచయితలను ప్రాంతాల వారీగానో, జిల్లాల వారీగానో అనుసంధానం చేసే సాహిత్య టూర్లను ఆశించడం తెలుగు నేల మీద మరీ అత్యాశా? కానీ ఎంతమంది రచయితలకు మెమోరియల్స్ ఉన్నాయి? కనీసం విగ్రహాలైనా ఉన్నాయా? కువెంపు విమానాశ్రయం (శివమొగ్గ) అని కన్నడవాళ్లు పెట్టుకున్నట్టుగా తెలుగు నేల మీద అలా ఒక రచయితకు గౌరవం దక్కుతుందా? ప్రాచీన ప్రపంచంలో ఈజిప్టులోని అలెగ్జాండ్రియా లైబ్రరీ ఒక జ్ఞానధామం. క్రీ.పూ. మూడో శతాబ్దానికి చెందిన ఇది ఆ కాలపు గొప్ప పండితులందరికీ నిత్య సందర్శనా స్థలం. అమెజాన్ కంపెనీ తన వర్చువల్ అసిస్టెంట్‌ను ప్రారంభించినప్పుడు దాని పేరును అలెగ్జాండ్రియాకు నివాళిగా ఎన్నుకుంది. అట్లా 'అలెక్సా' చాలామంది జీవితాలకు చేరువైంది. సాహిత్యంతో పరిచయం లేదనుకునేవాళ్లు కూడా దాని ఫలాలను ఇంకో రూపంలో అనుభవిస్తూనే ఉంటారు. 'పోషణ, ఆవాసం, సాహచర్యం తర్వాత ఈ ప్రపంచంలో మనకు అత్యంతగా కావాల్సింది కథలు' అంటాడు ఫిలిప్ పుల్‌మాన్. 'రచయితలో కన్నీళ్లు లేకపోతే పాఠకుడిలో కన్నీళ్లు లేవు. రచయితలో ఆశ్చర్యం లేకపోతే పాఠకుడిలో ఆశ్చర్యం లేదు' అంటాడు రాబర్ట్ ఫ్రాస్ట్. రచయితలో ఉన్నదే పాఠకుడికి అందుతుంది. రచయితలో ఉన్నదంతా కూడా పాఠకుడికి బదిలీ అవుతుంది. సాహిత్యం అనేది మన అంతరాత్మలను వెలిగించే అదృశ్య దివ్వె. అందుకే సాహిత్య సృష్టికర్తలను తలుచుకునే ఏ ప్రయత్నం అయినా ప్రాధాన్యత కలిగినదే, దానికోసం తీసుకునే ఏ చొరవైనా విలువైనదే!

# పంచాయతీల బలోపేతానికి చర్యలేవి?




(లోకల్ గైడ్):చారిత్రకంగా భారతదేశంలో మొట్టమొదట చోళుల పరిపాలన వ్యవస్థ 'స్వయం పరిపాలన'కు నాంది పలికింది. స్వాతంత్ర్య అనంతరం మన దేశంలో పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా స్థానిక స్వపరిపాలన కోసం మూడంచెల 'పంచాయతీరాజ్ వ్యవస్థ'ను ఏర్పాటు చేయడం జరిగినది. ఇది కిందిస్థాయి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ముఖ్యమైన మైలురాయిగా చారిత్రక ప్రాముఖ్యతను సంతరించుకుంది. అదే విధంగా స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష వేదికగా నిలిచింది. భారత దేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే.. గ్రామీణ ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధిని ఆకాంక్షిస్తూ భారత ప్రభుత్వం మొట్టమొదటిసారిగా 1952లో సామాజిక అభివృద్ధి కార్యక్రమాన్ని(సిడిపి) ప్రారంభించింది. తదుపరి జాతీయ విస్తరణ సేవ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ప్రజల క్రియాశీలక భాగస్వామ్యం లేకపోవడంతో సామాజిక అభివృద్ధి కార్యక్రమం, జాతీయ విస్తరణ సేవాపథకం క్షేత్రస్థాయిలో అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయాయి. వీటి అమలు విధానాన్ని అధ్యయనం చేసి వాటిని మరింత పటిష్టం చేయడానికి అవసరమైన సూచనల కోసం భారత ప్రభుత్వం 1957లో బల్వంతరాయ్ మెహతా కమిటీని నియమించింది. ఈ కమిటీ సూచించిన ప్రజాస్వామిక వికేంద్రీకరణ విధానమే నేటి మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థకు దారితీసింది. తదుపరి అనేక కమిటీల సిఫార్సుల మేరకు బలమైన మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. దేశంలో పంచాయతీరాజ్ సంస్థలను ఏర్పాటు చేసిన మొదటి రాష్ట్రం రాజస్థాన్ కాగా, రెండవది ఆంధ్రప్రదేశ్. ప్రజాస్వామ్య వికేంద్రీకరణలో స్థానిక సంస్థల పరిపుష్టం చేయడానికి 73 రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించారు. దీనిని 1993, ఏప్రిల్ 24 నుంచి అమలు చేయడం జరిగింది. భారత ప్రభుత్వం అధికారికంగా 2010 నుండి ప్రతి ఏటా ఈ రోజు 'జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం' గా నిర్వహించడం జరుగుతుంది. ఈ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగం 9వ భాగంలో పంచాయతీల పేరుతో ఒక కొత్త అధ్యయనం చేర్చి అధికరణ 243ఎ నుండి 243ఒ వరకు నిబంధనలు పొందుపరిచారు. అదే విధంగా రాజ్యాంగంలో 11 షెడ్యూల్ అదనంగా చేర్చి, పంచాయతీరాజ్ సంస్థలు నిర్వర్తించాల్సిన 29 విధులను కూడా పొందుపరచారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో40వ అధికరణం ఆచరణీయ కార్యక్రమానికి నిదర్శనంగా పంచాయితీ రాజ్ వ్యవస్థను పేర్కొనవచ్చు. 73వ రాజ్యాంగ సవరణ పంచాయతీ వ్యవస్థకు రాజ్యాంగపరమైన హోదా కల్పించడం జరిగింది. దీనిని మొదట అమలుపరిచిన రాష్ట్రం మధ్యప్రదేశ్. గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో మండల పంచాయతీ, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ వ్యవస్థ ఏర్పాటు చేయబడినది. వీటి సభ్యులందరూ ప్రజలచేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడతారు. పంచాయతీరాజ్ వ్యవస్థ మౌలిక విభాగం గ్రామం. గ్రామస్థాయిలో గ్రామసభలు రాష్ట్ర శాసనసభ నిర్దేశించిన విధంగా నిర్వహించబడతాయి. గ్రామసభలు గ్రామాభివృద్ధి ప్రణాళికను రూపొందించి ఆమోదిస్తాయి. గ్రామపంచాయతీ పౌరసరఫరాల కల్పన, మంచినీటి సరఫరా, పరిశుభ్రత, వీధిదీపాల నిర్వహణ, రోడ్లు, జననమరణాలు నమోదు, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడం లాంటి అనేక అంశాలను నిర్వహించడం జరుగుతుంది. పంచాయతీ వ్యవస్థ ప్రజల వద్దకు పాలన తీసుకువెళ్లి ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కీలక భూమిక పోషించినా, క్షేత్ర స్థాయిలో అనేక వైఫల్యాలను చవిచూడడం జరుగుతున్నది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామసభలే నిర్వహించాలి. కానీ ఆచరణలో జరగడం లేదు. ఆర్థిక వనరుల కొరత స్థానిక సంస్థల స్ఫూర్తిని నీరుగారుస్తున్నాయి. మహిళలకు బలహీనవర్గాల వారికి చట్టపరంగా సముచిత ప్రాధాన్యత కల్పించినప్పటికీ ఆచరణలో ఆశించినమేరకు తమ ఉనికిని చాటుకోలేకపోతున్నారు. దీనికిగల కారణం తరతరాలుగా కొనసాగుతున్న సాంప్రదాయాలు, కుల వ్యవస్థ, పురుషాధిపత్యం అని పేర్కొనవచ్చు. పేదరికం, నిరక్షరాస్యత, రాజకీయ చైతన్యం లేకపోవడం వల్ల స్థానిక సంస్థల పనితీరుకు అడ్డంకిగా మారుతున్నాయి. పంచాయతీరాజ్ చట్టాన్ని అమలులో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వడం వలన కూడా రాష్ట్రప్రభుత్వాలు సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం, ఆర్థిక సంఘం సిఫార్సులను కూడా బేఖాతరు జరుగుతుంది. పంచాయతీరాజ్ వ్యవస్థలోనీ లోపాలను సవరించి మరిన్ని అధికారాలు ఇస్తూ తెలంగాణ రాష్ట్రంలోని నూతన పంచాయతీ రాజ్ చట్టం 2018 రూపొందించడం జరిగింది. ఆచరణలో మాత్రం పటిష్టంగా ముందుకుపోవడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో కూడా గత సంవత్సర కాలంనుంచి పంచాయతీ ఎలక్షన్లు జరగడం లేదు. దీంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కూడా రాక పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతున్నది. 11వ షెడ్యూల్లో పొందుపరిచిన అంశాలను పూర్తిగా స్థానిక సంస్థలకు బదిలీ జరగకపోవడం వలన వాటి పనితీరు దెబ్బ తింటున్నది. గ్రామస్థాయిలో ప్రభుత్వం నెలకొల్పిన అనేక సంఘాలు, కమిటీలు సమాంతర వ్యవస్థలుగా మారి పంచాయతీలను బలహీనపరిస్తున్నాయి. ఈ మధ్య పంచాయతీ పాలకవర్గంలో రోజురోజుకు పెరిగిపోతున్న రాజకీయ జోక్యం వలన పాలకవర్గం ప్రభుత్వ ప్రతినిధులకు అనుచరులుగా మారి పంచాయతీల స్వతంత్రను దెబ్బ తీస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల పనితీరును బలోపేతం చేయడానికి కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రిత్వ శాఖ పలు సూచనలు చేయడం జరిగింది. ముఖ్యంగా దేశంలో ప్రతి జిల్లాలో జిల్లా ప్రణాళిక కమిటీ ఏర్పాటు చేసి, పంచాయితీలకు అన్ని అధికారుల బదిలీ చేసి రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక సహాయ నిధులను కేంద్రం మంజూరు చేయాలన్నది. పంచాయతీలకు పలు అంశాలపై పన్నులు విధించే అధికారం కల్పించాలని, ఇ - పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొనడం జరిగింది. అదే విధంగా రెండో పరిపాలనా సంస్కరణల సంఘం కూడా అనేక సూచనలు చేసింది. ఇది స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ స్వయం ప్రతిపత్తి కల్పించడమే కాకుండా, స్థానిక సంస్థలకు జవాబుదారీగా ఉన్నాయి. వీటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు పరచి పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. అప్పుడే గ్రామస్వరాజ్యం సాధ్యమవుతుంది.

# 26 రాఫెల్ విమానాల కోసం భారత్-ఫ్రాన్స్‌ల మధ్య ముగిసిన ఒప్పందం



(లోకల్ గైడ్):న్యూఢిల్లీ : నేవీ కోసం 26 రాఫెల్-ఎం యుద్ధ విమానాలను అందించేందుకు రూ. 63,000 కోట్ల ఒప్పందంపై సోమవారం భారత్-ఫ్రాన్స్‌లు సంతకాలు చేశాయి. ఫ్రాన్స్ నుండి 26 రాఫెల్ ఎం ఫైటర్ జెట్లు (మెరైన్ వేరియంట్స్) కొనుగోలు చేయడానికి భారత్ ఒప్పందంపై సంతకం చేయడంతో ఇరు ప్రభుత్వాల మధ్య రికార్డు స్థాయిలో ఒప్పందం కురినట్లైంది. ఒప్పందం ప్రకారం .. 21 సింగిల్ సీటర్ ఫైటర్ జెట్‌లు, నాలుగు ట్విన్ సీటర్ జెట్ ఫైటర్లను 2031 నాటికి అందించే అవకాశం ఉంది. ఈ ఒప్పందంలో ఫ్లీట్ నిర్వహణ, లాజిస్టికల్ సపోర్ట్, సిబ్బంది శిక్షణ ఇవ్వనుంది. నౌనేన్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, నేవీ వైస్ చీఫ్ వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ మరియు భారతదేశంలోని ఫ్రెంచ్ రాయబారి థోరీ మాథౌ హాజరయ్యారు. ఐజిఏతో పాటు అనుబంధ ప్రభుత్వ వ్యాపార ఒప్పందాలు కూడా ముగిశాయి. ఈ ఒప్పందంపై సంకతం చేయడానికి ఫ్రెంచ్ రక్షణ మంత్రి భారతదేశాన్ని సందర్శించాల్సి వుంది. కానీ వ్యక్తి గత కారణాల రిత్యా అది వాయిదా పడింది. దీంతో రాఫెల్ ఒప్పందంపై ఇరువరు మంత్రులు ఐజిఏపై రిమోట్‌లో సంతకం చేశారు. ప్రస్తుతం రెండు విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రమాదిత్య, 2022 సెప్టెంబర్‌లో వినియోగంలోకి వచ్చిన స్వదేశీయంగా రూపొందించిన ఐఎన్ఎస్ విక్రాంత్‌ల నుండి మిగ్ -29 కె జెట్‌లను భారత నావికాదళం నిర్వహించనుంది.

## మోడీ అఖిలపక్ష సమావేశానికి ఎందుకు హాజరు కాలేదు?



(లోకల్ గైడ్):జైపూర్ : పెహల్గామ్ దాడి తర్వాత కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోడీ హాజరు కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. సోమవారం జైపూర్‌లో జరిగిన సంవిధాన్ ర్యాలీలో ఖర్గే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో ఖర్గే మాట్లాడుతూ.. 'పెహల్గామ్ దాడి తర్వాత జరిగిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోడీ హాజరు కాలేదు. కనీసం దాడి జరిగిన జమ్మూకాశ్మీర్ రాష్ట్రానికి ఆయన వెళ్లలేదు. కానీ రాహుల్‌గాంధీ ఆ రాష్ట్రానికి వెళ్లి.. పెహల్గామ్ ఉగ్రదాడిలో గాయాలపాలైన వారితో మాట్లాడారు. ముందు దేశమే ముఖ్యం. ఇలాంటి సమయంలో అందరూ ఐక్యంగా ఉండాలని నేను వారికి చెప్పదలచుకున్నాను' అని ఆయన అన్నారు. బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం వల్లే ఒక చిన్న టీ అమ్ముకునే వ్యక్తి ప్రధానమంత్రి కాగలిగాడు. దేశంలో ఏ చిన్న సంఘటన జరిగినా.. బిజెపి మాత్రం కాంగ్రెస్‌ని విమర్శిస్తుంది. ఇక బిజెపి నేతలు దేవుని పేరుని ఉచ్ఛరించడం మర్చిపోతారేమో కానీ.. కాంగ్రెస్‌ని అవమానించడం మాత్రం మర్చిపోరు. మీరు కాంగ్రెస్ నేతలపై తప్పుడు కేసులు పెట్టడం ద్వారా ఆ పార్టీని బలహీనపర్చలేరు. లాంటి వాటికి కాంగ్రెస్ భయపడదు అని ఖర్గే వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బిజెపిని టార్గెట్‌గా చేసుకుని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఎరువుల భద్రత, ఎన్‌ఆర్‌ఇజిఎ, విద్య ఇలా మేము అన్నీ ఇచ్చాము. కానీ బిజెపి మాత్రం 56 అంగుళాల ఛాతీగల ప్రజలకు నిరుద్యోగం తప్ప మరేమీ ఇవ్వలేదు. కాంగ్రెస్ చేసిన పనులకు, బిజెపి చేసిన పనులకు చాలా తేడా ఉంది. కాంగ్రెస్ చేసిన పనుల స్థాయికి బిజెపి చేరుకోలేదు. అసలు కాంగ్రెస్‌నే బలంగా ఉంటే.. ప్రభుత్వాన్నే ఏర్పాటు చేసి ఉండేవాళ్లం అని ఖర్గే అన్నారు.

## కెనడా ఎన్నికలు.. ప్రధాని కార్నీ గెలుస్తారా?!




(లోకల్ గైడ్):ఒట్టావా : ఏప్రిల్ 28 కెనడా ఎన్నికలు జరుగుతున్నాయి. ఉదయం నుంచి జరుగుతున్న ఈ ఎన్నికల్లో 7.3 మిలియన్ల మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుని రికార్డు సృష్టించినట్లు మీడియా పేర్కొంది. ఈ ఎన్నికల్లో ప్రధానంగా లిబరల్ పార్టీ, కన్జర్వేటివ్ పార్టీ, జగ్మీత్‌సింగ్ నేతృత్వంలోని న్యూ డెమోక్రటిక్ పార్టీ (ఎన్‌డిపి) పోటీ పడుతున్నాయి. ఈ ఎన్నికల్లో కచ్చితంగా లిబరల్ పార్టీనే గెలుస్తుందని కెనడియన్ పోలింగ్ సంస్థ (ఇకెఓఎస్) రీసెర్చ్ అధ్యక్షుడు, ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఫ్రాంక్ గ్రేవ్స్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా, ఈ ఎన్నికల్లో లిబర్ పార్టీ తరపున ప్రధానిగా మార్క్ కార్నీ పోటీ చేశారు. ఈయన గత ప్రధాని జస్టిన్ ట్రూడ్ రాజీనామా అనంతరం మార్చి 14న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఈ ఏడాది అక్టోబర్‌లో అక్కడ ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కెనడాపై అత్యధిక పన్నులు విధించడంతోపాటు ఆ దేశాన్ని అమెరికాకు 51వ రాష్ట్రంగా మారుస్తానని హెచ్చరించడంతో కార్నీ ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఆయనకు పోటీగా కన్జర్వేటివ్ పార్టీ తరపున పియరీ పోయిలివ్రే పోటీ చేశారు. అయితే లిబరల్ పార్టీ కంటే కన్జర్వేటివ్ పార్టీ ఈ ఎన్నికల్లో వెనుకంజనే ఉందని మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

## థరూర్ ఎఫెక్ట్? కాంగ్రెస్ నేతలకు అధిష్టానం కీలక ఆదేశాలు



(లోకల్ గైడ్):న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేతలకు హైకమాండ్ సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. పహల్గాం దాడులపై పార్టీ లైన్ దాటి మాట్లాడొద్దని స్పష్టం చేసింది. తాజాగా కొందరు కాంగ్రెస్ నేతలు దాడులపై చేసిన వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేకూర్చేవి ఉన్నాయని పెద్దలు భావించారు. ఈ నేపథ్యంలోనే ఈ ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 22వ తేదీ మధ్యాహ్నం 2.30గం. ప్రాంతంలో సైన్యం దుస్తుల్లో వచ్చిన ఐదారుగురు ఉగ్రవాదులు.. పహల్గాం బైసరన్‌లోయ పిక్నిక్ స్పాట్‌లో పర్యాటకుల్ని కాల్చి చంపిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో ఒక స్థానికుడితో సహా 25 మంది టూరిస్టులు కన్నుమూశారు. అయితే ఈ దాడిని పార్టీలకతీతంగా రాజకీయ నేతలు ఖండిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదమే చోటు చేసుకుంది. పహల్గాం దాడి వెనుక నిఘా వర్గాల వైఫల్యం ఉండొచ్చని, ఏ దేశం కూడా వంద శాతం ఇలా దాడులను పసిగట్టకపోవచ్చని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్యలు బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నాయంటూ కాంగ్రెస్ నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ శశిథరూర్‌పై తీవ్రంగా స్పందించారు. థరూర్ కాంగ్రెస్‌లో ఉన్నారా? బీజేపీలో ఉన్నారా? అని ప్రశ్నించారు. 'సూపర్ బీజేపీ మ్యాన్'గా మారేందుకు ప్రయత్నిస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. ఈ పరిణామాలను అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇతర నేతలు ఈ తరహా వ్యాఖ్యలు చేయకుండా ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు.. ఇద్దరు నేతలను మందలించినట్లు కూడా ఇండియా టుడే ఓ కథనం ప్రచురించింది.

# అమ్మ భాష తెలుగు అమృతమయం




(లోకల్ గైడ్):ప్రపంచంలోనే తొలి లిఖిత సాహిత్యం సంస్కృత భాషలో ఉంది. సంస్కృత భాషను అమరవాణి, దేవభాష, సురభాష, గీర్వాణి అని వివిధ పేర్లతో పిలుస్తారు.భారతదేశంలో 2001 లెక్కల ప్రకారం పద్నాలుగు వేల నూటముప్పై మంది సంస్కృతాన్ని మాట్లాడుతున్నారు. ప్రజల వాడుకలోలేని భాషను మృతభాష అంటారు. భారతదేశంలో సంస్కృత భాష సాహిత్యపరంగా నిద్రాణమై ఉంది. ప్రజల వాడుకపరంగా మృతభాషగా ఉంది.భారతీయ సాహిత్యమంతా మా యూరోపియన్ గ్రంథాలయంలోని ఒక అలమారులోని ఒక అరతో సరిపోతుంది అన్నాడు మెకాలే. ఈయన భారతీయ ప్రామాణిక గ్రంథాలైన మనుస్మృతి, యాజ్ఞవల్క స్మృతి, ఆనాటి మత, సాంఘిక, సామాజిక, ఆచార వ్యవహారాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. శాస్త్రీయ విద్యను భారతీయ ప్రజలకు అందించాల్సిన ఆవశ్యకతను గుర్తించి మినిట్ ఆన్ ఎడ్యుకేషన్ కీలక విద్యాపత్రాన్ని 1835లో తయారు చేశాడు. భారతదేశంలో ఆంగ్లేయ విద్యావిధానాన్ని అమలు చేయడంతో ఆంగ్ల విద్యా బోధనకు పునాది, సంస్కృత భాషకు సమాధి కట్టబడింది. వలసపాలనలో పరిపాలనా భాషగా ఆంగ్లం ప్రోత్సహించబడింది. అప్పటివరకు భారతీయ విద్యాబోధనలోనున్న సంస్కృతం, అరబిక్, పర్షియన్ భాషలు కనుమరుగయ్యాయి. సాధారణ ప్రజల వ్యవహారంలో లేకపోవడం, అందరికీ విద్య అందుబాటులో లేకపోవడం, సంస్కృత భాషకు దైవత్వం ఆపాదించడం వంటివి సంస్కృత భాష భారతదేశంలో అంతరించడానికి మరికొన్ని కారణాలు. భారతీయ భాషల పుట్టుకను కాల్డ్వెల్ ఆర్య భాష, ద్రవిడ భాషగా నిర్ణయించాడు. విశాల భారతీయ భాషా కుటుంబం ఆధిపత్య ఆంగ్ల భాషా ప్రభావం చేత ఛిన్నాభిన్నమైంది. తెలంగాణ ప్రాంతంలో చారిత్రకంగా సంస్కృత భాష ప్రాచీన కాలంలో ప్రాకృత భాషను మింగేసింది. నిజాం సంస్థానంలో తెలుగు భాషను ఉర్దూ మింగేసింది. ఆధునిక కాలంలో ఆంగ్లం ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తుంది. ప్రజల నిత్యజీవిత వ్యవహారాలు, విద్యావసరాలు, సాహిత్య సృష్టి, సాంస్కృతిక, చారిత్రక, రాజకీయ, ఆత్మగౌరవ చిహ్నంగా భాష ఉన్నన్ని రోజులు అమృత భాషగా ఉంటుంది. స్వాతంత్ర్యం తరువాత భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో భాషాత్మగౌరవం చూపింది మనమే. తెలుగు భాషకు ప్రాచీన హోదా గుర్తింపునకు తెలంగాణ శాసనాలే ఆధారమయ్యాయి. తెలుగు భాషకు గొప్ప చరిత్ర, సాహిత్య, సాంస్కృతిక వైభవం ఉంది. సంస్కృత భాషకు సమానమైన ప్రాచీన హోదా, రాజ్యాంగ గుర్తింపు ఉంది. ఆధునిక సాంకేతిక ఉపకరణాలన్నీ చక్కగా తెలుగును ధరించాయి. కృత్రిమ మేధ సైతం తెలుగు భాషను చక్కగా అర్థం చేసుకుంటుంది. మారగలిగే స్వభావమున్న భాష ఎప్పటికీ నిలబడగలుగుతుంది. సులువుగా వ్యాప్తి చెందుతుంది. ఆధాన ప్రధానాలతో తెలుగు భాష చక్కగా విస్తరించి, 2011 లెక్కల ప్రకారం దేశంలో అధిక జనాభా మాట్లాడే భాషల్లో హిందీ, బెంగాలీ తరువాత రెండవ స్థానంలో ఉంది. సైద్ధాంతికతకు సంబంధించినది భాష అంటాడు హెగెల్. మానవ జ్ఞానాన్ని, అనుభవాలను తరువాత తరానికి అందించేది విద్య. ఇది భావితరానికి చుక్కాని. జ్ఞాన ప్రసారానికి వాహిని భాష. మాతృభాషలో జ్ఞానప్రసారం జరిగితే సృజనాత్మక శక్తి పెరుగుతుంది. దేశవ్యాప్తంగా పన్నెండవ తరగతి వరకు పాఠశాల విద్యగానే పరిగణిస్తారు. తెలుగు రాష్ట్రాలలో ఇంటర్మీడియట్ విద్యను అందించడానికి ఇంటర్మీడియట్ బోర్డును 1971లో స్థాపించారు. విద్యార్థులకు ప్రథమ భాషగా ఆంగ్లం, ద్వితీయ భాషగా తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, అరబిక్, ఫ్రెంచ్, తమిళం, కన్నడ, ఒరియా, మరాఠి, తృతీయ భాగంగా ఆప్షనల్ సబ్జెకట్స్ ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే తెలంగాణలో తెలుగు ద్వితీయ భాషగా, ఆప్షనల్ భాషగా విద్యార్థులు ఎంపిక చేసుకోవడమేమిటని చాలాకాలంగా విద్యావేత్తలు, మాతృభాషాభిమాన సంస్థలు, వ్యక్తులు ఆందోళనను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయినా విద్యావిధానం, ఉపాధి అవకాశాలు, తల్లిదండ్రుల ఆశలపేరుతో ఇన్నాళ్ళు నెట్టుకొచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు బోధించే అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. సంస్కృత భాషా బోధనకు అధ్యాపకులు లేరు. తాజాగా ఇంటర్మీడియట్ బోర్డు సంస్కృత భాషను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా తీసుకునే విద్యార్థుల సంఖ్య, అవసరమయ్యే సంస్కృత అధ్యాపకుల సంఖ్య కోసం విచారిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. 2000 సంవత్సరం తరువాత రాష్ట్రంలో విద్య వేగంగా ప్రైవేటీకరణకు గురైంది. కార్పొరేట్ విధానంతో తల్లిదండ్రులను ఆకట్టుకోవడంలో సఫలమైంది. ఇంటర్మీడియట్ విద్య మరింత వ్యాపార గుత్తాధిపత్యంతో ఒకరు ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఇప్పుడు ప్రైవేటు కళాశాలల్లో దాదాపుగా ద్వితీయ భాషగా సంస్కృత భాషనే ఉంది. విద్యార్థులు మార్కుల కోసం తెలుగును కాదని సంస్కృత భాషనే ఎంచుకుంటున్నారనేది బహిరంగ రహస్యం. విద్యలో శాస్త్రీయత ఉండాలి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానం 2020లో కూడా మాతృభాషకే పట్టం కట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆంగ్లాన్ని ప్రథమభాషగా, ద్వితీయ భాషగానున్న తెలుగు స్థానంలో సంస్కృత భాషకు చోటిస్తే తల్లి భాషను శాశ్వతంగా పిల్లల నుండి వేరవుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భాష బోధనలో పిల్లలు సాహిత్య, సామాజిక, సాంఘిక, నైతిక విలువలు, చక్కటి సంభాషణా నైపు ణ్యం, సమాచార లేఖనా నైపుణ్యం అలవడుతాయి.మాతృభాష బోధనలో అర్థవంతమైన నైపుణ్యం, సృజనాత్మకత, ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, దేశభక్తి వంటివి అలవడుతాయి.

# వివాదాస్పదమవుతున్న గవర్నర్ వ్యవస్థ




(లోకల్ గైడ్):దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేతలూ వర్సెస్ రాజ్యాంగాధినేతల మధ్య ఘర్షణ వాతావరణం రోజురోజుకు చర్చనీయాంశం అవుతోంది. రాష్ట్రాల్లో గవర్నర్ వర్సెస్ గవర్నమెంట్ మధ్య దూరం మరింత పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్రాల్లో విభిన్న ప్రభుత్వాలున్నప్పుడు ఈ ఘర్షణ అనివార్యమవుతోంది. అధికారాల విషయంలో ఎప్పుడూ ఏదో ఒక అలజడి జరుగుతూనే ఉంది. తరుచూ ఏవో ఒక ప్రకంపనలు చెలరేగుతూనే ఉన్నాయి. కేరళ, తమిళనాడు ఇలా ఒక్కోరాష్ట్రంలో గవర్నర్ వ్యవస్థ వివాదం అవడంతో దేశవ్యాప్తంగా చర్చనడుస్తోంది. రాష్ట్రాలలో గవర్నర్లు, నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీతో సహా కేంద్ర భూభాగాల్లో లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా అడ్మినిస్ట్రేటర్ ఉన్నారు. గవర్నర్ నామమాత్రపు అధిపతిగా వ్యవహరిస్తారు, అయితే నిజమైన అధికారం రాష్ట్రాలలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వారి మంత్రి మండలిపై, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లెఫ్టినెంట్ గవర్నర్ లేదా అడ్మినిస్ట్రేటర్ వద్ద ఉంటుంది.ఢిల్లీ, పుదుచ్చేరి మినహా గవర్నర్ ఒక ముఖ్యమంత్రి నేతత్వంలోని మంత్రుల మండలితో అధికారాన్ని పంచుకుంటారు. ఆర్టికల్ 153 ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఓ గవర్నర్ అవసరం. గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లను ఐదేళ్ల కాలానికి భారత రాష్ట్రపతి నియమిస్తారు. ఆర్టికల్ 154 ప్రకారం రాష్ట్ర గవర్నర్‌కి కార్యనిర్వాహక అధికారం ఉంటుంది. పరోక్షంగా అధికారుల ద్వారా పరిపాలన చేయవచ్చనేది దీనర్థం. అయితే గవర్నర్ వ్యవస్థ అనేది స్వాతంత్ర్యానికి పూర్వం అంటే బ్రిటీష్ పాలన నుండే ఉన్నది. అప్పట్లో వైశ్రాయ్ కీలకమైన పదవి. గవర్నర్ కేవలం కార్యనిర్వాహక అధిపతి. బ్రిటీష్ చట్టాలకు అనుగుణంగా నాడు ఏర్పడిన ఈ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య గవర్నర్ వ్యవస్థ వారధిలా ఉండాలనే ఉద్దేశంతో దీనిని కొనసాగిస్తున్నారు. కానీ ఇదే గవర్నర్ వ్యవస్థను ఆసరా చేసుకుని కేంద్ర ప్రభుత్వాలు, రాష్ట్రాలపై ఆధిపత్యం చెలాయించిన సందర్భాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఓ బిల్లును ఆమోదించినప్పుడు స్పష్టత కోరే అధికారం గవర్నర్‌కు ఉంది. అయినా ఆ బిల్లును అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే. దేశంలో గవర్నర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య వివాదాలు కొత్తేమీ కాదు. చాలా రాష్ట్రాల్లో గతంలో ఇలాంటి వివాదాలు తారాస్థాయికి వెళ్లాయి. మొన్నటిదాకా ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ వర్సెస్ అక్కడి గవర్నర్ మధ్య వివాదం గతంలో నిత్యకత్యంలా మారింది. అసలు గవర్నర్ పదవి అనేది ఫెడరల్ వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషించాల్సిన బాధ్యతాయుతమైన స్థానం. అయితే ఇక్కడ బాధాకరమైన విషయమేమంటే రాష్ట్రాల్లో ప్రత్యర్థి పార్టీ ప్రభుత్వం ఉన్నపుడు, కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న గవర్నర్లు ప్రభుత్వ విధానాలను అడ్డుకోవడం వంటి ఆరోపణలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ఒక చారిత్రాత్మకమైన నిర్ణయంగా మిగిలింది. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి వ్యవహారంపై ఇచ్చిన తీర్పులో, రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్ తిరస్కరించినా, మళ్లీ అవే బిల్లులు తిరిగి రెండోసారి ఆమోదించి పంపినప్పుడు వాటిని రాష్ట్రపతికి పంపకుండా తన వద్దే ఉంచుకోవడాన్ని కోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపే అంశంగా ఉందని, గవర్నర్ తన పదవి ద్వారా స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించొద్దని హెచ్చరించింది. అలాగే బిల్లులను ఆమోదించడంలో ఆలస్యం చేయకూడదని, మూడు నెలల వ్యవధిలోనే నిర్ణయం తీసుకోవాలని కోర్టు సూచించింది. అలాగే వైస్ ఛాన్సలర్లు, ఇతర విద్యా వ్యవస్థ సంబంధిత నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలపై జాప్యం చేయకూడదన్న సూచన కూడా ఈ తీర్పులో ఉంది.అయితే ఇది కేవలం తమిళనాడు గవర్నర్ విషయంలోనే కాకుండా, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఈ తీర్పు మార్గదర్శకంగా నిలుస్తుందనేది న్యాయనిపుణుల అభిప్రాయం. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో స్పష్టత తీసుకురావడంతో పాటు, ఫెడరల్ వ్యవస్థను మరింత బలపరిచే దిశగా ఉన్నది. కాబట్టి ఇప్పటికైనా గవర్నర్ వ్యవహారశైలి మారకపోతే, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం దిగజారే ప్రమాదం ఉంది. గవర్నర్ ఒక స్నేహితుడిగా, మార్గదర్శకుడిగా, రాజ్యాంగ ప్రమాణాలను గౌరవించే వ్యక్తిగా ఉండాలన్నది ఈ తీర్పు ద్వారా వెల్లడైన సందేశం. ఈ గవర్నర్ల వివాదమనేది మన తెలుగు నేలను కూడా గతంలో ఆవహించిన సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి ఎపి, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఇప్పటి వరకు పనిచేసిన గవర్నర్లలో అత్యంత వివాదాస్పదుడు రామ్‌లాల్.1984లో ఎన్‌టి రామారావు ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసి నాదెండ్ల భాస్కరరావును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అనుమతించిన గవర్నర్‌గా ఆయన చరిత్రలో నిలిచారు. ఆనాటి కాంగ్రెస్ సారథ్యంలో ఇందిరా గాంధీ అయినా, నేడు బిజెపి సారధ్యంలో నరేంద్ర మోడీ అయినా కేంద్రంలో ప్రభుత్వం మారిన ప్రతీసారి రాష్ట్రాల్లో తమ ఇష్టానుసారంగా గవర్నర్లను మార్చే చర్యల వల్ల రాష్ట్ర ప్రభుత్వాలకు గవర్నర్ వ్యవస్థే ఇబ్బందికరంగా మారింది. దాని పర్యవసానంగానే నేడు గవర్నర్లు కేంద్ర ప్రభుత్వానికి ఏజెంట్లుగా వ్యవహరిస్తూ బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆయా ప్రభుత్వాల నేతత్వంలో అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను క్లియర్ చేయటం లేదు. దీనివల్ల గవర్నర్ వ్యవస్థ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి భంగం కలిగిస్తుంది. ఇది రాష్ట్రాల మధ్య విభేదాలకు దారితీస్తుంది. మోడీ ప్రభుత్వం గవర్నర్లను అడ్డుపెట్టుకుని రాష్ట్రాల హక్కుల మీద, రాజ్యాంగంలోని ఫెడరల్ సూత్రాల మీద తీవ్రమైన దాడి చేయడం 2014 నుండి జరుగుతూనే ఉంది. మహరాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్, గోవా, కర్నాటక, కేరళలో ఈ దాడులను చూశాం. గవర్నర్లకు రాజ్యాంగం ఇచ్చిన కొన్ని విచక్షణాధికారాలను ఉపయోగించుకుని వారు సమాంతర అధికార కేంద్రాలుగా మారడానికి ప్రయత్నిస్తున్నారు. మన రాజ్యాంగంలోని అన్ని మౌలిక అంశాల మీద అంటే లౌకికత్వం, ప్రజాసామ్యం ముఖ్యంగా పార్లమెంటరీ ప్రజాసామ్యం, ఫెడరలిజం మొదలైన రాజ్యాంగ మౌలిక అంశాలన్నింటి మీద జరుగుతున్న దాడిలో ఇదో భాగం. అందుకే ప్రజాస్వామ్యంలో ఏమాత్రం ప్రాధాన్యత లేకుండా ఆరో వేలుగా ఉండి, అసలు ప్రజాస్వామ్యాన్నే పెను ప్రమాదంలోకి నెడుతున్న ఈ గవర్నర్ వ్యవస్థ అవసరం ఇంకా ఉన్నదా? అని ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

# కమ్ముకొస్తున్న యుద్ధమేఘాలు



(లోకల్ గైడ్):పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. తమకు జీవనాడి వంటి సింధు జలాల ఒప్పందం నిలిపివేయడం, తమపై ప్రత్యక్షంగా యుద్ధానికి కాలుదువ్వడమేనని పాకిస్థాన్ భగ్గుమంటోంది. దీనికి ప్రతీకారంగా 1972 నాటి సిమ్లా ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో జరిగిన భేటీలో వాఘా బోర్డర్ మూసివేత, వాణిజ్య సంబంధాలు బంద్, వీసాల రద్దు వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. భారత్‌కు తన గగనతలాన్ని మూసివేసింది. దీనివల్ల మన విమానాలు చుట్టూ తిరిగి రావాల్సిందే. విమానాల దారిమళ్లింపు ప్రయాణికులపై మరింత భారం పడుతుంది. ఏ పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధమేనని ప్రకటించింది. సరిహద్దుల వెంబడి సైనిక దళాల మోహరింపు ఎక్కువ చేసింది. మరోవైపు పాకిస్థాన్ ఎప్పటికీ తేరుకోలేని విధంగా భారత్ కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. గురువారం ఆక్రమణ్ పేరిట భారత్ సైన్యం భారీ వైమానిక విన్యాసాలు నిర్వహించింది. అత్యాధునిక రఫేల్‌తోపాటు సుఖోయ్ తదితర యుద్ధవిమానాలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. ఇరుదేశాలూ పోటాపోటీగా అరేబియా సముద్రంలో క్షిపణి పరీక్షలు నిర్వహించాయి. భారత్ నేవీకి చెందిన స్వదేశీ గైడెడ్ క్షిపణి విధ్వంసక నౌక ఐఎన్ఎస్ సూరత్ నుంచి సీ స్కిమ్మింగ్ టార్గెట్లను ఛేదించే క్షిపణిని పరీక్షించింది. 70 కి.మీ పరిధిలో టార్గెట్లను ఛేదించగల మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (ఎంఆర్ఎస్ఏఎం ను పరీక్షించింది. పాక్ తన గగనతల రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసింది. భారత విమానాల కదలికలను ట్రాక్ చేయడానికి వారి అవాక్స్ నిరంతర నిఘా పెట్టింది. ఉపరితలం పైనుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణి పరీక్షలను చేపడతామని పాక్ ప్రకటించింది. ఈ మేరకు మిలిటరీ నోటమ్(నోటీస్ టు ఎయిర్‌మెన్/మెరైనర్స్) జారీ చేసింది. ఇక 1972 నాటి భారత్‌పాక్ సిమ్లా ఒప్పందం నిలిపివేస్తున్నట్టు పాక్ ప్రకటించడం దీర్ఘకాలంలో వ్యతిరేక ప్రభావం చూపే అవకాశం ఉంది. 1971లో పాకిస్థాన్ నుంచి విముక్తి కోరుతూ తూర్పు పాకిస్థాన్ ప్రజలు జరిపిన పోరాటానికి పలకగా, భారత సైన్యంపై పాక్‌దాడులకు దిగడంతో ఉభయ దేశాల మధ్య భీకర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో భారత్ గొప్ప విజయం సాధించింది. అంతేకాదు పాకిస్థాన్‌లోని 13 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని భారత్ స్వాధీనం చేసుకుంది. పర్యవసానంగా బంగ్లాదేశ్ ఆవిర్భవించిన తరువాత 1972 జులై 2 న భారత్‌పాక్ సిమ్లా ఒప్పందం కుదిరింది. ఇరుదేశాలు ఘర్షణలకు స్వస్తి పలికి స్నేహపూర్వక సంబంధాలు నెలకొల్పుకోవడమే ఈ ఒప్పందం లక్ష్యం. ఆ సమయంలోనే నియంత్రణ రేఖ ఏర్పడింది. ఇప్పుడు ఈ ఒప్పందాన్ని పాక్ నిలిపివేయడంతో నియంత్రణ రేఖకు కట్టుబడి ఉండాల్సిన పరిస్థితి ఉండదు. ఇప్పటికే నియంత్రణ రేఖ (లైన్ ఆఫ్ కంట్రోల్)ను ఉల్లంఘిస్తూ తరచుగా కాల్పుల సంఘటనలు జరుగుతున్నాయి. ఇవి మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పుడు నియంత్రణ రేఖ వెంబడి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 42 ఉగ్రవాద లాంచ్ ప్యాడ్స్ సిద్ధంగా ఉన్నాయని నిఘా వర్గాలు వెల్లడించడం గమనార్హం. ఇక్కడ శిక్షణ పొందిన 200 మంది ఉగ్రవాదులు ఏ క్షణమైనా భారత్ సరిహద్దుల్లోకి అక్రమంగా ప్రవేశించడానికి సిద్ధంగా ఉన్నారని నిఘా వర్గాల సమాచారం. వీరిలో 115 మంది పాక్ జాతీయులు కాగా, జమ్మూకశ్మీర్‌లోని హిజ్బుల్ ముజాహిద్దీన్, జైష్ ఎ మహ్మద్, లష్కర్ ఎ తొయిబా తదితర ఉగ్రవాద సంస్థలకు చెందిన మొత్తం 60 మంది విదేశీ ఉగ్రవాదులు మరో 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. వీరిని సరిహద్దు దాటించేందుకు పాక్ సహకరిస్తోంది. యుద్ధభయంతో పాకిస్థాన్ బుధవారంనుంచే నియంత్రణ రేఖ వద్దకు సైన్యాన్ని, యుద్ధట్యాంకులను పంపించింది. సరిహద్దుల్లో తన బలగాలను పాక్ పెంచుతోంది. అఫ్గానిస్థాన్ సరిహద్దులతోపాటు బలోచిస్థాన్‌లో ఉన్న మిలిటరీ సిబ్బందిని నియంత్రణ రేఖ వద్దకు పంపుతోంది. జవాన్ల సెలవులను కూడా పాక్ మిలిటరీ రద్దు చేసింది. ఇటీవల ఎల్‌ఓసి వద్ద పాక్ అనేక ఉల్లంఘనలు జరిపింది. దీన్ని కారణంగా చూపించి భారత్ ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్లు చేపట్టే అవకాశం ఉంది. పహల్గాం ఉగ్రవాదులను ఎలాంటి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టకూడదన్న దేశప్రజల డిమాండ్ బట్టి పాక్‌పై ఎలా ప్రతీకారం తీర్చుకోవాలో భారత్ ప్రభుత్వం అవకాశాలను వెదుకుతోంది. ప్రస్తుతం వాయుసేనలో అత్యాధునిక ఫైటర్ జెట్లు, రఫేల్, మిరాజ్ 2000 ఉన్నాయి. వీటిని ఉపయోగించి పాక్‌లోని కీలక సైనిక కార్యాలయాలపై దాడులు చేయాలన్న వ్యూహంలో భారత్ ఉంటోంది. ఈ సమయంలో బాలాకోట్‌పై దాడి తరువాత ఎదురైన అనుభవాలు మళ్లీ ఎదురుకాకుండా చూసుకోవాల్సి ఉంది. మరోవైపు దేశంలోని పారామిలిటరీ బలగాలకు సెలవులు రద్దు చేశారు. సెలవులపై వెళ్లిన జవాన్లు వెంటనే విధులకు హాజరు కావాలని కేంద్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జమ్మూకశ్మీర్ పరిస్థితులపై అన్ని మిలిటర్ లోని విమానాశ్రయంలో సైన్యం రీ విభాగాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. శ్రీనగభద్రతను కట్టుదిట్టం చేశారు. మొత్తం మీద రెండు దేశాల మధ్య యుద్ధ వాతావరణం కనిపిస్తుండటంతో ఐక్యరాజ్యసమితి స్పందించింది. భారత్‌పాక్ దేశాలు సంయమనం పాటించాలని కోరింది. ఇరు దేశాల మధ్య ఏదైనా సమస్య ఉంటే శాంతియుత చర్చలతో పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నట్టు అభిప్రాయపడింది. సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేత వంటి కీలకాంశాలపై సంయమనం పాటించి, పరిస్థితులు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాయని ఆశిస్తున్నట్టు పేర్కొంది.

# చరిత్ర సృష్టించిన ముంబై ఇండియన్స్.. తొలి జట్టుగా రికార్డు




ఐపీఎల్-2025లో ముంబై ఇండియన్స్ తమ జైత్ర యాత్ర కొనసాగుతోంది. హార్దిక్ సేన వరుసగా ఐదో? విజయాన్ని నమోదు చేసింది. ఈ మెగా టోర్నీలో భాగంగా ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 54 పరుగుల తేడాతో ముంబై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముంబై ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగుల భారీ స్కోర్ చేసింది. ముంబై బ్యాటర్లలో రికెల్టన్(58), సూర్యకుమార్ యాదవ్(54) హాఫ్ సెంచరీలతో మెరవగా.. నమన్ ధీర్(25), జాక్స్(29), బాష్(20) రాణించారు. లక్నో బౌలర్లలో మయాంక్ యాదవ్, అవేష్ ఖాన్ తలా రెండు వికెట్లు సాధించారు. వీరితో పాటు ప్రిన్స్ యాదవ్, దిగ్వేష్, బిష్ణోయ్ చెరో వికెట్ పడగొట్టారు. 216 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. ముంబై బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా నాలుగు వికెట్లతో చెలరేగాడు. అతడితో పాటు ట్రెంట్ బౌల్ట్ మూడు, విల్ జాక్స్ రెండు, బాష్ ఓ వికెట్ సాధించారు. లక్నో బ్యాటర్లలో ఆయూష్ బదోని(35) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. మిచెల్ మార్ష్(34) పర్వాలేదనిపించాడు.

ముంబై సరికొత్త చరిత్ర..

ఈ విజయంతో ముంబై ఇండియన్స్ ఓ అరుదైన రికార్డును తమ ఖాతాలో వేసు?కుంది. ఐపీఎల్?లో 150 మ్యాచ్?ల్లో గెలిచిన తొలి జట్టుగా ముంబై ఇండియన్స్ చరిత్ర సృష్టించింది. ఐపీఎల్ హిస్టరీలో ఇప్పటి వరకు 271 మ్యాచ్?లు ఆడిన ముంబై 150 విజయాలు సాధించింది. ఈ జాబితాలో ముంబై తర్వాతి స్థానంలో సూపర్ కింగ్స్ (248 మ్యాచ్?లు) ఉంది. మూడు నాలుగు స్థానాల్లో కేకేఆర్(134), ఆర్సీబీ(129) కొనసాగుతున్నాయి.

# స్పోర్ట్స్ న్యూస్

## పంజాబ్ కింగ్స్ అస్సలు టైటిల్ గెలవదు..




ఎందుకంటే: భారత మాజీ క్రికెటర్

ఐపీఎల్-2025 లో పంజాబ్ కింగ్స్ అదరగొడుతోంది. గతేడాది పద్నాలుగింట కేవలం ఐదే గెలిచిన ఈ జట్టు.. పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంతో సీజన్‌ను ముగించింది. అయితే, ఈసారి ఇప్పటికి ఆడిన తొమ్మిది మ్యాచ్‌లలో ఏకంగా ఐదు గెలిచింది. ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తో శనివారం నాటి మ్యాచ్‌లోనూ 201 పరుగుల మేర భారీ స్కోరు చేసిన పంజాబ్‌కే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, వర్షం కారణంగా ఆ మ్యాచ్ రద్దు కావడంతో ఇరుజట్లకు చెరో పాయింట్ వచ్చింది. దీంతో 11 పాయింట్లతో పంజాబ్ ప్రస్తుతం ఐదో స్థానంలో కొనసాగుతోంది.

### సానుకూల ఫలితాలు

కొత్త కోచ్ రిక్కీ పాంటింగ్ , నూతన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో పంజాబ్ ఈ మేరకు సానుకూల ఫలితాలు సాధిస్తోంది. ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేదన్న అపవాదును చెరిపి వేసుకునే దిశగా ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారి మాత్రం భిన్నంగా స్పందించాడు.

ఈసారి కూడా పంజాబ్ ట్రోఫీ గెలవదు

కేకేఆర్‌తో మ్యాచ్‌లో రిక్కీ పాంటింగ్ వ్యవహరించిన తీరు చూసిన తర్వాత.. ఈసారి కూడా పంజాబ్ ట్రోఫీ గెలవలేదంటూ మనోజ్ తివారి అభిప్రాయపడ్డాడు. "ఈ సీజన్‌లో కూడా పంజాబ్ టైటిల్ సాధించలేదని నాకు గట్టి నమ్మకం. ఎందుకంటే.. కేకేఆర్‌తో మ్యాచ్‌లో పంజాబ్ బ్యాటింగ్ చూసినప్పుడు నాకో విషయం అర్థమైంది. ఫామ్‌లో ఉన్న భారత బ్యాటర్లు నేహాల్ వధేరా, శశాంక్ సింగ్‌లను కాకుండా ఆ జట్టు కోచ్ విదేశీ ఆటగాళ్లను బ్యాటింగ్‌కు పంపించాడు.

### పాంటింగ్ వాళ్లను నమ్మడు

భారత బ్యాటర్ల కంటే వారిపైనే ఎక్కువ నమ్మకం ఉంచాడు. కానీ వాళ్లు ఏమీ చేయలేకపోయారు. దీనిని బట్టి భారత ఆటగాళ్లపై కోచ్‌కు నమ్మకం లేదనిపిస్తోంది. అందుకే వాళ్లను లోయర్ ఆర్డర్లో పంపించాడు. అతడు ఇలాగే చేశాడంటే టాప్-2లోకి వచ్చినా వాళ్లు టైటిల్ మాత్రం గెలవలేరు" అని మనోజ్ తివారి ఎక్స్ వేదికగా రిక్కీ పాంటింగ్ తీరును విమర్శించాడు. అయితే, మనోజ్ తీరుపై పంజాబ్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "వ్యూహంలో భాగంగా.. ఒత్తిడి లేని సమయంలో ఫామ్‌లో లేని ఆటగాళ్లను పరీక్షిస్తే వచ్చిన నష్టమేమిటి? వివిధ రకాల కాంబినేషన్లు ట్రై చేయడంలో తప్పేముంది?" అని మనోజ్‌ను ట్రోల్ చేస్తున్నారు. కాగా కేకేఆర్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ తొలుత బ్యాటింగ్ చేసింది.

### మెరుపు ఇన్నింగ్స్

ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 69), ప్రభ్‌సిమ్రన్ సింగ్(49 బంతుల్లో 83) మెరుపు ఇన్నింగ్స్‌తో దుమ్ములేపారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మూడో స్థానంలో వచ్చి 25 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇక నాలుగో స్థానంలో వచ్చిన గ్లెన్ మాక్స్‌వెల్ (7) మరోసారి నిరాశపరచగా.. ఈసారి మార్కో యాన్సెన్ (3) కూడా విఫలమయ్యాడు. ఐదో స్థానంలో వచ్చిన జోష్ ఇంగ్లిస్ (6 బంతుల్లో 11) అయ్యర్‌తో కలిసి ఆఖరి వరకు అజేయంగా ఉన్నాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్ ఒక ఓవర్‌లో ఏడు పరుగులు చేసింది. ఆ తర్వాత వర్షం కారణంగా మ్యాచ్ రద్దైపోయింది.

## అదరగొడుతున్నాడు..

## అతడిని టీమిండియా టీ20 జట్టులోకి తీసుకోండి: పీటర్సన్



ఐపీఎల్-2025 లో టీమిండియా స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ అదరగొడుతున్నాడు. ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఇప్పటి వరకు ఎనిమిది మ్యాచ్‌లు ఆడిన ఈ వికెట్ కీపర్ బ్యాటర్ 364 పరుగులు సాధించాడు. 60.66 సగటుతో 146.18 స్ట్రైక్‌రేటుతో మూడు అర్ధ శతకాల సాయంతో రాహుల్ ఈ మేర పరుగులు రాబట్టాడు. ఈ నేపథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్ మెంటార్, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రాహుల్ ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్నాడని.. అతడిని భారత టీ20 జట్టులోకి తీసుకోవాలని సెలక్టర్లకు సూచించాడు. కాగా ఐపీఎల్-2025లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ ఆదివారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడింది. ఈ మ్యాచ్‌లో నాలుగో స్థానానికి ప్రమోట్ అయిన రాహుల్.. 39 బంతుల్లో మూడు ఫోర్ల సాయంతో 41 పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లంతా విఫలమైన వేళ కాస్త మెరుగ్గా ఆడి.. ఢిల్లీ టాప్ రన్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక ఈ మ్యాచ్‌లో నిర్ణీత 20 ఓవర్లో ఎనిమిది వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేసిన ఢిల్లీ.. లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. బెంగళూరు జట్టు ఈ టార్గెట్‌ను 18.3 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో బెంగళూరు జట్టు చేతిలో ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడిన పీటర్సన్.. రాహుల్ ఆట తీరు పట్ల మాత్రం సంతృప్తి వ్యక్తం చేశాడు.

### అతడే నా మొదటి ఎంపిక

"టీమిండియా తరఫున టీ20 క్రికెట్‌లో కేఎల్ రాహుల్‌ను నాలుగో స్థానంలో ఆడించాలి. భారత జట్టులో చాలా మంది ఓపెనింగ్ బ్యాటర్లు ఉన్నారు. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్.. ఇలా ఎవరైనా టాపార్డర్‌లో బ్యాటింగ్ చేయగలరు. అయితే, కేఎల్ రాహుల్ ప్రస్తుతం ఆడుతున్న విధానం అమోఘం. నాలుగో స్థానంలో చక్కగా బ్యాటింగ్ చేయడం సహా.. వికెట్ కీపర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించగలడు. కాబట్టి టీమిండియా నంబర్ ఫోర్ బ్యాటర్, వికెట్ కీపర్‌గా అతడే మొదటి ఎంపిక" అని పీటర్సన్ పేర్కొన్నాడు. గతేడాది కాలంగా కేఎల్ రాహుల్ అద్భుతంగా ఆడుతున్నాడని.. ముఖ్యంగా చాంపియన్స్ ట్రోఫీ-2025లో అదరగొట్టాడని పీటర్సన్ ప్రశంసించాడు. వేర్వేరు ఫార్మాట్లలో రాణించగల నత్తా అతడికి ఉందని.. సానుకూల దృక్పథమే రాహుల్‌కు బలంగా మారిందని పేర్కొన్నాడు. ఆట పట్ల అంకితభావం, నెట్స్‌లో శ్రమించే తీరు.. జట్టు ప్రయోజనాల గురించి ఆలోచించే విధానం రాహుల్‌లో తనకు నచ్చాయని తెలిపాడు.

### చివరగా 2022లో టీమిండియా తరఫున

కాగా 2016లో అంతర్జాతీయ టీ20లలో అడుగుపెట్టిన కేఎల్ రాహుల్.. చివరగా 2022లో టీమిండియా తరఫున పొట్టి మ్యాచ్ ఆడాడు. టీ20 ప్రపంచకప్-2022 సందర్భంగా ఇంగ్లండ్‌తో రెండో సెమీ ఫైనల్ సందర్భంగా బరిలోకి దిగాడు. ఆ మ్యాచ్‌లో ఓపెనర్‌గా వచ్చిన రాహుల్ ఐదు పరుగులే చేసి నిష్క్రమించాడు. ఇక ఆ తర్వాత మళ్లీ భారత టీ20 జట్టుకు రాహుల్ ఎంపిక కాలేదు. అయితే, టెస్టుల్లో, వన్డేల్లో మాత్రం ఆడుతున్నాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియా పర్యటనలో బోర్డర్- గావస్కర్ ట్రోఫీ సందర్భంగా టెస్టు ఆడిన ఈ కర్ణాటక బ్యాటర్.. చాంపియన్స్ ట్రోఫీ-2025 (వన్డే) గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఇదిలా ఉంటే.. ఐపీఎల్‌లో గతేడాది వరకు లక్నో సూపర్ జెయింట్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన రాహుల్.. మెగా వేలానికి ముందు ఆ ఫ్రాంఛైజీతో తెగదెంపులు చేసుకున్నాడు. ఈ క్రమంలో ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 14 కోట్లకు అతడిని కొనుగోలు చేయగా.. ఈ కుడిచేతి వాటం బ్యాటర్ పైసా వసూల్ ప్రదర్శన ఇస్తున్నాడు.

## ఆర్సీబీ తలరాత మార్చే ప్రయత్నం చేస్తున్న భువీ..

## ఈ క్రమంలో అరుదైన ఘనత

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీ తలరాత మార్చే ప్రయత్నం (టైటిల్ సాధించడం) చేస్తున్న వ్యక్తుల్లో భువనేశ్వర్ కుమార్ ముఖ్యుడు. ఈ సీజన్‌లో భువీ ఆడిన ప్రతి మ్యాచ్‌లో సత్తా చాటి ఆర్సీబీ విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. 9 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీసి లీడింగ్ వికెట్ టేకర్ల జాబితాలో తొమ్మిదో స్థానంలో ఉన్నాడు. తాజాగా (ఏప్రిల్ 27) ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పొదుపుగా బౌలింగ్ చేయడమే (4 ఓవర్లలో 33 పరుగులు) కాకుండా 3 వికెట్లు తీసి ఆర్సీబీ గెలుపులో ముఖ్య భూమిక పోషించాడు. ఈ క్రమంలో ఓ ఘనత సాధించాడు. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో పియూశ్ చావ్లాను (192) వెనక్కు నెట్టి రెండో స్థానానికి ఎగబాకాడు. ప్రస్తుతం భువీ ఖాతాలో 193 వికెట్లు (185 మ్యాచ్‌ల్లో) ఉన్నాయి.

ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన రికార్డు యుజ్వేంద్ర చహల్ పేరిట ఉంది. చహల్ 169 మ్యాచ్‌ల్లో 214 వికెట్లు తీసి టాప్ ప్లేస్‌లో కొనసాగుతున్నాడు.

### ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన టాప్-5 బౌలర్లు

యుజ్వేంద్ర చహల్- 214
భువనేశ్వర్ కుమార్- 193
పియూశ్ చావ్లా- 192
సునీల్ నరైన్- 187
రవిచంద్రన్ అశ్విన్- 185

### ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో భువీ ప్రదర్శనలు..

సీఎస్‌కేపై 1/20 (ఆర్సీబీ గెలుపు)
గుజరాత్‌పై 1/23 (ఆర్సీబీ ఓటమి)
ముంబై ఇండియన్స్‌పై 1/48 (ఆర్సీబీ గెలుపు)
ఢిల్లీ క్యాపిటల్స్‌పై 2/26 (ఆర్సీబీ ఓటమి)
రాజస్థాన్ రాయల్స్‌పై 1/32 (ఆర్సీబీ గెలుపు)
పంజాబ్ కింగ్స్‌పై 2/26 (ఆర్సీబీ ఓటమి)
పంజాబ్ కింగ్స్‌పై 0/26 (ఆర్సీబీ గెలుపు)
రాజస్థాన్ రాయల్స్‌పై 1/50 (ఆర్సీబీ గెలుపు)
ఢిల్లీ క్యాపిటల్స్‌పై 3/33 (ఆర్సీబీ గెలుపు)

35 ఏళ్ల భువీ ఆర్సీబీకి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్, పూణే వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

సన్‌రైజర్స్ తరఫున విశేషంగా రాణించిన భువీ.. ఆ ఫ్రాంచైజీ తరఫున 157 వికెట్లు తీశాడు. మధ్యలో రెండు సీజన్లు పుణేకు ఆడి 31 మ్యాచ్‌ల్లో 24 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం ఆర్సీబీ ఆడుతూ 9 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీశాడు.

భువీ తన ఐపీఎల్ కెరీర్‌లో రెండు సార్లు పర్పుల్ క్యాప్ (సీజన్‌లో అ?త్యధిక వికెట్లు) హోల్డర్‌గా నిలిచాడు. 2016, 20167 సీజన్ల వరుసగా ఈ ఫీట్‌ను సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో కేవలం? డ్వేన్ బ్రావో, హర్షల్ పటేల్ మాత్రమే రెండు సార్లు పర్పుల్ క్యాప్ సాధించారు.నిన్న జరిగిన ఢిల్లీ-ఆర్సీబీ మ్యాచ్ విషయానికొస్తే.. భువీతో పాటు హాజిల్‌వుడ్ (4-0-36-2), సుయాశ్ శర్మ (4-0-22-0), కృనాల్ పాండ్యా (4-0-28-1) అద్భుతంగా బౌలింగ్ చేయడంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 162 పరుగుల స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. ఢిల్లీ బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (41), ట్రిస్టన్ స్టబ్స్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు.

అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన ఆర్సీబీ ఆదిలో తడబడినప్పటికీ (4 ఓవర్లలో 26 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది).. విరాట్ (47 బంతుల్లో 51బీ 4 ఫోరు?), కృనాల్ (47 బంతుల్లో 73 నాటౌట్‌బీ 5 ఫోర్లు, 4 సిక్సర్లు) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌లు ఆడి తమ జట్టును విజయతీరాలకు చేర్చారు. టిమ్ డేవిడ్ (5 బంతుల్లో 19 నాటౌట్‌బీ 3 ఫోర్లు, సిక్స్) ఆఖర్లో వేగంగా ఆడి మ్యాచ్‌ను ముగించాడు. ఆల్‌రౌండ్ షోతో సత్తా చాటిన కృనాల్ పాండ్యాకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ (4-0-19-2), కుల్దీప్ యాదవ్ (4-0-28-0), చమీరా (3-0-24-1) బాగానే బౌలింగ్ చేసినప్పటికీ.. లక్ష్యం మరీ చిన్నది కావడంతో వారు డిఫెండ్ చేసుకోలేకపోయారు. ఆ జట్టు బౌలర్లలో స్టార్క్ (3-0-31-0), ముకేశ్ కుమార్ (3.3-0-51-0) ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

ఢిల్లీపై గెలుపుతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో 7 విజయాలు సాధించి ప్లే ఆఫ్స్ బెర్తును దాదాపుగా ఖరారు చేసుకుంది. ఈ సీజన్‌లో ఆర్సీబీ ఇంకా నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. తదుపరి మ్యాచ్‌లో (మే 3) ఈ జట్టు సీఎస్‌కేతో (బెంగళూరులో) తలపడనుంది. మే 9న ఎల్ఎస్‌జీని లక్నోను ఢీకొంటుంది. ఆతర్వాత సన్‌రైజర్స్, కేకేఆర్‌లను బెంగళూరులో ఎదుర్కొంటుంది.




## నాకంటూ ఓ ప్రణాళిక ఉంటుంది..

## అది మర్చిపోతే ఎలా?!: కోహ్లి కౌంటర్




ఐపీఎల్-2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఆదివారం అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 47 బంతులు ఎదుర్కొన్న కోహ్లి.. 108.51 స్ట్రైక్ రేట్‌తో 51 పరుగులు చేశాడు. 163 పరుగుల లక్ష్య చేధనలో 26 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయి ఆర్సీబీ కష్టాల్లో పడింది. ఈ సమయంలో కోహ్లి ఆచితూచి ఆడుతూ కృనాల్ పాండ్యాతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. స్ట్రైక్ రేట్ తక్కువగా ఉన్నప్పటికి కోహ్లి ఆడిన ఇన్నింగ్స్ ఎంతో విలువైనది. ఈ క్రమంలో తన స్ట్రైక్ రేట్‌పై విమర్శల చేస్తున్నవారికి కోహ్లి మరోసారి కౌంటరిచ్చాడు. టీ20 క్రికెట్‌లో దూకుడు ఒక్కటే ముఖ్యం కాదని, పరిస్థితులకు తగ్గట్టు బ్యాటింగ్ చేయడం అవసరమని కోహ్లి అన్నాడు. "టీ20, వన్డే, టెస్టు.. ఫార్మాట్ ఏదైనా మనకంటూ ఒక ప్రణాళిక ఉండాలి. స్కోర్ బోర్డులో ఎంత మొత్తం ఉంచాలి,?మనం చేధించాల్సిన టార్గెట్ ఎంత? పిచ్ పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఏ బౌలర్‌ను ఎటాక్ చేయాలి? ఏ బౌలర్‌ను ఎటాక్ చేయకూడదు? ఇవన్నీ ఆలోచించి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలి. ముఖ్యంగా ఛేజింగ్‌లో ఎప్పుడూ నాకంటూ ఓ ప్లానింగ్ ఉంటుంది. ఎక్కువగా సింగిల్స్, డబుల్స్‌పై దృష్టిపెడతాను. ఏదో విధంగా పరుగులు రాబట్టమే నా లక్ష్యం.

వీలు చిక్కినప్పుడల్లా బంతిని బౌండరీకి తరలించేందుకు ప్రయత్నిస్తాను. స్ట్రైక్స్ రొటేటింగ్, సింగిల్స్, డబుల్స్ తీయడమే నా గేమ్ ప్లాన్. అయితే టీ20 క్రికెట్‌లో భాగస్వామ్యం నెలకొల్పడం, గేమ్‌ను క్లోజ్‌గా తీసుకెళ్లడం ఎంత ముఖ్యమో విమర్శకులు మర్చిపోతున్నారు అనుకుంటా. ఈ ఏడాది సీజన్‌లో ఏ బ్యాటర్ కూడా తొలి బంతి నుంచే బౌలర్‌ను ఎటాక్ చేయడం లేదు. పిచ్ పరిస్థితిని అర్థం చేసుకోని, బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాలంటే మనంటూ ప్రొఫెషనలిజం ఉండాలి. స్లో పిచ్‌లపై స్ట్రైక్ రొటేట్ చేయడం అంత తేలిక కాదు. దానికంటూ ప్రత్యేక స్కిల్స్ ఉండాలి. నేను పిచ్ కండీషన్స్, మ్యాచ్ పరిస్థితులకు తగ్గట్టు ఆడేందుకు ప్రయత్నిస్తాను. స్ట్రైక్ రొటేట్ చేస్తూ స్కోర్ బోర్డును ముందుకు నడిపించేందుకు నాకు చాలా స్కిల్స్ ఉన్నాయి" అని పోస్ట్ మ్యాచ్ కాన్ఫరెన్స్‌లో విరాట్ పేర్కొన్నాడు. కాగా గతేడాది సీజన్‌లో కోహ్లి స్ట్రైక్ రేట్‌పై భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ విమర్శలు చేశార. సింగిల్స్ తీస్తూ కోహ్లి చాలా నిదానమైన ఇన్నింగ్స్ ఆడాడని, ఆర్సీబీ ఇలాంటి ప్రదర్శను ఆశించట్లేదని గవాస్కర్ మండిపడ్డారు. అదేవిధంగా ఆర్సీబీ జట్టులో బిగ్ హిట్టర్లు ఉన్నప్పటికి కోహ్లి ఎటవంటి రిస్క్ తీసుకోకుండా స్లోగా ఆడాడని ఆయన అన్నారు. ఆ తర్వాత గవాస్కర్‌కు కోహ్లి కౌంటరిచ్చాడు. "చాలా మంది వ్యక్తులు నా స్ట్రైక్‌రేటు గురించి, స్పిన్‌లో సరిగా ఆడట్లేదని మాట్లాడుతున్నారు. జట్టుకు విజయం అందించడమే నా లక్ష్యం. మీరు పరిస్థితులను ఎదుర్కోకుండా కామెంటరీ బాక్స్‌లో కూర్చొని మాట్లాడటం సరికాదు" అని కోహ్లి పేర్కొన్నాడు. ఆ తర్వాత గవాస్కర్ కూడా కోహ్లి వ్యాఖ్యలకు బదులిచ్చారు. కోహ్లి స్ట్రైక్ రేట్‌పైన మాత్రమే కామెంటేటర్‌లు మాట్లాడారు. అంతే తప్ప ఆటగాళ్లను వ్యక్తిగతంగా టార్గెట్ చేయాలనే ఆలోచన ఏ వ్యాఖ్యతకు లేదు. ఓపెనర్‌గా వచ్చి.. 14-15 ఓవర్ వరకు క్రీజులో ఉండి, 118 స్ట్రైక్‌రేటుతో బ్యాటింగ్ చేస్తే పొగడ్తలు ఉండవు అని గవాస్కర్ రిప్లే ఇచ్చాడు. ఇప్పుడు మరోసారి కోహ్లి వ్యాఖ్యలు చూస్తే గవాస్కర్‌కే కౌంటిరిచ్చినట్లు అన్పిస్తోంది.

# సినిమా చిత్రం

## 'సింగిల్' ట్రైలర్.. అబ్బాయిల కోసం శ్రీ విష్ణు లవ్ టిప్స్

తెలుగు సినిమా ప్రేక్షకుల ముందుకు మరో రొమాంటిక్ కామెడీ సినిమా రాబోతోంది. ఎంటర్టైన్‌మెంట్ కింగ్ శ్రీ విష్ణు ప్రధాన పాత్రలో నటించిన 'సింగిల్' సినిమా ట్రైలర్ లేటెస్ట్ గా విడుదలైంది. గీతా ఆర్ట్స్ సమర్పణలో, కాల్య ఫిలిమ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. కేతికా శర్మ, ఇవానా హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఎంటర్టైన్మెంట్ కు న్యూ డోస్ ఇవ్వబోతున్నట్లు ట్రైలర్ స్పష్టంగా చెబుతోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే నవ్వులు పూయించేలా ఉంటుంది. శ్రీ విష్ణు ప్రేమలో విజయవంతం కావాలంటే మూడు






టిప్స్ అంటూ చెప్పడం ఫన్‌గా కనిపించింది. ముద్దుగా మంచి అబ్బాయిగా కనిపించడం, తరువాత బ్యాడ్ బాయ్ యాటిట్యూడ్ చూపించడం, చివరగా మాస్ వాయిస్‌లో రౌడీగా మారడం వంటి మూడు దశలను ఫన్నీగా చూపించారు. ఈ క్రమంలో పూర్వ అనే అమ్మాయిని ప్రేమించగా, మరో అమ్మాయి హరిణి గుండె లోతుల్లో ప్రేమను పంచుకుంటోంది. ఇలా ట్రయాంగిల్ లవ్ లో కథ నడుస్తుందని అర్థమవుతోంది. ఈ కథనానికి సరదా గమ్మత్తైన ట్రీట్‌మెంట్‌తో కాంబినేషన్ ఇచ్చారు. శ్రీ విష్ణు టైమింగ్, డైలాగ్ డెలివరీ ట్రైలర్‌లోనే ప్రేక్షకులను ఆకట్టు కున్నాయి. ముఖ్యంగా బాలకృష్ణ స్టైల్‌ను అనుకరిస్తూ ఇచ్చిన మిమిక్రీ సీన్ నవ్వులు తెప్పించనుంది. కేతికా శర్మ, ఇవానా నాలు కూడా తమ క్యారెక్టర్‌లకు పర్ఫెక్ట్ గా సరిపోయారు. వెన్నెల కిషోర్ కామెడీ సీన్స్ ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టెక్నికల్‌గా చూస్తే, సినిమాకు బలమైన సపోర్ట్ కనిపిస్తోంది. ఆర్. వెల్‌రాజ్ సినిమాటోగ్రఫీ విజువల్స్‌కు స్పెషల్ లుక్ ఇచ్చింది. విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ సినిమాకి ఎనర్జీని పెంచింది. ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ స్పీడ్‌తో సినిమా రీతిని క్లీన్‌గా తీసుకెళ్లేలా ఉంది. గీతా ఆర్ట్స్, కాల్య ఫిలిమ్స్ నిర్మాణ విలువలు సినిమా ప్రమోషన్స్‌లోనే హై స్టాండర్డ్‌గా కనిపిస్తున్నాయి. ఈ వేసవిలో మజా కోరుకునే ప్రేక్షకులకు 'సింగిల్' సినిమా మంచి ట్రీట్ అవుతుం దనడంలో సందేహం లేదు. మే 9న థియేటర్లలో విడుదలకానున్న ఈ సినిమా యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ రెండింటినీ ఆకట్టుకునేలా టచ్ చేస్తుందని ట్రైలర్ చూపిస్తోంది.

మరి శ్రీ విష్ణు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందు కుంటాడో చూడాలి.

## 'ప్రేమలు' కంటే సాలీడ్ గా జింఖానా మ్యాజిక్

ఈ మధ్యకాలంలో యూత్ ను ఆకట్టుకునే సినిమాలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. 'జాతి రత్నాలు', 'మ్యాడ్' వంటి సినిమాల విజయా నంత రం, మళ్ళీ అలాంటి ఫీల్ ఉన్న మూవీకి తెలుగు ప్రేక్షకులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మలయాళ హిట్ మూవీ 'అలప్పుఝ జింఖానా'ను తెలుగులో 'జింఖానా' పేరుతో విడుదల చేశారు. 'ప్రేమలు' తో గుర్తింపు తెచ్చు కున్న నెస్లాన్ కె గఫూర్ ప్రధాన పాత్రలో నటించిన ఈ మూవీ, విడుదలైన మొదటి షో నుంచే మంచి టాక్ తెచ్చుకుంది. 'జింఖానా' సినిమాకు యువత నుండి ఊహించని రెస్పాన్స్ లభిస్తోంది. ముఖ్యంగా మొదటి రోజు నుండి పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్ తెచ్చుకున్న ఈ సినిమా, మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ సాధించి లాభాల దిశగా పరుగులు పెట్టుతోంది. మలయాళ డబ్బింగ్ సినిమాగా వచ్చి, స్ట్రైట్ తెలుగు సినిమాల రేంజ్ లో రెస్పాన్స్ దక్కించుకోవడం విశేషం. కథలోని నేటివిటీ టచ్, పంచ్ డైలాగ్స్, చక్కటి సంగీతం సిని మాకు అదనపు బలంగా నిలుస్తున్నాయి. తాజా సమాచారం



ప్రకారం, 'ప్రేమలు' మూవీని మించిపోయేలా 'జింఖానా' వసూళ్లు దూసుకు పోతున్నాయి. థియేటర్స్ లో హౌస్‌ఫుల్ బోర్డులు మారుమోగుతున్నాయి. నైజాంలో ఇప్పటికే థియేటర్ కౌంట్ పెరిగిందని ట్రేడ్ వర్గాలు తెలిపాయి. నెస్లాన్ నటనకు, సినిమాలోని మ్యూజిక్‌కు యూత్ ఫిదా అయి ఎపోయారు. ముఖ్యంగా క్యాచీ పంచ్ లైన్స్ యువతను బాగా ఆకర్షిస్తున్నాయి. దర్శకుడు ఖలీద్ రెహమాన్ 'తల్లుములు' తర్వాత తెరకెక్కించిన ఈ సినిమా, ఫన్ ఎమోషన్ తో ప్రేక్షకులను మెప్పిస్తోంది. బాక్సింగ్ అకాడమీ నేపథ్యంలో నడిచే కథలో స్నేహం, ప్రేమ, జీవన ప్రయాణం లాంటి అంశాలు బాగా సెట్ట య్యాయి. మ్యూజిక్ కూడా సినిమాకు మంచి మైలేజ్ వచ్చింది. థియేటర్లలో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కి ప్రేక్షకులు చప్పట్లు కొడుతున్న దృశ్యాలు కనిపి స్తున్నాయి. మొత్తం మీద ఈ వేసవి సీజన్‌లో 'జింఖానా' ఓ మినీ సెన్సేషన్ క్రియేట్ చేసింది. సర దాగా నవ్విస్తూ, లైట్ హార్ట్ ఎమోషన్ అందించిన ఈ సినిమా, ఫ్యామిలీస్‌కు, యూత్‌కు ఓ పర్ఫెక్ట్ ఎంట ర్టైన్‌మెంట్ గా నిలుస్తోంది. ఇలాంటి సినిమాలు సీజ నల్ బాక్స్ ఆఫీస్‌కు మంచి ఊపును ఇస్తాయి. కం టెంట్ ఉన్న సినిమాలపై తెలుగు ప్రేక్షకులు చూ పిస్తున్న స్పందనకు ఇది మరో ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పవచ్చు.

## హిట్3.. ఫస్ట్ రివ్యూ ఇచ్చేసిన శేష్!



నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో వాల్‌పోస్టర్ సినిమాస్ బ్యానర్ నిర్మించిన సినిమా హిట్3. హిట్‌వర్స్ లో భాగంగా తెరకెక్కిన ఈ సినిమా మే 1న రిలీజ్ కాబోతుంది. ప్రమోషన్స్ లో భాగంగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ఆదివారం నిర్వహించారు. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు హిట్2 హీరో అడివి శేష్ హాజరై, హిట్3 మొదటి రివ్యూ ను స్టేజ్ పై చెప్పేశాడు. ఈ ఈవెంట్ కు తాను ఫ్యామిలీ మెంబర్ లా వచ్చానని, నాని తనకు పెద్దన్నలాంటి వాడని, తన సినిమాకు సంబంధించిన పెద్ద ఫంక్షన్ జరుగుతుంటే తాను రాకుండా ఎలా ఉంటానన్న శేష్, ఆల్రెడీ తాను హిట్3 లోని ఆఖరి 30 నిమిషాలు చూశానని, స్టన్నింగ్ గా ఉందని చెప్పాడు.

హిట్3లో ఎన్నో సర్‌ప్రైజ్‌లు ఉంటాయని, సినిమా లాస్ట్ 30 మినిట్స్ క్రేజీగా ఉందని చెప్పాడు. అంతేకాదు, సినిమాలోని సర్‌ప్రైజ్ లు చూడ్డానికి తాను కూడా అందరితో పాటూ ఎగ్జైటింగ్ గా ఉన్నానన్నాడు. శైలేష్ ఎంతో టాలెంటెడ్ అని సినిమాలను చాలా వేగంగా పూర్తి చేస్తాడని, తాను గూఢచారి2 మూవీ అనౌన్స్ చేసి 60% షూటింగ్ పూర్తి చేసేసరికి శైలేష్ హిట్3ను అనౌన్స్ చేసి, షూటింగ్ చేసి, రిలీజ్ కు రెడీ చేశాడని, ఈ ఫాస్ట్ వర్కింగ్ ఏంటో తనకు కూడా నేర్పమని అడిగాడు. రాజమౌళి ముందు మాట్లాడాలంటే తనకు కొంచెం నెర్వస్ గా ఉంటుందని, తాను శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఫిల్మ్ స్కూల్ లో ట్రైనింగ్ తీసుకున్నప్పటికీ బాహుబలినే తనకు పెద్ద యాక్టింగ్ స్కూల్ అని, అసలు పట్టుదల అనేది తాను అక్కడే నేర్చుకున్నానని, అక్కడ నేర్చుకున్నదే తాను ఇప్పుడు కెరీర్లో అప్లై చేసుకుంటూ ముందుకెళ్తానని, అందుకే రాజమౌళి ఎప్పుడు కనిపించినా ఆయన్ని చూసి జస్ట్ స్మైల్ ఇచ్చి వెళ్లడం తప్ప పెద్దగా మాట్లాడనని, ఆయన ముందు మాట్లాడటానికి తనకేం ఉండదని శేష్ తెలిపాడు.

ఈ మధ్య సోషల్ మీడియా వాడకం బాగా పెరిగిందని, సినిమా బావుంటే దాన్ని వైరల్ చేయడానికి అందరూ రెడీగా ఉన్నారని, హిట్3 సినిమా ఆ రేంజ్ లో హిట్ అవుతుందని, ఈ సినిమాతో నాని బ్రో మాస్సివ్ హిట్ అందుకోబోతున్నాడని, మే 1 నుంచి బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురవడం ఖాయమని శేష్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చాడు. అయితే శేష్ చెప్పిన సర్‌ప్రైజుల్లో ఒక సర్‌ప్రైజ్ తన క్యామియో అని అదే ఈవెంట్ ఫైట్ మాస్టర్ సతీష్ లీక్ చేశాడు.

## హిట్ సెంటిమెంట్ పట్టేసిన శ్రీనిధి

తెలుగు రాష్ట్రాల్లో పుట్టి, ఇక్కడే పెరిగినప్పటికీ కొంతమంది ప్రీ రిలీజ్ ఈవెంట్లలో, ప్రెస్ మీట్లలో తెలుగులో కాకుండా ఇంగ్లీష్ లో మాట్లాడుతూ ఉంటారు. కానీ పక్క రాష్ట్రం నుంచి వచ్చిన హీరోయిన్లు మాత్రం తెలుగు భాష మీద, తెలుగు ఆడియన్స్ మీద ప్రేమతో కష్టపడి తెలుగు నేర్చుకుని మరీ స్పష్టంగా మాట్లాడాలని ట్రై చేసి, తెలుగులో మాట్లాడి ఇంప్రెస్ చేస్తున్నారు. ఇప్పుడు శ్రీనిధి శెట్టి కూడా ఈ బాటలోనే వెళ్తుంది. కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాల్లో హీరోయిన్ గా నటించిన శ్రీనిధి ఎలాంటి క్రేజ్ అందుకుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. సినిమాల్లోకి రాకముందు శ్రీనిధి మంచి స్టూడెంట్. టెన్త్ లో 98% మార్కులతో టాపర్ గా నిలిచిన అమ్మడు, కాలేజ్ లో కూడా టాపరేనట. చదువయ్యాక మోడలింగ్ లోకి అడుగుపెట్టి మిస్ కర్ణాటక కిరీటాన్ని అందుకున్న శ్రీనిధి ఆ తర్వాత హీరోయిన్ గా మారి మంచి సక్సెస్ ను, క్రేజ్ ను అందుకుంది. అలాంటి శ్రీనిధి ఇప్పుడు హిట్3 సినిమా ద్వారా టాలీవుడ్ కు ఎంట్రీ ఇస్తోంది. హిట్3 ప్రీ రిలీజ్ ఈవెంట్ లో శ్రీనిధి మాట్లాడిన స్పీచ్ అందరినీ ఆకట్టుకుంది. ఈ ఈవెంట్ లో శ్రీనిధి ఆల్మోస్ట్ 10 నిమిషాలు మాట్లాడగా, అందులో ఎక్కువగా తెలుగే మాట్లాడింది. శ్రీనిధి స్పీచ్ లో మధ్యలో అక్కడక్కడా కొన్ని తప్పులున్నప్పటికీ తెలుగులోనే మాట్లాడాలనే శ్రీనిధి తపన ముందు ఆ తప్పులు ఎవరికీ పెద్దగా కనిపించలేదు. హిట్3



సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని చెప్పిన శ్రీనిధి శెట్టి, నాని సర్ చాలా మంచి ప్రొడ్యూసర్ అని, వాల్ పోస్టర్ సినిమాస్ చాలా మంచి ప్రొడక్షన్ హౌస్ అని, నాని గారు, ప్రశాంతి గారు తనను ఎంతో బాగా చూసుకున్నారని చెప్పింది. ఇప్పటివరకు తాను హిట్3 కోసం నాని గారితో కలిసి 30కి పైగా ఇంటర్వ్యూలిచ్చానని, మూడేళ్ల తర్వాత ఆడియన్స్ ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉండటంతో పాటూ ఎగ్జైటింగ్ గా ఉందని శ్రీనిధి చెప్పుకొచ్చింది. తాను కాలేజ్ లో ఉన్నప్పుడు నాని సినిమాలు చూశాన ఎన్నోని, అప్పట్నుంచే నాని గారితో సినిమా చేయాలని కోరిక ఉండేదని, ఆ కోరిక ఇంత త్వరగా తీరుతుందనుకోలేదని, ఈ విషయంలో తాను చాలా గ్రేట్ గా ఫీలవుతున్నట్టు చెప్పిన శ్రీనిధి, మాట వరసకు నానిని నాని గారు అని పిలుస్తున్నానని కూడా చెప్పింది. ఇక రాజమౌళి గురించి మాట్లాడుతూ, తన మొదటి సినిమా కెజిఎఫ్ మూవీ ఆడియో లాంచ్ కు గెస్ట్ గా రాజమౌళినే వచ్చారని, ఇప్పుడు మళ్లీ హిట్3 కు కూడా మీరే వచ్చారని, కెజిఎఫ్ ఈవెంట్ కు కూడా సుమనే యాంకర్, ఈ సినిమాకు కూడా సుమనే యాంకర్ అని.. రాజమౌళి, సుమ, శ్రీనిధి ఈ కాంబినేషన్ మరోసారి రిపీట్ అయింది కాబట్టి, కెజిఎఫ్ లానే ఈ సినిమా కూడా హిట్ అవుతుందని శ్రీనిధి నమ్మకం వ్యక్తం చేసింది.

## మూడో బిడ్డతో శ్రీలీల

హీరోయిన్ శ్రీలీల వయసు చిన్నదే కానీ ఆమె ఆలోచన విధానం చాలా పెద్దది. నిండా పాతికేళ్లు లేని ఈ హీరోయిన్ ఎంతో మంది హీరోలు, హీరోయిన్స్ చేయలేని పనిని చేస్తూ తన మంచి మనసు చాటుకుంటుంది. సాధారనంగా అనాధలకు సహాయంగా నిలిచేందుకే పలువురు సెలబ్రిటీలు ఆసక్తి చూపించరు. అలాంటిది శ్రీలీల ఏకంగా ఇద్దరు వికలాంగులు అయిన పిల్లలను దత్తత తీసుకుని వారి ఆలనా పాలన చూస్తూ, తాను కూడా సమయం దొరికినప్పుడు వారితో ఆడుకుంటూ కనిపిస్తూ ఉంటుంది. శ్రీలీల ఇద్దరు పిల్లలను ఎంతో అల్లారు ముద్దుగా చూసుకుంటూ వారికి కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తూ ఉంటుంది. శ్రీలీల మంచితనం గురించి ఎంత చెప్పినా తక్కువే అంటూ ఆమె అభిమానులు అంటూ ఉంటారు. ఇప్పటికే ఇద్దరు పిల్లలకు తల్లిలా ఆలనా పాలన చూసుకుంటూ ఉన్న శ్రీలీల మరో పాపను తన ఇంటికి తీసుకు వచ్చినట్లు చెప్పుకొచ్చింది. ఒక చిన్నారికి ముద్దు పెడుతూ ఉన్న ఫోటోను శ్రీలీల షేర్ చేసింది. ఆ ఫోటోతో పాటు... ఇంటికి మరొకరు, హృదయాలను నింపేందుకు ఈ పాప వచ్చింది అన్నట్లుగా కామెంట్ పెట్టింది. ఇప్పటికే ఇద్దరు పిల్లలను దత్తత తీసుకున్న శ్రీలీల మరో పాపను దత్తత తీసుకోవడం అనేది చాలా గొప్ప విషయం. ఆమె యొక్క మంచితనం ముందు ఇతర స్టార్ హీరోలు, హీరోయిన్స్ బలాదూర్ అంటూ కామెంట్ చేస్తున్నారు. ముందు ముందు ఈమె మరింత మందికి సహాయం గా నిలవాలని అభిమానులు కోరుకుంటున్నారు. అందమైన రూపం ఉన్నవారికి అందమైన మనసు ఉండదని కొందరు అంటూ ఉంటారు. కానీ శ్రీలీల మాత్రం అందంగా ఉండటంతో పాటు అంత మంచి మనసు కలిగి ఉన్నది అనడంలో సందేహం లేదు. నటిగా ఎంత బిజీగా ఉన్నా ఆ పిల్లలతో సరదాగా సమయంను గడిపేందుకు శ్రీలీల సమయం కేటాయిస్తూ ఉంటుంది. పుష్ప 2 సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో దక్కిన గుర్తింపు కారణంగా హిందీలో ఒక సినిమాను ఈమె చేసే అవకాశం దక్కించుకుంది. త్వరలోనే ఈమె



మరో భారీ తెలుగు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. తెలుగులోనే కాకుండా తమిళ్, హిందీ సినిమాల్లోనూ ఈమె బిజీ బిజీగా సినిమాలు చేస్తూ వస్తోంది. కన్నడ సినిమాలతో చిన్న వయసులోనే సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన శ్రీలీల తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో అడుగు పెట్టింది. తెలుగు సినిమా పెళ్లి సందడితో టాలీవుడ్‌లో పరిచయం అయింది. ఆ సినిమా డిజాస్టర్‌గా నిలిచినా తన అందంతో పాటు తన డాన్స్‌తో ప్రేక్షకులను మెప్పిం చింది. ఫిల్మ్ మేకర్స్‌కి ఈమె తెగ నచ్చడంతో తమ సినిమాల్లో వరుసగా ఆఫర్లు ఇస్తున్నారు. ఈమెకు టాలీవుడ్‌లో ధమాకాతో మొదటి విజయం దక్కింది. ఆ తర్వాత నుంచి ఏడాదికి మూడు నాలుగు సినిమాల చొప్పున ఆఫర్లు వస్తున్నాయి. రవితేజతో కలిసి ధమాకా తర్వాత మరో సినిమాను చేస్తోంది. ఇంకా పలు తెలుగు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో మరో రెండు మూడు సినిమాలతో శ్రీలీల ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



## ఒంటరి బీచ్‌ని మరిగించిన క్రేజీ బ్యూటీ!

బికినీలు.. స్విమ్ సూట్లు .. టూపీస్.. కాదేదీ సెలబ్రేషన్ కి అనర్హం! ఒంటిపై పరిమితమైన దుస్తుల్లో కనిపించడం ట్రిప్తి దిమ్రీ ప్రత్యేకత. ఇంటర్నెట్ ని %-%యానిమల్%-% చిత్రంలో కనిపించింది కొన్ని నిమిషాలే అయినా కుర్రకారు మైండ్ లో తిష్ఠ వేసుకుని కూచోడానికి ఈ అమ్మడి గ్లామర్ షో, ఎక్స్ పోజింగ్ ఒక ప్రధాన కారణం. ముఖ్యంగా సందీప్ వంగా ట్రిప్తీని ఎలివేట్ చేసిన తీరు అలాంటిది. ట్రిప్తీ అందానికి ఆకర్షితుడయ్యే పంజాబీ ధనికుడు రణ్ విజయ్ గా రణబీర్ తో సీన్లు రక్తి కట్టించాయి. అయితే ఇప్పుడు అదే ఫ్లేవర్ ని నిజ జీవితంలోకి అనువర్తించింది ట్రిప్తీ. ఈ అమ్మడు పబ్లిక్ లో కనిపించినా లేదా ఒంటరి బీచ్ లలో కనిపించినా ఇంచుమించు ఆడియెన్ తనతో ఏ ఉద్ధేశంతో కనెక్టయి ఉన్నారో దానిని అందించే ప్రయత్నం చేస్తూనే ఉంది. ఇప్పుడు ఒంటరి బీచ్ లో టూపీస్ లో ప్రత్యక్షమై మరోసారి వేడి పెంచింది. బీచ్ రిసార్ట్ లో ట్రిప్తీ టోన్డ్ బాడీని ఎలివేట్ చేస్తూ ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్







షేక్ చేస్తోంది. దీనికి ప్రశాంతతలో మునిగి పోనిద్దాం! అంటూ సరదా క్యాప్షన్ ని ఇచ్చింది. వైట్ బికినీ టాప్- మినీ స్కర్ట్ లో ట్రిప్తి టోన్డ్ బాడీ ప్రత్యేకంగా హైలైట్ అవుతోంది. ముఖ్యంగా రిసార్ట్ లో ట్రిప్తి స్వేచ్ఛా విహారం అందరి దృష్టిని ఆకర్షించింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే ట్రిప్తి ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తోంది. భూల్ భూలైయా 3 సహనటి మాధురీ దీక్షిత్‌తో %-%మా బెహన్%-% అనే కామెడీ డ్రామాలో నటించనుంది. మొదటిసారిగా విశాల్ భరద్వాజ్ %-%అర్జున్ ఉస్తారా%-%లో షాహిద్ కపూర్ సరసన నటిస్తోంది. సిద్ధాంత్ చతుర్వేదితో రొమాంటిక్ డ్రామా %-%ధడక్ 2%-% చిత్రీకరణలోను ట్రిప్తి బిజీగా ఉంది. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం జాన్వీ 2018 హిట్ %-%ధడక్%-%కు సీక్వెల్.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed at Gayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDY EMAIL: Localguide9999@gmail.com web:www.localguidenews.com,contact:8977761499